సెప్టెంబర్
2019

161

సంపుటి : 14 సంచిక : 5 వెల రు. 10/-

## ఈ సంచికలో........

కాశ్మీర్‌లో ఏం జరుగుతోంది?
ముంచుకొస్తున్న ఆర్థిక మాంద్యం
తెలంగాణాలో 1948 సెప్టెంబర్ 17న ఏం జరిగింది?
కొత్త రాతియుగం: భారతదేశం
పెట్టుబడిదారీ వ్యవస్థ, జనాకర్షణవాదం: సంక్షోభంలో ఉదారవాదం
జాతీయోద్యమాన్ని ప్రజాఉద్యమంగా మార్చిన జలియన్‌వాలా బాగ్
కాశ్మీర్ విచ్ఛిన్నం: దేశ సమైక్యతకు ప్రమాదం
సంఘ్ పరివార్ దురాగతాలకు తెరపడుతుంది
ఆదర్శ నేత పోపూరి రామారావు

# ఆదర్శనేత పోపూరి రామారావు

నూతలపాటి కాళిదాసు

గుంటూరు జిల్లాలో భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)లో ముఖ్యపాత్ర పోషించిన కామ్రేడ్ పోపూరి రామారావు ఆగస్టు 11వ తేదీన మరణించారు. పోపూరి రామారావు గుంటూరు జిల్లాలో మండల కేంద్రమైన యడ్లపాడు గ్రామంలో 1940 జనవరి 1న పోపూరి హనుమయ్య, రాజమ్మ దంపతులకు జన్మించారు. 1940వ దశాబ్దంలో కమ్యూనిస్టు ఉద్యమం, అభ్యుదయ ఉద్యమాలు వెల్లువలా సాగుతున్న కాలం. సోవియట్ యూనియన్‌లో సోషలిజం సాధిస్తున్న విజయాలు ప్రపంచంలోని పీడిత ప్రజలకు ఉత్తేజం కలిగిస్తున్న కాలం. రెండవ ప్రపంచయుద్ధంలో సోవియట్ యూనియన్ హిట్లర్ నాజీయిజాన్ని ఓడించటం, అంతర్జాతీయంగా జరుగుతున్న అనేక పరిణామాలతో కమ్యూనిస్టు ఉద్యమం దేశదేశాలకూ విస్తరిస్తున్నది. ప్రపంచవ్యాపితంగా వలస విధానానికి వ్యతిరేకంగా జాతీయ స్వాతంత్ర్యం కోసం పోరాటాలు విస్తరిస్తున్నవి. ఈ ప్రభావాలతో దేశంలోనూ, రాష్ట్రంలోనూ జాతీయోద్యమం ఉవ్వెత్తున సాగుతున్న కాలం అది. కమ్యూనిస్టు ఉద్యమం కార్మికులు, రైతులు, పీడిత ప్రజల సమస్యలు తీసుకొని పనిచేస్తూ, సామాన్య ప్రజలలో స్థానం సంపాదించుకొంటున్నది. జాతీయ, అంతర్జాతీయ రాజకీయాలను గురించి సామాన్య ప్రజలు కూడా చర్చించుకొంటున్న కాలం. సంఘ సంస్కరణోద్యమాలు సాగుతున్నాయి. కుల, మతాలకు వ్యతిరేకంగా, మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా శాస్త్రీయ భావాల ప్రచారం జరుగుతున్నది. అటువంటి రాజకీయ పరిణామాలు సాగుతున్న కాలంలో యడ్లపాడు గ్రామంలోనూ కమ్యూనిస్టు భావాలు విస్తరించాయి. కమ్యూనిస్టు పార్టీ శాఖ ఏర్పడింది. యువజన సంఘం ఏర్పడి, చురుకుగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నది. అటువంటి వాతావరణంలో పోపూరి రామారావు చిన్నతనంలోనే బాలల సంఘంలో పనిచేస్తూ, కమ్యూనిస్టు భావజాలాన్ని వంటపట్టించుకున్నారు. 1960లో తన 20వ ఏటనే పార్టీ సభ్యత్వం తీసుకున్నాడు. పార్టీ చీలిన



తర్వాత సిపియం శాఖ కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తూ, యడ్లపాడు చుట్టుపట్ల గ్రామాలు, చిలకలూరిపేట డివిజన్‌లో కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) అభివృద్ధికి కృషిచేశారు. పార్టీ జిల్లా కమిటి సభ్యునిగా, కార్యదర్శివర్గ సభ్యునిగా సుదీర్ఘకాలం పనిచేశారు. వివిధ సమస్యలపై కమిటి, కార్యదర్శివర్గాలలో చర్చలు జరిగేటపుడు తన అభిప్రాయాలను నిర్మొహమాటంగా చెప్పేవారు. పార్టీ చిలకలూరిపేట డివిజన్ కార్యదర్శిగా సుదీర్ఘకాలం పనిచేశారు. ముఖ్యంగా రైతు సంఘం చిలకలూరిపేట డివిజన్ కార్యదర్శిగా, జిల్లా అధ్యక్షునిగా రైతుసంఘాన్ని అభివృద్ధి చేయటానికి కృషిచేశారు. 1970,80దశాబ్దాలలో పత్తి రైతాంగం దుర్భరమైన పరిస్థితులను ఎదుర్కొన్నారు. పత్తిరైతుల ఆత్మహత్యలు ప్రారంభమైనాయి. ఆ సందర్భంలో కేంద్ర, రాష్ట్ర రైతునాయకులతో కలిసి, ఆత్మహత్యల కారణాలను వెలికి తీయటానికి, రైతాంగ సమస్యలను విస్తృతంగా ప్రచారం చేయటానికి కృషిచేశారు. 2010లో గుంటూరులో జరిగిన ఎ.ఐ.కె.యస్ అఖిలభారత మహాసభలను జయప్రదం చేయటానికి కృషిచేశారు. ప్రజానాట్యమండలి జిల్లా కన్వీనర్‌గా, చాలా కాలంపాటు గైడ్‌గా వ్యవహరించారు. వివిధ డివిజన్లలో పాటలు, నాటికల దళాలను ఏర్పాటు చేయటాన్ని ప్రోత్సహించారు. ఆయన కొన్ని నాటికలను రచించి ప్రదర్శింపచేశారు.

1970లో యడ్లపాడు సర్పంచ్‌గా ఎన్నికై 11 ఏళ్ళ పదవీకాలంలో గ్రామాభివృద్ధి కోసం పనిచేశారు. గ్రామంలోని 25 ఎకరాల ఎర్రచెరువులో ఇళ్లులేని పేదలతో ఇళ్లు వేయించి, కాలనీ ఏర్పాటు చేశారు. గ్రామంలోని అనేకమంది కాలనీ ఏర్పాటును వ్యతిరేకించినా ఇళ్ళులేని పేదల తరఫున ఆయన దృఢంగా నిలబడి ఇళ్ళు వేయించటానికి తోడ్పడ్డారు. ఆయన మరణానంతరం ఆ కాలనీకి ఇటీవల పోపూరి రామారావు నగర్‌గా అక్కడ నివసించే ప్రజలు నామకరణం చేసుకున్నారు. గ్రామంలోని అభ్యుదయ శక్తులు, మద్యం వ్యతిరేక శక్తులను కూడగట్టి తన పదవీకాలంలో గ్రామంలో మద్యం షాపు ఏర్పడకుండా నివారించి, అదే విధంగా 25 ఏళ్లపాటు గ్రామంలో మందుషాపు ఏర్పాటు చేయకుండా నిలువరించటానికి ప్రజల్లో చైతన్యం తేగలిగాడు.

ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజలలో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. పార్టీ ఇతర ప్రతిపక్ష పార్టీలను సమీకరించి అఖిలపక్ష ఉద్యమాన్ని ప్రారంభించింది. బహిరంగసభలు, ధర్నాలు, ప్రదర్శనలు, రాస్తారోకోలు తదితర రూపాలలో సంవత్సరం పాటు ఈ ఉద్యమం సాగింది. ఈ ఉద్యమం లేవనెత్తిన అనేక కోర్కెలను ప్రభుత్వం అమలుచేయాల్సి వచ్చింది. చిలకలూరిపేట ప్రాంతంలో ఈ ఉద్యమాన్ని జయప్రదం చేయటానికి రామారావుగారు అన్ని విధాలుగా కృషి చేశారు.

తన 60 ఏళ్ల సుదీర్ఘ ఉద్యమ జీవితంలో మచ్చలేని మార్క్సిస్టు నాయకుడిగా, ప్రజాప్రతినిధిగా, స్వీయ క్రమశిక్షణ వంటి ప్రత్యేక లక్షణాలతో తుది శ్వాస విడిచే వరకూ నమ్మిన సిద్ధాంతం కోసం పనిచేసిన నాయకుడు కామ్రేడ్ పోపూరి రామారావు. ఉద్యమాభివృద్ధికి, గ్రామాభివృద్ధికి ఎంతో విలువైన తన 8 ఎకరాల భూమిని సైతం అమ్ముకొని, అందుకు భార్య అంజమ్మ, కుటుంబ సభ్యులను సైతం ఒప్పించిన గొప్ప త్యాగశీలి. పార్టీలో చేరిన నాటి నుండి మరణించే చివరి రోజు వరకూ మార్క్సిజం పట్ల అచంచలమైన విశ్వాసంతో పనిచేశారు. గ్రామీణ ప్రాంతంలో

(మిగతా 35వ పేజీలో)

## ఈ సంచికలో...


**1. ఆదర్శ నేత పోపూరి రామారావు**

నూతలపాటి కాళిదాసు ... 2

**2. కాశ్మీర్‌లో ఏం జరుగుతోంది?**

నిజనిర్ధారణ కమిటీ ..... 4

**3. ముంచుకొస్తున్న ఆర్థిక మాంద్యం**

ఎస్‌. వెంకట్రావు ....... 10

**4. తెలంగాణాలో 1948 సెప్టెంబర్ 17న ఏం జరిగింది ?**

ఎస్‌. వీరయ్య........... 12

**5. కొత్త రాతియుగం: భారతదేశం**

ఎం.వి.ఎస్‌. శర్మ ....... 15

**6. పెట్టుబడిదారీ వ్యవస్థ, జనాకర్షణవాదం: సంక్షోభంలో ఉదారవాదం**

అఖీల్ బిల్‌గ్రామి........ 17

**7. జాతీయోద్యమాన్ని ప్రజాఉద్యమంగా మార్చిన జలియన్‌వాలా బాగ్**

కె. ఎల్‌. టుటేజా ...... 23

**8. కాశ్మీర్ విశ్ఛిన్నం:దేశ సమైక్యతకు ప్రమాదం**

ఎ. కోటి రెడ్డి ........... 30

**9. సంఘ్ పరివార్ దురాగతాలకు తెరపడుతుంది**

ఆనంద్ పట్వర్ధన్...... 33



**సంపాదకుడు:**

**ఎస్‌. వెంకట్రావు**

**సంపాదక వర్గం:**

**పాటూరు రామయ్య**

**బి.వి. రాఘవులు**

**తమ్మినేని వీరభద్రం**

**ఎస్‌. వీరయ్య**

**తెలకపల్లి రవి**

**భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ తరపున
ప్రచురణ కర్త, ముద్రాపకుడు:**బి.వి.రాఘవులు**
సంపాదకుడు : **ఎస్‌. వెంకట్రావు**
**ముద్రణ:** ప్రజాశక్తి ప్రింటర్స్ అండ్ పబ్లిషర్స్ ప్రై. లి., 14-12-19, కృష్ణనగర్, తాడేపల్లి(మ), గుంటూరు(జి)


**ఫోన్: ఎడిటర్ : 9490099333**
**మేనేజర్: కె.హరికిషోర్:9490098977, 9494101091**
email:venkataraosankarapu@gmail.com
email:marxistap@gmail.com
visit cpi(m) site at : cpim.org


# కాశ్మీర్

**దే**శమంటే మట్టి కాదోయ్, దేశమంటే మనుషులోయ్ అన్నాడు మహా కవి గురజాడ. కానీ ఆ గేయం రచించబడిన వందేళ్ల తరువాత కేంద్రంలో అధికారం చెలాయిస్తున్న బిజెపి నేతలకూ, మోడీ ప్రభుత్వానికీ దేశమంటే మనుషులు కాదు మట్టి మాత్రమే కనిపిస్తోందంటే దేశాన్ని వారు శతాబ్దాల వెనక్కు తీసుకుపోదలచుకున్నారని అర్థమవుతుంది. కాశ్మీర్ ప్రజలను భద్రతా వలయాల మధ్య బంధించి, ఆ రాష్ట్రానికి స్వయం ప్రతిపత్తి ప్రసాదించిన 370 అధికరణాన్ని రద్దుచేసిన తీరు, ఒక రాష్ట్రంగా మనగలగడానికి జమ్మూ-కాశ్మీర్‌కు ఉన్న హక్కును రద్దు చేసి దాన్ని రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా చేసిన తీరు చూస్తే మోడీ ప్రభుత్వానికి కాశ్మీర్ కావాలిగాని కాశ్మీర్ ప్రజలు వద్దన్న విషయం విదితమవుతుంది.

ప్రజాస్వామ్యం అంటే ప్రజల కొరకు, ప్రజల చేత, ప్రజల వలన అనే అర్థం నిజమైతే జమ్మూ-కాశ్మీర్ భవిష్యత్తును నిర్ణయించే ఇంతటి ముఖ్యమైన నిర్ణయాలు తీసుకునే ముందు ఆ రాష్ట్ర ప్రజల అభిప్రాయాలకు స్థానం కల్పించాలి. ఆ రాష్ట్ర శాసన సభ అభిప్రాయం తెలుసుకోవాలి. కానీ మోడీ ప్రభుత్వం కాశ్మీర్‌ను విభజించేటప్పుడు, దాని రాష్ట్ర ప్రతిపత్తిని రద్దు చేసేటప్పుడు అటువంటి ప్రజాస్వామ్య సాంప్రదాయాలను ఈషన్మాత్రమూ పట్టించుకోలేదు. చివరికి ఈ విషయంలో మన రాజ్యాంగాన్ని కూడా మోసం చేసి, రాజ్యాంగ నిబంధనలను తిమ్మిని బమ్మిని చేసి తన పని కానిచ్చుకుంది.

కాశ్మీర్ ప్రజల్లో నెలకొన్న అసంతృప్తి వల్ల అక్కడ గత కొంతకాలంగా జరుగుతున్న పరిణామాలకు చెక్ పెట్టేందుకే తాను ఈ నిరంకుశ చర్యలు తీసుకున్నట్లు మోడీ ప్రభుత్వం బుకాయిస్తోంది. మన దేశంలో కాశ్మీర్ 'విలీనం' కావడానికీ, ఆ రాష్ట్రం 'అభివృద్ధి' చెందడానికీ తన చర్యలు తోడ్పడతాయని నమ్మబలుకుతోంది. కానీ ఈ చర్యలవల్ల కాశ్మీర్ మట్టి మన దేశంలో విలీనం కావచ్చుగాక కానీ ఆ రాష్ట్ర ప్రజలు మాత్రం కారు. వారు మరింత వేరపడిపోతారు. నిజానికి కాశ్మీర్ మట్టి ఏనాడో మన దేశంలో విలీనమైంది. అక్కడి ప్రజలను విలీనం చేసుకోడానికే రాజ్యాంగంలో 370వ అధికరణాన్ని చేర్చారు నాటి పాలకులు. కానీ గడచిన ప్రభుత్వాలు ఈ అధికరణాన్ని సక్రమంగా అమలు చేయకపోవడం వల్ల, కాశ్మీరీ సంస్కృతి, జీవన విధానం అయిన 'కాశ్మీరియత్'పై దాడులకు దిగడం వల్ల కాశ్మీర్ ప్రజలు అసంతృప్తికి లోనై రానురాను వేర్పాటు బాట పడుతున్నారు. ఆ ప్రజలతో, వారి నేతలతో చర్చలు, సంప్రదింపులు జరపడం ద్వారా వారిని దేశప్రధాన స్రవంతిలోకి తీసుకు రావాల్సింది పోయి మోడీ ప్రభుత్వం తీసుకున్న చర్యలు వారిని మరింతగా పరాయీకరణకు గురిచేసే ప్రమాదం ఉంది.

భారత దేశం అనేక రాష్ట్రాల కలయిక (యూనియన్ ఆఫ్ స్టేట్స్) అని మన రాజ్యాంగం చెబుతోంది. అలాంటప్పుడు కాశ్మీర్‌ను విభజించి దాని రాష్ట్ర ప్రతిపత్తిని తొలగించడం అంటే రాజ్యాంగానికి వ్యతిరేకంగా వ్యవహరించడమే. రాష్ట్రాలను చీల్చి దేశాన్ని 60 భాగాలుగా చేసి కేంద్రీకృత పాలనా వ్యవస్థ నెలకొల్పాలన్నది ఆర్ఎస్ఎస్ ఎజెండా. ఈ ఎజెండా అమలు కాశ్మీర్‌తోనే ప్రారంభం కాలేదు, అక్కడితో ఆగిపోదు. మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది మొదలు ఫెడరలిజంపై దాడి చేస్తూ రాష్ట్రాల హక్కులను ఒక్కొక్కటిగా హరించి వేస్తున్నది. ఇటీవల అది చేసిన 40కి పైగా చట్టాల్లో అత్యధిక భాగం విద్య, వైద్యం, ఆర్థిక, ద్రవ్య రంగాల్లో రాష్ట్రాల అధికారాలను తగ్గించి కేంద్రం గుప్పెట్లో పెట్టుకునేవే. ఒకే దేశం ఒకే ఎన్నిక పేరుతో జమిలి ఎన్నికల కోసం కూడా అది పరుగుతీస్తోంది.

అందువల్ల ఈ రోజు కాశ్మీర్‌లో మోడీ ప్రభుత్వం తీసుకున్న ఫెడరల్ వ్యతిరేక, ప్రజాస్వామ్య వ్యతిరేక నిరంకుశ చర్యలకు రేపు ఇతర రాష్ట్రాలు, ఇతర ప్రజలు కూడా గురికాక తప్పదు. దురదృష్టమేమంటే ప్రతిపక్షంలో ఉన్న చాలా పార్టీలు, తెలుగు రాష్ట్రాలకు చెందిన ప్రధాన పార్టీలతో సహా "నేడు కాశ్మీర్ రేపు మనం" అన్న విషయాన్ని గుర్తెరగకుండా మోడీ ప్రభుత్వ చర్యలకు మద్దతిస్తున్నాయి. కాశ్మీర్ ప్రజల రాజ్యాంగ హక్కుల రక్షణ కోసం ప్రజాతంత్ర శక్తులన్నీ ఐక్యంగా ఉద్యమించాలి.


**చందా వివరాలు**

విడిపత్రిక: **రూ.10**, సంవత్సర చందా:**రూ.100**, పోస్టు ద్వారా **రూ. 120**

పోస్టు ద్వారా లేదా ఏజెంటు ద్వారా తెప్పించుకోవచ్చు.
లేదా మీ స్థానిక పార్టీ కార్యాలయంలో సంప్రదించండి.
ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలలోనూ లభిస్తాయి.

**చిరునామా**
**మేనేజర్,**
**మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక),**
**ఎం.బి. విజ్ఞానకేంద్రం,**
**డోర్ నెం. 27-30-3, ఆకులవారి వీధి,**
**గవర్నర్‌పేట, విజయవాడ-520 002**

ఈ మాసం ముఖ్యాంశం

# కాశ్మీర్‌లో ఏం జరుగుతోంది?



## రాష్ట్రంలో 5 రోజుల పర్యటన అనంతరం నిజనిర్ధారణ కమిటీ తెలిపిన వివరాలు

జమ్మూ-కాశ్మీర్‌లో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులపై కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ప్రచారంలో వాస్తవం లేదు. కాశ్మీర్ లోయ ప్రశాంతంగా ఉందని అవాస్తవాలను తమకు అనుకూలంగా ఉన్న కొన్ని మీడియా సంస్థలతో ప్రచారం చేయిస్తున్నది. ఆ సంస్థలు ప్రభుత్వ హెలికాప్టర్లు, ప్రభుత్వం అందించే ఇంటర్నెట్ ఉపయోగించుకొని ఇలాంటి అవాస్తవాలు ప్రచారం చేస్తున్నాయి. మరోవైపు జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ కూడా జమ్మూ-కాశ్మీర్‌లో వివిధ ప్రాంతాల్లో తిరిగి అక్కడి పరిస్థితులు సవ్యంగానే ఉన్నాయని సోషల్ మీడియాలో చిన్న చిన్న వీడియోలు పోస్టు చేశారు. కానీ ఆయన తన వెంట కొంత మందిని వేసుకొని తిరుగుతూ వారిచేత సంబరాలు చేయిస్తూ, ఆ వీడియోలను సోషల్ మీడియాలో పోస్టు చేస్తున్నారని విమర్శలు ఉన్నాయి. కాశ్మీర్‌లో పరిస్థితి అదుపులోకి వచ్చిందని ప్రభుత్వం చెబుతుంటే, అక్కడ పరిస్థితులు భయంకరంగా ఉన్నాయని, తీవ్రమైన కల్లోలానికి దారితీయొచ్చని పౌర సమాజం పేర్కొంటున్నది. కాశ్మీర్ పరిస్థితిని గురించి ఈ విధంగా భిన్నమైన వార్తలు వెలువడుతుండగా కాశ్మీర్ ప్రజలు మాత్రం తమ జీవితంలో అత్యంత దయనీయ స్థితిని ఎదుర్కొంటున్నారు. అంతర్జాతీయ మీడియా సంస్థల పరిశోధనల్లో కాశ్మీర్ ప్రజల ఆర్తనాదాలు వినిపిస్తున్నాయి.

**ఈ నేపథ్యంలో కాశ్మీర్‌లో వాస్తవ పరిస్థితులను తెలుసుకునేందుకు ప్రముఖ ఆర్థిక వేత్త జీన్ డ్రెజ్, అఖిల భారత ప్రజాతంత్ర మహిళ సంఘం (ఐద్వా) నాయకురాలు మొమునా మొల్లా, అఖిల భారత ప్రగతిశీల ప్రజాతంత్ర మహిళ సంఘం(ఎఐపిడబ్ల్యుఎ) నాయకురాలు కవితా కృష్ణన్, నేషనల్ అలయన్స్ ఆఫ్ పీపుల్స్ మూమెంట్(ఎన్ఎపిఎం) నేత విమల్‌భాయ్‌లతో కూడిన నలుగురు సభ్యుల నిజ నిర్ధారణ బృందం కాశ్మీర్‌లో ఆగస్టు 9 నుంచి 13 వరకు ఐదు రోజులు విస్తృతంగా పర్యటించింది. కేంద్ర ప్రభుత్వం ఆర్టికల్ 370, ఆర్టికల్ 35(ఏ) రద్దు, జమ్మూ కాశ్మీర్ రాష్ట్ర హోదా రద్దు, రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా విభజన చేసిన నాలుగు రోజుల తరువాత ఈ పర్యటన జరిగింది. నిజనిర్ధారణ బృందం తెలిపిన వివరాలను న్యూ ఢిల్లీలో ప్రజాశక్తి ప్రతినిధి జె. జగదీష్ మార్క్సిస్టుకు తెలియజేశారు. ఆ కథనాన్ని దిగువ ఇస్తున్నాం.....** ఎడిటర్

---

ఆగస్టు 9న శ్రీనగర్‌కు బృంద సభ్యులు చేరుకున్నారు. అక్కడ ప్రభుత్వం విధించిన కర్ఫ్యూ వల్ల నగరమంతా నిశ్శబ్దంగా, నిర్జనమైనదిగా ఉందని వారు గుర్తించారు. ఆ ప్రాంతమంతా ఇండియన్ ఆర్మీ, పారామిలటరీ దళాల ఆధీనంలో ఉంది. ఆగస్టు 5 నుంచే మొత్తం కర్ఫ్యూ నీడలో ఉంది. శ్రీనగర్ వీధులన్నీ నిర్మానుష్యంగా ఉన్నాయి. అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలతో సహా రోజువారీ జనజీవనానికి అవసరమైన వస్తు విక్రయ సంస్థలు కూడా మూసివేశారు. స్కూళ్ళు, కాలేజీలు, యూనివర్శిటీలు, గ్రంథాలయాలు, ప్రభుత్వ కార్యాలయాలు, బ్యాంకులు, పెట్రోల్ బంకులు, కిరాణా షాపులు సైతం మూత పడ్డాయి. కేవలం కొన్ని ఏటిఎంలు, మెడికల్ దుకాణాలు మాత్రమే ఉన్నాయి. ప్రజలు ఎక్కడికైనా వెళ్లాలంటే ఒకరు ఇద్దరు తప్ప, గుంపుగా వెళ్లడానికి వీలులేదు.

శ్రీనగర్‌కు లోపల, వెలుపలి ప్రాంతాల లోనూ వారు విస్తృతంగా పర్యటించారు. శ్రీనగర్ మధ్యలో చిన్న ఎన్‌క్లేవ్ ఉంది. అక్కడ నుంచే భారతీయ మీడియా పని చేస్తున్నది. ఆ చిన్న ఎన్‌క్లేవ్ నుంచే ప్రతిసారీ కాశ్మీర్‌లో సాధారణ పరిస్థితులు నెలకొని ఉన్నాయని, కాశ్మీర్ ప్రజల జీవనం కూడా సాధారణ స్థితికి చేరుకుందని మీడియా ప్రచారం చేస్తున్నది.

ఐదు రోజుల పర్యటనా సమయంలో శ్రీనగర్‌లో వందలాది మంది సాధారణ ప్రజలతో బృంద సభ్యులు మాట్లాడారు. అలాగే కాశ్మీర్‌లోని చిన్న చిన్న పట్టణాల్లో, గ్రామాల్లో ప్రజల గోడు విన్నారు. ఈ బృందం మహిళలు, స్కూల్, కాలేజీ విద్యార్థులు, షాప్ కీపర్స్, జర్నలిస్టులు, చిన్న చిన్న వ్యాపారస్తులు, రోజు వారీ కూలీలు, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్ లతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి వెళ్లి కాశ్మీర్‌లో పనులు చేస్తున్న వలస కార్మికులతోనూ సంభాషించింది. అలాగే కాశ్మీర్ లోయలో నివాసముంటున్న కాశ్మీరీ పండితులు, సిక్కులు, కాశ్మీరీ ముస్లింలతో కూడా బృందం మాట్లాడింది. అన్ని చోట్ల బృంద సభ్యులను ప్రజలు హృదయపూర్వకంగా ఆదరించారు. భారత ప్రభుత్వం తమకు ద్రోహం చేసిందన్న భావాన్ని వ్యక్తం చేశారు. అందుకే ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజలు తమ బాధను, కోపాన్ని వెళ్ళగక్కారు.

ఆర్టికల్ 370, ఆర్టికల్ 35 (ఏ) రద్దుపై చాలా మంది ప్రజలు కోపంగా ఉన్నారు. ప్రతిచోటా ప్రజల కోపం, భయం వంటి

భావోద్వేగాలు బృందానికి ఎదురయ్యాయి. ప్రజలతో జరిగిన సంభాషణల్లో వారి కోపాన్ని స్వేచ్ఛగా వ్యక్తం చేశారు. కానీ ఎవరూ కెమెరాలో మాట్లాడటానికీ, తమ పేర్లు వెల్లడించడానికీ ఇష్టపడలేదు. ఎవరైనా మాట్లాడినట్లు తెలిస్తే, ప్రభుత్వం నుండి హింసకు గురయ్యే ప్రమాదం ఉందని ప్రజలు భావిస్తున్నారు. త్వరలోనే భారీ స్థాయిలో నిరసనలు జరిగే అవకాశముందని చాలామంది అంచనా వేస్తున్నారు. నిరసనలు శాంతియుతంగా, ప్రజాస్వామ్యబద్ధంగా ఉన్నా ముందస్తుగానే హింసాత్మక అణచివేతకు పాల్పడే అవకాశముందని పేర్కొన్నారు.

> **" బృందం వెళ్లే విమానం శ్రీనగర్ చేరుకున్నప్పుడు ప్రయాణీకులు తమ ఫోన్లు ఆన్ చేసుకోవచ్చని ఎయిర్‌లైన్స్ సిబ్బంది ప్రకటించారు. విమానంలో ఎక్కువ మంది కాశ్మీరీలు ఉన్నారు. "ఏమి జోక్" అంటూ వారంతా ఒక్కసారి బిగ్గరగా నవ్వారు. ఎందుకంటే మొబైల్, ల్యాండ్‌లైన్ ఫోన్లు, ఇంటర్నెట్ అన్నీ ఆగస్టు 5 నుంచి బ్లాక్ చేయబడ్డాయి. "**

### కాశ్మీరీల్లో భయం, ఆక్రోశం

బృందం వెళ్లే విమానం శ్రీనగర్ చేరుకున్నప్పుడు ప్రయాణీకులు తమ ఫోన్లు ఆన్ చేసుకోవచ్చని ఎయిర్‌లైన్స్ సిబ్బంది ప్రకటించారు. విమానంలో ఎక్కువ మంది కాశ్మీరీలు ఉన్నారు. "ఏమి జోక్" అంటూ వారంతా ఒక్కసారి బిగ్గరగా నవ్వారు. ఎందుకంటే మొబైల్, ల్యాండ్‌లైన్ ఫోన్లు, ఇంటర్నెట్ అన్నీ ఆగస్టు 5 నుంచి బ్లాక్ చేయబడ్డాయి. శ్రీనగర్‌లో అడుగు పెట్టిన వెంటనే, ఒక పార్క్‌లో ఆడుతున్న చిన్నారుల వద్దకు బృందం సభ్యులు వెళ్లారు. అక్కడ చిన్నారులు సైతాన్ మోడీ(ఇబ్లీస్ మోడీ) అంటున్నారు. ప్రభుత్వ నిర్ణయంపై అక్కడ ప్రజల నుంచి ''జులుం'' (అణచివేత), ''జ్యడ్తీ'' (కూరత్వం), ధోఖా (ద్రోహం) అనే మాటలు పదేపదే వినబడుతున్నాయి. శ్రీనగర్ దిగువ పట్టణంలోని నఫ్‌కాదల్‌లో స్థానికులు మాట్లాడుతూ ''ప్రభుత్వం కాశ్మీరీలను బానిసలుగా చూస్తున్నది. మా జీవితాలు, మా భవిష్యత్తు గురించి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో మేము బంధీలుగా ఉన్నాం. మా తలలకు తుపాకీ గురిపెట్టారు" అని పేర్కొన్నారు. శ్రీనగర్ నగరంలోని ప్రతి సందులో, ప్రతి పట్టణంలో, ప్రతి గ్రామంలో బృందం సందర్శించిన సమయంలో కాశ్మీర్ వివాద చరిత్రపై పాఠశాల విద్యార్థులతో సహా సాధారణ ప్రజల నుండి కూడా అనేక విషయాలు తెలుసుకుంది. ఆ చరిత్రను కప్పిపెట్టేందుకు భారత మీడియా అవలంభిస్తున్న పద్ధతిపై కాశ్మీరీలు ఆక్రోశంతోనూ, భయంతోనూ ఉన్నారు. చాలా మంది మాట్లాడుతూ "ఆర్టికల్ 370 అనేది కాశ్మీర్ నాయకత్వానికి, భారతదేశానికి మధ్య జరిగిన ఒప్పందం. ఆ ఒప్పందంపై సంతకం చేయకపోతే, కాశ్మీర్ ఎప్పటికీ భారత దేశానికి




న్యూ ఢిల్లీలోని ప్రెస్ క్లబ్ ఆఫ్ ఇండియాలో కాశ్మీర్ పరిస్థితి గురించి మీడియాకు వివరిస్తున్న నిజనిర్ధారణ కమిటీ సభ్యులు

చెందదు. ఆర్టికల్ 370 రద్దు అయ్యింది. కాశ్మీర్‌పై తమ వాదనకు భారత దేశానికి ఇకపై ఎలాంటి ఆధారం లేదు" అని పేర్కొన్నారు. లాల్ చౌక్ దగ్గరలో జహంగీర్ చౌక్ ప్రాంతంలో ఒక వ్యక్తి ఆర్టికల్ 370ని "మంగళ సూత్రం" తో పోల్చాడు. ఇది కాశ్మీర్, భారతదేశం మధ్య ఒప్పందాన్ని (అపురూపమైన వివాహ ఒప్పందం)సూచిస్తుందని పేర్కొన్నాడు.

ప్రజలు తమ ఇళ్లల్లోనే నిర్బంధంలో ఉన్నారు. ఒకరితో ఒకరు మాట్లాడలేకపోతున్నారు. తమ ఇళ్లలోంచే తమను తాము వ్యక్తం చేసుకునేందుకు, వారి గొంతులను వినిపించడానికి సోషల్ మీడియా ద్వారా ప్రయత్నిస్తున్నారు. ప్రభుత్వ నిర్ణయాలను కాశ్మీర్ స్వాగతించిందని భారత మీడియా పేర్కొన్నట్లు వారు టీవీల్లో చూశారు. అలాగే తమ స్వరాలు, అభిప్రాయాలు టీవీల్లో లేకపోవడంతో ఆక్రోశంగా ఉన్నారు. సఫ్‌కాదల్‌లోని ఒక యువకుడు "కిస్కి షాదీ హై, అవుర్ కౌన్ నాచ్ రహా హై?!(ఇది నా పెళ్లి, కానీ డాన్స్ చేస్తున్న వారు మాత్రం ఇతరులు!)" ఈ చర్య మా ప్రయోజనం, అభివృద్ధి కోసమే అయినప్పుడు, దాని గురించి ఆలోచించే మమ్మల్ని ఎందుకు అడగకూడదు?" అని ప్రశ్నించాడు.

### ఆర్టికల్స్ 370, 35(ఏ) రద్దుతో అవమానకార దాడి

అనంతనాగ్ జిల్లాలో గురీ గ్రామంలో ఒక వ్యక్తి "ఆర్టికల్ 370, ఆర్టికల్ 35(ఏ)తోనే భారతదేశంతో తమ బంధం ఏర్పడింది. ఇప్పుడు మూర్ఖత్వంతో ఈ ఆర్టికల్స్‌ను రద్దు చేసి ఆ బంధాన్ని తెంచివేశారని అన్నారు. అదే వ్యక్తి "మాకు స్వేచ్ఛ కావాలి. తరువాత ఆర్టికల్స్ 370, 35(ఏ)ను పునరుద్ధరించండి" అంటూ నినాదాలు ఇచ్చాడు. చాలా మంది ఆర్టికల్స్ 370, 35(ఏ)లను కాశ్మీరీల "పెహచాన్"(గుర్తింపు)గా అభివర్ణించారు. ఈ ఆర్టికల్స్ రద్దు చేయడంతో కాశ్మీరీల ఆత్మ గౌరవం, గుర్తింపుపై అవమానకరమైన దాడికి పూనుకున్నట్లు భావిస్తున్నారు.

ఆర్టికల్ 370 పునరుద్ధరించాలని చాలా మంది డిమాండ్ చేశారు. భారతదేశంలో విశ్వాసం కలిగి ఉండాలని కాశ్మీరీలను కోరిన పార్టీలు, ఆర్టికల్ 370 ఒప్పందాన్ని కూడా గౌరవించాలని కోరుతున్నారు. బటమాలులో ఒక వ్యక్తి మాట్లాడుతూ "ఎవరైతే భారత దేశాన్ని ప్రశంసించారో, భారతదేశ సొంత ఏజెంట్లుగా ఉన్నారో, వారంతా ఇప్పుడు జైలు పాలయ్యారు" అని అన్నారు. ఒక కాశ్మీర్ జర్నలిస్టు మాట్లాడుతూ "ఈ చర్యలతో ప్రజలంతా సంతోషంగా ఉ

“శ్రీనగర్‌లోని జహంగీర్ చౌక్‌లోని అల్లిన వస్తువుల తయారీ వ్యాపారస్తుడు మాట్లాడుతూ “కాంగ్రెస్ వెనుక నుంచి కత్తిపోట్లు వేసింది. బిజెపి ముందు నుంచి నరికింది. బిజెపి మన సొంత రాజ్యాంగం గొంతు కోసి చంపింది. ఇది హిందూ రాష్ట్రం వైపు మొదటి అడుగు” అని పేర్కొన్నారు. ఆర్టికల్స్ 370, 35(ఏ) రద్దు ప్రభావాల గురించి ప్రజలు ఎక్కువ ఆందోళన చెందుతున్నారు.”

న్నారని ప్రధాన స్రవంతి పార్టీలు పేర్కొంటున్నాయి. కానీ ఈ చర్యలు మమ్మల్ని తీవ్రంగా అవమానపరుస్తున్నాయని మరిచిపోతున్నాయి” అని పేర్కొన్నారు. “ప్రధాని మోడీ దేశ రాజ్యాంగాన్ని, చట్టాన్ని నిర్వీర్యం చేశారు. ఆర్టికల్ 370 కాశ్మీర్ కంటే భారతదేశానికే చాలా ముఖ్యమైనదని (కాశ్మీర్ వాదనను చట్టబద్ధం చేయడానికి) చెప్పారు. కానీ మోడీ ప్రభుత్వం కాశ్మీర్‌ను నాశనం చేయడానికి మాత్రమే కాక, దేశ రాజ్యాంగాన్ని, చట్టాన్ని నాశనం చేసింది” అని ఘాటుగా స్పందించారు.

శ్రీనగర్‌లోని జహంగీర్ చౌక్‌లోని అల్లిన వస్తువుల తయారీ వ్యాపారస్తుడు మాట్లాడుతూ “కాంగ్రెస్ వెనుక నుంచి కత్తిపోట్లు వేసింది. బిజెపి ముందు నుంచి నరికింది. బిజెపి మన సొంత రాజ్యాంగం గొంతు కోసి చంపింది. ఇది హిందూ రాష్ట్రం వైపు మొదటి అడుగు” అని పేర్కొన్నారు. ఆర్టికల్స్ 370, 35(ఏ) రద్దు ప్రభావాల గురించి ప్రజలు ఎక్కువ ఆందోళన చెందుతున్నారు. ఆర్టికల్ 370 ఉందని విస్తృత ప్రచారం ఉన్నప్పటికీ, నామమాత్రపు స్వయం ప్రతిపత్తి మాత్రమే ఉంది. ఇప్పటికే దాన్ని నిర్వీర్యం చేసి, ప్రాధాన్యతను తగ్గించారు. 35(ఏ) రద్దు కావడంతో ప్రజలు భయపడుతున్నారు. “రాష్ట్ర భూమిని పెట్టుబడిదారులు కారుచౌకగా దోచుకుంటారు. అంబానీ, పతంజలీ మొదలైన సంస్థలు సులభంగా కాశ్మీర్‌లో అడుగు పెడతాయి. కార్పొరేట్ వర్గం కాశ్మీర్ వనరులు, భూమిని లాక్కుంటుంది. కాశ్మీర్‌లో ప్రస్తుతం విద్యా, ఉపాధి స్థాయిలు మెరుగ్గా ఉన్నాయి. అయితే ఇకనుంచి కాశ్మీరీలు ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఇతర రాష్ట్రాల వారితో పోటీ పడాల్సి ఉంటుంది. ఒక తరం తరువాత చాలా మంది కాశ్మీరీలు ఉద్యోగాల్లో ఉండరు” అని చెప్పారు.

### “సాధారణ”–“శ్మశాన శాంతి”?

కాశ్మీర్‌లో పరిస్థితి “సాధారణంగా”, “ప్రశాంతంగా ఉందా? అంటే లేదనే సమాధానం వస్తుంది. సోపోరిలో ఒక యువకుడు “నిశ్శబ్దంగా గన్ గురిపెట్టారు. శ్మశాన శాంతి” అని పేర్కొన్నాడు. గ్రేటర్ కాశ్మీర్ దినపత్రిక మొదటి పేజీ, చివరి క్రీడా పేజీలో కొన్ని వార్తలు ప్రచురించింది. మిగతా లోపల పేజీలన్నీ వివాహాలు, రిసెప్షన్లు రద్దు ప్రకటనలతో నిండి ఉన్నాయి. ఆగస్టు 5 నుంచి 9 మధ్య ప్రజలు ఆహారం, పాలు, ప్రాథమిక అవసరాల కోసం తీవ్రంగా ఇబ్బందులు పడ్డారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారిని ఆసుపత్రులకు వెళ్లకుండా నిరోధించారు. ప్రభుత్వం కేవలం 144 సెక్షన్ మాత్రమే విధించామని, కర్ఫ్యూ విధించలేదని చెబుతున్నది. వాస్తవానికి శ్రీనగర్‌లో పోలీస్ వ్యాన్లు పెట్రోలింగ్ చేస్తూ “ఇళ్లల్లోనే సురక్షితంగా ఉండండి. కర్ఫ్యూ సమయంలో సంచరించ కూడదు. దుకాణాలను మూసివేయండి” అని ప్రజలను హెచ్చరిస్తున్నాయి. కాశ్మీర్ అంతా కర్ఫ్యూ కిందే ఉంది. ఈద్ సందర్భంగా కూడా రోడ్లు, బజార్లు నిశ్శబ్దంగా, నిర్జనంగా ఉన్నాయి. శ్రీనగర్‌లో ప్రజలు వీధుల్లోకి రాకుండా కన్సర్టినా వైర్ల ద్వారా నియంత్రణ కొనసాగుతున్నది. భారీస్థాయిలో పారామిలటరీ బలగాలను మోహరించటంతో శ్రీనగర్ అంతా ఖాకీల కనుసన్నల్లో ఉంది. ఇదే ఆంక్షల్లో ఈద్ కూడా జరిగింది. చాలా గ్రామాల్లో అజాన్‌ను పారామిలిటరీ నిషేధించింది. ప్రజలు ఎప్పటిలాగే మసీదుల వద్ద సమిష్టిగా కాకుండా, ఇంట్లో నమాజ్, ప్రార్థనలు చేయాల్సి వచ్చింది. ఈద్ రోజున దక్షిణ కాశ్మీర్‌లో అనంతనాగ్, షోపియన్, పాంపూర్‌ల్లో ఈద్ ఫైనరీ ధరించిన చిన్న పిల్లలను బృందం చూసింది. మిగతా వారందరూ శోకసంద్రంలో ఉన్నారు. అనంతనాగ్‌లోని గురీలో ఒక మహిళ మాట్లాడుతూ “మేము జైల్లో ఉన్నట్లు భావిస్తున్నాం” అని పేర్కొంది. షోపియన్‌లోని నాగ్బాల్‌లో ఒక బాలిక మాట్లాడుతూ “మా సోదరులతో కలిసి పోలీసు, ఆర్మీ కస్టడీలో ఉన్నాం. మేము ఈద్‌ను ఎలా జరుపుకొంటాం” అని ప్రశ్నించింది. సోపోర్ వద్ద ఈద్ కోసం సామాగ్రి కొనేందుకు బజారుకు వచ్చిన ఒక మహిళ మాట్లాడుతూ “మేము ఏడు రోజులు మా స్వంత ఇళ్లల్లో ఖైదీలుగా ఉన్నాం. ఈ రోజు కూడా మా గ్రామం లాంగెట్‌లో దుకాణాలు మూసివేసి ఉన్నాయి. అందువల్లనే నేను సామాగ్రి కొనుగోలు చేసేందుకు, అలాగే నర్సింగ్ చదువుతున్న నా కూతురును చూసి పోదామని సోపోర్ పట్టణానికి వచ్చాను” అని చెప్పారు.

“ఇది మోడీ పాలన కాదు. ఆర్మీ పాలన. ఇక్కడ ప్రజల కంటే సైనికులే ఎక్కువ మంది ఉన్నారు” అని బండిపోర సమీపంలోని వాట్పురాలో బేకరి నడిపే యువకుడు అన్నాడు. ఆయన స్నేహితుడు మాట్లాడుతూ “సమీపంలోని ఆర్మీ క్యాంప్ తీవ్రమైన నిబంధనలు విధించడం వల్ల మేము భయపడుతున్నాం. ఇంటి నుంచి బయటకు వస్తే అరగంట లోపు తిరిగి వెళ్లాలి. నా పిల్లవాడికి ఆరోగ్యం బాగోలేదు. నేను ఇక్కడ నుంచి ఆసుపత్రికి తీసుకెళ్లాలి. దీనికి అరగంట కన్నా ఎక్కువ సమయం పడుతుంది. వేరే గ్రామంలో నివసించే బంధువులు రావటానికి అరగంట కంటే ఎక్కువ పట్టవచ్చు. ఏమైనా ఆలస్యం అయితే, ఆర్మీ మమ్మల్ని వేధిస్తుంది” అని ఆవేదన వ్యక్తం చేశారు. సిఆర్పీఎఫ్, పారామిలటరీ ప్రతి చోటా ఉంది. కాశ్మీర్‌లోని దాదాపు ప్రతి ఇంటి వెలుపల భద్రతా బలగాలు మోహరించాయి. కాశ్మీరీల భద్రతకు విరుద్ధంగా ప్రజల ఉనికి భయాన్ని సృష్టిస్తుంది.

అమ్ముడుపోని గొర్రెలు, మేకలతో గొర్రెల వ్యాపారులు, పశువుల కాపరులను చూడొచ్చు. గొర్రెలు, మేకలను వారు ఏడాది పొడవునా పెంచుతారు. ఆ తరువాత వాటిని అమ్ముతారు. అవి సరైన సమయానికి అమ్ముడుపోకపోతే వారు భారీ నష్టాన్ని చవిచూస్తారు. ఈద్ రోజున చాలా మంది కొనుగోలు చేయలేకపోయారు. ఉత్తరప్రదేశ్‌లోని బిజ్నోర్ నుంచి వలస వెళ్లి కాశ్మీర్‌లో ఉన్న దుకాణదారుడు “అమ్ముడుపోని స్వీట్ల నిల్వలను బృందం సభ్యులకు చూపించాడు. ప్రజలు వాటిని కొనలేనందున రుచికరమైన స్వీట్లు వ్యర్థాలుగా తయారయ్యాయి. ఈద్ సందర్భంగా దుకాణాలు, బేకరీలు పాడైపోయిన ఆహార పదార్థాలతో ఎడారిగా కనిపించాయి. శ్రీనగర్‌లో ఆస్మా రోగంతో బాధపడుతున్నా ఆటో డ్రైవర్, ఆయన రోగం పరిస్థితిని బృందానికి వివరించాడు. ఆయన మందులు కొనుగోలు చేసేందుకు కొన్ని రోజుల క్రితం నుంచి ప్రయత్నిస్తున్నాడు. అతని

ప్రాంతంలోని దుకాణాల్లోనూ, ఆసుపత్రుల్లోనూ మందులు అయిపోయాయి. దీంతో ఆయన వేరే ఆసుపత్రికి వెళ్లాల్సి ఉంది. కానీ ఆయన వెళ్లకుండా సిఆర్‌పిఎఫ్ నిరోధించింది.

**నిరసనలు, అణచివేత, క్రూరత్వం**

ఆగస్టు 9న శ్రీనగర్‌లోని సౌరాలో పది వేలమంది ప్రజలు నిరసన తెలిపారు. భద్రతా దళాలు పెల్లెట్ గన్స్‌తో కాల్పులు జరిపాయి. ఈ దాడిలో అనేక మంది గాయపడ్డారు. ఆగస్టు 10న సౌరాకు బృందం వెళ్లడానికి ప్రయత్నించింది. కానీ సిఆర్‌పిఎఫ్ బారికేడ్‌తో ఆపివేసింది. అయితే అదే రోజు రోడ్డుపై రాస్తారోకో చేస్తూ రహదారి దిగ్బంధం చేసిన యువ నిరసనకారులను చూసినట్లు బృందం సభ్యులు తెలిపారు. శ్రీనగర్‌లోని ఎస్‌ఎంహెచ్‌ఎస్ హాస్పిటల్‌లో పోలీసు కాల్పులతో పెల్లెట్ల వలన గాయాల పాలైన ఇద్దరు బాధితుల్ని బృందం కలిసింది. ఈ ఇద్దరు యువకుల(వకార్ అహ్మద్, వాహిద్)కు ముఖం, చేతులు, మొండెం మొత్తం పెల్లెట్ గాయాలు ఉన్నాయి. రక్తపు మచ్చలతో వారి కళ్లు మూసుకుపోయి ఉన్నాయి. వకార్ అహ్మద్‌లో అంతర్గతంగా రక్తస్రావం జరిగి, మొహం ఎర్రగా ఉంది. ఆ ఇద్దరు యువకులు రాళ్లు విసరలేదని, శాంతియుతంగా నిరసన తెలిపారని వారి కుటుంబ సభ్యులు దుఃఖంతోనూ, కోపంతోనూ చెప్పారు.

శ్రీనగర్‌లోని మాండర్ బ్యాగ్ ప్రాంతంలో రైజింగ్ కాశ్మీర్ వారపత్రిక గ్రాఫిక్ డిజైనర్ సమీర్ అహ్మద్ తన ఇంటి సమీపంలో ఉన్న ఒక సిఆర్‌పిఎఫ్ జవాన్‌ను వృద్ధురాలిని అనుమతించాలని కోరాడు. తరువాత అదే రోజు, సమీర్ తన ఇంటి తలుపులు తెరిచాడు. సిఆర్‌పిఎఫ్ జవాన్లు అతనిపై పెల్లెట్ గన్స్‌తో కాల్పులు జరిపారు. దీంతో సమీర్ తీవ్రంగా గాయపడ్డాడు. అతని చేతిలో, ముఖంలో కళ్ల దగ్గర 172 పెల్లెట్లు ఉన్నాయి. అయితే ఆయన ప్రమాదం నుంచి బయటపడి సురక్షితంగా ఉన్నాడు. ఉద్దేశపూర్వకంగానే ముఖం, కళ్లు లక్ష్యంగా చేసుకొని పెల్లెట్స్‌తో కాల్పులు జరుపుతున్నారనేది సుస్పష్టం.

దాదాపు 600 మంది రాజకీయ నాయకులు, పౌర సమాజ కార్యకర్తలు నిర్బంధంలో ఉన్నారు. వారిని అరెస్టు చేసేందుకు ఏ చట్టాలను ఉపయోగిస్తున్నారో, వారిని ఎక్కడ ఉంచుతున్నారో స్పష్టమైన సమాచారం లేదు. చాలా పెద్ద సంఖ్యలో రాజకీయ నాయకులు గృహ నిర్బంధంలో ఉన్నారు. అధిక సంఖ్యలో ప్రజలను జంతువుల వలే నిర్బంధించారు.

**"శ్రీనగర్‌లోని మాండర్ బ్యాగ్ ప్రాంతంలో రైజింగ్ కాశ్మీర్ వారపత్రిక గ్రాఫిక్ డిజైనర్ సమీర్ అహ్మద్ తన ఇంటి సమీపంలో ఉన్న ఒక సిఆర్‌పిఎఫ్ జవాన్‌ను వృద్ధురాలిని అనుమతించాలని కోరాడు. తరువాత అదే రోజు, సమీర్ తన ఇంటి తలుపులు తెరిచాడు. సిఆర్‌పిఎఫ్ జవాన్లు అతనిపై పెల్లెట్ గన్స్‌తో కాల్పులు జరిపారు. దీంతో సమీర్ తీవ్రంగా గాయపడ్డాడు. అతని చేతిలో, ముఖంలో కళ్ల దగ్గర 172 పెల్లెట్లు ఉన్నాయి."**



నిర్బంధంలో కాశ్మీర్ ప్రజా నాయకులు: జమ్మూ-కాశ్మీర్ మాజీ ముఖ్యమంత్రులు మెహబూబా ముఫ్తీ, ఒమర్ అబ్దుల్లాలను గృహనిర్బంధంలో ఉంచారు. సిపిఐ(ఎం) నాయకుడు, నాలుగు సార్లు శాసన సభకు ఎన్నికైన తరిగామి, కాంగ్రెస్ నాయకుడు ఉస్మాన్ మజీద్‌లను అరెస్టు చేశారు.

శ్రీనగర్‌లో హౌస్ అరెస్టులో ఉన్న సిపిఎం సీనియర్ నేత, ఆ పార్టీ ఎమ్మెల్యే మహ్మద్ యూసుఫ్ తరిగామిని కలిసేందుకు బృందం సభ్యులు తీవ్రంగా ప్రయత్నించారు. కానీ ఆయన ఇంటిలోకి ప్రవేశించేందుకు భద్రతా బలగాలు అనుమతిని నిరాకరించాయి. బృందం సందర్శించిన ప్రతి గ్రామంలో, అలాగే శ్రీనగర్ దిగువ పట్టణాల్లో పోలీసులు, ఆర్మీ, పారామిలిటరీ బలగాలు పాఠశాల విద్యార్థులనూ, టీనేజర్లనూ ఏకపక్షంగా అదుపులోకి తీసుకొని, అక్రమంగా నిర్బంధించాయి. ఆగస్టు 5 నుంచి 11 వరకు పోలీస్ స్టేషన్‌లో ఉన్న 11 ఏళ్ల బాలుడిని పాంపూర్‌లో బృందం కలిసింది. ఆ బాలుడ్ని పోలీసులు కొట్టారు. సమీప గ్రామాల నుంచి తన కంటే తక్కువ వయస్సు గల పిల్లల్ని అదుపులోకి తీసుకున్నారని ఆ బాలుడు తెలిపాడు. అర్ధరాత్రి దాడులు చేసి నిద్రలో ఉన్న వందలాది మంది పిల్లలనూ, టీనేజర్లనూ పడకల మీదినుంచే ఎత్తుకొని పోయి పోలీస్ స్టేషన్‌లో బంధించారు. ఈ దాడుల యొక్క ఏకైక ఉద్దేశ్యం భయాన్ని సృష్టించడమే. ఈ దాడుల సమయంలో సాయుధ దళాల వేధింపులు గురించి మహిళలు, బాలికలు బృందానికి తెలిపారు. బృంద సభ్యుల్ని కలిసేందుకూ, వారి పిల్లల "అరెస్టులు (అపహరణలు)" గురించి చెప్పడానికి తల్లిదండ్రులు భయపడ్డారు. పబ్లిక్ సెక్యూరిటీ యాక్ట్(ప్రజా భద్రతా చట్టం) కింద కేసులు నమోదు చేస్తారని వారు భయపడుతున్నారు. ఇంకొక భయం ఏమిటంటే కస్టడీలో ఉన్న వారిని సామూహిక సమాధుల్లో పడవేసే భయంకరమైన చరిత్ర ..కాశ్మీర్‌లో ఉంది. కనుక అదృశ్యం పేరుతో కస్టడీలో ఉన్న తమ పిల్లలను చంపేస్తారేమోనని భయాందోళనల్లో తల్లిదండ్రులు ఉన్నారు. అరెస్టు కాబడ్డ బాలుడి పొరుగు ఇంటివారు మాట్లాడుతూ "ఈ అరెస్టులు గురించి రికార్డులు లేవు. ఇది అక్రమ నిర్బంధం. కాబట్టి ఆ అబ్బాయి అదృశ్యం అయినట్లే. కనుక కస్టడీలోనే చంపేస్తారు. పోలీసులు, ఆర్మీ ఆ అబ్బాయిని తామెప్పుడూ అదుపులోకి తీసుకోలేదని చెబుతారు" అని తెలిపారు. అయితే నిరసనలు ఆగే అవకాశం లేదు. సోపోర్ వద్ద ఒక యువకుడు "మీరు మమ్మల్ని ఎంతగా

“ ఒక జర్నలిస్టు మాట్లాడుతూ “అన్నీ ఉంటేనే వార్తాపత్రికలు ముద్రించడం సాధ్యమవుతుంది. ఇంటర్నెట్ లేకుండా మేము ఏజెన్సీల నుంచి ఎటువంటి ఫీడ్ (వార్తాలు) పొందలేము. అందుకనే మేము నివేదించడం తగ్గించాం. పార్లమెంట్‌లో జమ్మూ కాశ్మీర్‌కు సంబందించిన పరిణామాలు ఎన్డీటీవి నుంచి తీసుకున్నాం. ఇది మీడియాపై అప్రకటిత సెన్సార్ షిప్. ప్రభుత్వం ఇంటర్నెట్, ఫోన్ సదుపాయం పోలీసులకు ఇచ్చింది. కానీ మీడియా సంస్థలకు ఇవ్వకపోతే దాని అర్థం ఏమిటీ? ”

అణచివేస్తారో, అంతకంటే ఎక్కువగా మేము లేస్తాం. నాయకులు అరెస్టు అయినా ఫర్వాలేదు. మాకు నాయకులు అవసరం లేదు. జీవించి ఉన్నంత కాలం మేము ఉద్యమిస్తాం” అని పేర్కొన్నాడు.

**మీడియాపై అప్రకటిత సెన్సార్ షిప్**

ఒక జర్నలిస్టు మాట్లాడుతూ “అన్నీ ఉంటేనే వార్తాపత్రికలు ముద్రించడం సాధ్యమవుతుంది. ఇంటర్నెట్ లేకుండా మేము ఏజెన్సీల నుంచి ఎటువంటి ఫీడ్ (వార్తాలు) పొందలేము. అందుకనే మేము నివేదించడం తగ్గించాం. పార్లమెంట్‌లో జమ్మూ కాశ్మీర్‌కు సంబందించిన పరిణామాలు ఎన్డీటీవి నుంచి తీసుకున్నాం. ఇది మీడియాపై అప్రకటిత సెన్సార్ షిప్. ప్రభుత్వం ఇంటర్నెట్, ఫోన్ సదుపాయం పోలీసులకు ఇచ్చింది. కానీ మీడియా సంస్థలకు ఇవ్వకపోతే దాని అర్థం ఏమిటీ? కొంత మంది మా కార్యాలయానికి వచ్చారు. ఆర్మీ, సిఆర్‌పిఎఫ్ తరపున మాట్లాడుతూ “మీరు కర్ఫ్యూ ప్రభావిత వీధుల ఫోటోలను ఎందుకు ప్రచురిస్తున్నారు?” అని అడిగారు. కాశ్మీరీ టీవి ఛానల్స్ అన్ని పూర్తిస్థాయిలో మూసివేతకు గురయ్యాయి. సౌరా వంటి ప్రాంతాల్లో నిరసనల గురించి ప్రచురిస్తున్న కాశ్మీరీ వార్తా పత్రికలు అధికారుల నుంచి బెదిరింపులకు లోనవుతున్నాయి. ప్రజల ఉద్యమంపై అంతర్జాతీయ ప్రతికా విలేకరులు సైతం అధికారుల ఆంక్షలు ఎదుర్కొంటున్నారు. అలాగే ఇంటర్నెట్ లేకపోవడం వల్ల వారు తమ ప్రధాన కార్యాలయాలకు రిపోర్టింగ్, వివరాలు అందించలేకపోతున్నారు. ఆగస్టు 13న మీడియా ఎన్‌క్లేవ్‌ను బృందం సందర్శించినప్పుడు, వార్తాపత్రికల కార్యాలయాలు మూసివేయబడినట్లు బృందం తెలుసుకుంది. కొంత మంది జర్నలిస్టులు, సిఐడి అధికారులు మినహా ఆ ప్రాంతమంతా నిర్మానుష్యంగా ఉంది. ఆగస్టు 17 వరకు వార్తా పేపర్లు ముద్రించడం కుదరదని ఒక జర్నలిస్టు బృందానికి తెలిపాడు. ఎందుకంటే ఢిల్లీ నుండి వచ్చే న్యూస్ ప్రింట్స్ అయిపోయాయి. అందువల్లనే ముద్రణ జరగదని అన్నాడు.

**కాశ్మీర్‌లో అభివృద్ధి లేదా?**

ఆగస్టు 9న టైమ్స్ ఆఫ్ ఇండియాలో ప్రత్యేక పేజీలో మాజీ విదేశాంగ కార్యదర్శి, రాయబారి నిరుపమ రావు ఇలా రాశారు..“తన జన్మస్థలం “రాతి యగం”లో ఉంది. ఆర్థిక అభివృద్ధి పరంగా కాశ్మీర్ మిగతా భారత దేశం కంటే రెండు వందల ఏళ్లు వెనకబడి ఉంది. ఈ వెనకబాటు తనంలోనూ, రాతియుగంలోనూ కాశ్మీర్ ఎక్కడుందని కనుకొనేందుకు చాలా కష్టపడ్డాం” అని ఒక యువ కాశ్మీరీ తనకు కొన్ని నెలల ముందు తెలిపినట్లు పేర్కొన్నారు. కాశ్మీర్‌లో ప్రతి గ్రామంలో యువతి, యువకులు కాలేజీలకు, యూనివర్శిటీలకు వెళ్లాల్సిన అవసరాన్ని గుర్తించారు. కాశ్మీరీ, హిందీ, ఇంగ్లీష్ సరళంగా మాట్లాడటం నేర్చుకున్నారు. రాజ్యాంగ అంశాలను పొందగలుగుతున్నారు. వాస్తవిక ఖచ్చితత్వంతోనూ, పాండిత్యంతోనూ కూడిన కాశ్మీర్ వివాదానికి సంబంధించిన అంతర్జాతీయ చట్టం గురించి తెలుసుకున్నారు. నిజ నిర్ధారణ బృందంలోని నలుగురు సభ్యులకూ ఉత్తర భారత రాష్ట్రాల్లోని గ్రామాలతో పరిచయం ఉంది. బీహార్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, జార్ఖండ్‌లోని ఏ గ్రామంలోనూ కాశ్మీర్ స్థాయిలో ఉన్నత విద్య అందడం చాలా అరుదు. కాశ్మీర్‌లోని గ్రామీణ గృహాలన్ని పక్కా నిర్మాణాలు. బీహార్, ఉత్తరప్రదేశ్, జార్ఖండ్ గ్రామీణ ప్రాంతాల్లో సాధారణంగా ఇలా పక్కా నిర్మాణాలు చూడలేము. కాశ్మీర్‌లో ఖచ్చితంగా పేదలు ఉన్నారు. కానీ అనేక ఉత్తర భారత రాష్ట్రాల్లో కనిపించే నిరాశ నిస్పృహల స్థాయి, ఆకలి, తీవ్ర పేదరికం గ్రామీణ కాశ్మీర్‌లో కనిపించవు. చాలా చోట్ల ఉత్తర భారతదేశం, పశ్చిమ బెంగాల్ నుంచి కాశ్మీర్ వెళ్ళి పనులు చేసుకుంటున్న వలస కార్మికులను బృందం కలిసింది. “మేము ఇక్కడ సురక్షితంగా ఉన్నాం. పరదేశీయులపై హింసకికాశ్మీర్‌లో ఎప్పుడో విముక్తి కలిగింది. ఆ హింస మహారాష్ట్ర, గుజరాత్‌లో చూడొచ్చు” అని వలస కార్మికులు తెలిపారు. రోజువారీ కూలీ వలస కార్మికులు

**‘మార్క్సిస్టు’కు మీ సందేహాలు రాయండి!**

‘మార్క్సిస్టు’ సైద్ధాంతిక మాసపత్రికలో సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు ప్రతినెలా పాఠకుల సందేహాలకు సమాధానాలిస్తున్న సంగతి మీకు తెలుసు. ప్రస్తుత అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర రాజకీయ పరిణామాలపై మీ సందేహాలను నివృత్తి చేసుకు నేందుకు ప్రశ్నలను రాసి పంపండి! ప్రతినెలా 20వ తేదీలోపు మీ ప్రశ్నలు మాకు చేరితే తదుపరి సంచికలో రాఘవులు సమాధానాలు లభిస్తాయి. మీ ప్రశ్నలు అందాల్సిన చిరునామా!

**ఎడిటర్, మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక), ఎం.బి. విజ్ఞానకేంద్రం,**
**డోర్ నెం. 27-30-3, ఆకులవారి వీధి, గవర్నర్‌పేట, విజయవాడ-520 002**

> "రైజింగ్ కాశ్మీర్ పత్రిక కార్యాలయం వద్ద బిజెపి కాశ్మీర్ వ్యవహారాల అధికార ప్రతినిధి అశ్వినీ కుమార్ చ్రున్గూని నిజ నిర్ధారణ బృందం కలిసింది. ఆర్టికల్ 370, ఆర్టికల్ 35(ఏ) రద్దుకు మద్దతుగా ప్రజలను ఒప్పించేందుకు ఆయన జమ్ము నుంచి వచ్చాడని తెలిపాడు. "జమ్ము-కాశ్మీర్‌లో బిజెపి 46 % ఓట్లు సాధించింది. పార్లమెంట్ ఎన్నికల్లో అపూర్వమైన మెజార్టీ గెలుచుకుంది. ఆర్టికల్ 370 రద్దు చేస్తామని వాగ్దానాన్ని నిలబెట్టుకోవడం హక్కు మాత్రమే కాదు. విధి. 46 % ఓటు అనేది తమకు లైసెన్స్" అని ఆయన అన్నారు."



జమ్మూ-కాశ్మీర్ రాజధాని శ్రీనగర్ కంచెలు, బారికేడ్లు, సైనిక పహారాలతో బహిరంగ జైలుగా మార్చబడింది.

మాట్లాడుతూ "కాశ్మీర్ అనేది మా దుబాయ్. మేము ఇక్కడ రోజుకు రూ.600 నుండి రూ.800 సంపాదిస్తాం. ఇది మేము ఇతర రాష్ట్రాల్లో సంపాదించినదానికి మూడు, నాలుగు రెట్లు ఎక్కువ" అని పేర్కొన్నారు.

కాశ్మీర్‌లో మతపరమైన ఉద్రిక్తతలు, మూక దాడులు (మాబ్ లించింగ్) కనబడవు. బృందం సభ్యులు కాశ్మీరీ పండిట్స్‌ను కలిశారు. వారు చెప్పిన ప్రకారం కాశ్మీర్‌లో సురక్షితంగా ఉన్నట్లు వారు భావించారు. కాశ్మీరీలు ఎల్లప్పుడూ తమ పండగలను కలిసి జరుపుకుంటారు. "మేము ఈద్, హోలి, దీపావళిని కలిసి జరుపుకుంటాం. అదే మా కాశ్మీరియత్. ఇదే భిన్నమైనది. ప్రత్యేకమైనది" అని కాశ్మీరీ యువ పండిట్ తెలిపారు.

కాశ్మీరీ మహిళల్లో "వెనుక బాటు" అనేది బహుశా అతిపెద్ద అబద్ధం. కాశ్మీరీ బాలికలు ఉన్నత స్థాయి విద్యలో ఉన్నారనేది స్పష్టమైంది. వాస్తవానికి వారు ఈ సమాజంలో ఉండే పితృస్వామ్య, లింగ వివక్షను ఎదుర్కొంటు న్నారు. దాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. కానీ బిజెపి చేస్తుందేమిటంటే, హర్యానా ముఖ్యమంత్రి మనోహర్ లాల్ కట్టర్, ఉత్తరప్రదేశ్‌లోని ముజఫర్‌నగర్ ఎమ్మెల్యే విక్రమ్ సింగ్ సైనీ మాట్లాడుతూ "కాశ్మీరీ వధువులను పొందవచ్చు" కాశ్మీరీ స్త్రీలు లూటీ చేసే ఆస్తి అయినప్పటికీ, కాశ్మీర్‌కు స్త్రీవాదం భోదించేందుకు బిజెపి నేతలకు ఏదైనా హక్కు ఉందా? కాశ్మీరీ మహిళ, బాలిక బృందంతో మాట్లాడుతూ "మేమే మా స్వంత వివక్ష, అణచివేతలపై పోరాడగల సామర్థ్యం కలిగి ఉన్నాం. మేము అణచివేతలపై దావాలు వేసేందుకు కోరడం లేదు. వాటి నుంచి విముక్తి కావాలని కోరుతున్నాం'' అని పేర్కొన్నారు.

### బిజెపి అధికార ప్రతినిధి "హెచ్చరిక"

రైజింగ్ కాశ్మీర్ వార్తా పత్రిక కార్యాలయం వద్ద బిజెపి కాశ్మీర్ వ్యవహారాల అధికార ప్రతినిధి అశ్వినీ కుమార్ చ్రున్గూ ని నిజ నిర్ధారణ బృందం కలిసింది. మొదట్లో బృందంతో ఆయన సంభాషణ స్నేహపూర్వకంగానే సాగింది. ఆర్టికల్ 370, ఆర్టికల్ 35(ఏ) రద్దుకు మద్దతుగా ప్రజలను ఒప్పించేందుకు ఆయన జమ్ము నుంచి కాశ్మీర్ వచ్చాడని తెలిపాడు. "జమ్ము-కాశ్మీర్‌లో బిజెపి 46 శాతం ఓట్లు సాధించింది. పార్లమెంట్ ఎన్నికల్లో అపూర్వమైన మెజార్టీ గెలుచుకుంది. ఆర్టికల్ 370 రద్దు చేస్తామని వాగ్దానాన్ని నిలబెట్టుకోవడం హక్కు మాత్రమే కాదు. విధి. 46 శాతం ఓటు అనేది తమకు లైసెన్స్" అని ఆయన అన్నారు. 46 శాతం ఓట్లతో కేవలం మూడు లోక్‌సభ సీట్లు(జమ్మూ, ఉదమ్‌పూర్, లడక్) గెలిచారు. మిగిలిన మూడు లోక్‌సభ స్థానాల్లో (శ్రీనగర్, అనంతనాగ్, బారాముల్లా)లో దేశంలోనే అతి తక్కువ ఓటింగ్ నమోదు అవ్వడంతోనే అది సాధ్యమైందని అంగీకరించేందుకు ఆయన నిరాకరించాడు. కాశ్మీర్ ప్రజలపై ప్రభుత్వం ప్రజాదరణ లేని నిర్ణయం విధించాలా? తుపాకీ గురిపెట్టి ఆ నిర్ణయం చేయాలని ఎవరూ ఓటు వేయలేదని అడిగిన బృందానికి అశ్వినీ కుమార్ స్పందిస్తూ "బీహార్‌లో ముఖ్యమంత్రి నితీష్ కుమార్ మద్యపానంపై నిషేధం విధించినప్పుడు, అక్కడ మద్యపానం సేవించే వారి అనుమతి కోసం అడగలేదు. సమ్మతి తీసుకోలేదు. ఇక్కడ కూడా అదే ఉంది" అని పేర్కొన్నారు. ఈ సారూప్యత నుండి కాశ్మీర్ ప్రజలపై ఆయన చూపిన ధిక్కారం స్పష్టమైంది. సంభాషణ ముగింపులో అశ్వినీ కుమార్ లేచి ఆర్థిక వేత్త, బృందం సభ్యుడు జీన్ డ్రెజ్‌కు చేతి వేలు చూపించి, "మీలాంటి దేశ వ్యతిరేకులు(యాంటీ నేషనల్స్) ఇక్కడ పని చేయడానికి మేము అనుమతించం. నేను మీకు హెచ్చరిస్తున్నాను" అని పరుష పదజాలంతో కూడిన వైఖరిని ప్రదర్శించాడు.

ఆపిల్ తోటలు, కుంకుమ పువ్వు తోటలతో ఆహ్లాదకరంగా ఉండే యావత్ కాశ్మీర్ ప్రస్తుతం సైనిక నియంత్రణలో జైలులా ఉంది. కేంద్ర ప్రభుత్వం చెబుతున్నట్లు అక్కడ ప్రశాంత వాతావరణం ఎంతమాత్రం లేదు. జమ్మూ కాశ్మీర్‌పై మోడీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు అనైతికమైనవి. రాజ్యాంగ విరుద్ధమైనవి. చట్ట విరుద్ధమైనవి. కాశ్మీరీలను బంధీలుగా ఉంచడానికి మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న మార్గాలు, శాంతియుత నిరసనల అణచివేత కూడా అనైతిక, రాజ్యాంగ విరుద్ధ, చట్ట వ్యతిరేకమైంది.

❋

# ముంచుకొస్తున్న ఆర్థిక మాంద్యం

ఎస్. వెంకట్రావు



రచయిత మార్క్సిస్టు పత్రిక సంపాదకుడు

ఆర్థిక సంక్షోభం అన్ని వైపుల నుండి ఆవహిస్తోంది. ప్రపంచ దేశాలపై ఏర్పడిన సంక్షోభ మేఘాలు భారతదేశంపై మరింత దట్టంగా కమ్ముకుంటున్నాయి. దేశంలో అన్ని రంగాలు ఆర్థిక మందగమనం దిశగా పయనిస్తున్నాయి. వాహన విక్రయాలు తగ్గాయి. పరిశ్రమలు మూతపడుతున్నాయి. పెరిగిన నిరుద్యోగానికి తోడు మరిన్ని ఉద్యోగాలు ఉడిపోతున్నాయి. ఒక్క ఆటో మొబైల్ రంగంలోనే గత కొద్ది మాసాల్లో 3 లక్షల మందికి పైగా ఉద్యోగులను తొలగించి నట్లు వార్తలు వచ్చాయి. కొద్ది మాసాల క్రితం 6 శాతంగా ఉన్న నిరుద్యోగం ఈ రోజు 9 శాతానికి పెరిగినట్టు అధికార లెక్కలే చెపుతున్నాయి. గత 45 సంవత్సరాలలో ఎన్నడూ లేనంత నిరుద్యోగం భారత్‌లో నెలకొంది.

తాజాగా భారత వృద్ధి రేటు 6 ఏళ్ల కనిష్టానికి తగ్గి 5 శాతానికి చేరింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి జూన్ త్రైమాసికంలో జిడిపి వృద్ధి రేటు 5 శాతానికి పరిమితమైనట్లు శుక్రవారం నాడు కేంద్ర గణాంకాల శాఖ (ఎన్ఎస్ఒ) ప్రకటించింది. దీనితో భారత ఆర్థిక వ్యవస్థ మాంద్యంలో చిక్కుకున్నదని స్పష్టమవుతోంది. దేశ ఆర్థిక వ్యవస్థలో అత్యంత కీలకమైన వ్యవసాయ, తయారీ రంగాలు నేల చూపులు చూశాయి. గత జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో తయారీ రంగం 0.6 శాతానికి, వ్యవసాయరంగం 2 శాతానికి పరిమితమైంది. జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో వృద్ధి రేటు 6 శాతానికి చేరువలో ఉండవచ్చని, 2019-20 వృద్ధి రేటు 6.9 శాతం నమోదు కావచ్చని చాలా ఏజెన్సీలు తొలుత అంచనా వేశాయి. కాని ఈ అంచనాలన్ని తల్లకిందులు చేస్తూ వృద్ధి రేటు గణనీయంగా పడిపోయింది.

దేశ ప్రజల కొనుగోలు శక్తి దారుణంగా పడిపోవడం వల్లనే మాంద్యం ఏర్పడింది. ప్రజల నిజ ఆదాయాలు పడిపోవడంతో ఉత్పత్తుల అమ్మకాలు తగ్గిపోయాయి. కార్ల నుండి బిస్కెట్ల వరకు అన్ని సరుకుల విక్రయాలు తగ్గిపోవడంతో అయా రంగాలలో ఉద్యోగులకు ఉద్వాసన పలుకుతున్నారు. ప్రభుత్వాలు అనుసరిస్తున్న నయా-ఉదారవాద ఆర్థిక విధానాలే దేశ ఆర్థిక వ్యవస్థకు చేటు తెచ్చాయన్నది స్పష్టం.

ఆటోమొబైల్ రంగంలో ఏర్పడిన సంక్షోభం మొత్తం దేశ వ్యాప్త సంక్షోభంలో భాగమేనని ఈ ఏడాది జూలైలో ఎడెల్‌వీస్ సెక్యూరిటీస్ లిమిటెడ్ ఒక నివేదికలో పేర్కొంది. గత రెండు దశాబ్దాలుగా ఆటోమొబైల్ రంగంలో వచ్చిన సంక్షోభాలు ప్రపంచ పరిణామాల ప్రభావంతో ఏర్పడితే ప్రస్తుత సంక్షోభం దేశవాళీ ఆర్థిక వ్యవస్థ పరిణామాల వల్ల జరిగిందని నివేదిక పేర్కొంది.

## ప్రపంచ సంక్షోభం

2008లో ప్రారంభమైన ఆర్థిక సంక్షోభం నుండి ప్రపంచం ఇంకా పూర్తిగా కోలుకోక ముందే మరో విస్తృతమైన సంక్షోభంలోకి వెళ్ళిపోతోందని ఆర్థిక నిపుణులు చెప్తున్నారు. 2008 మాంద్యం నుండి కోలుకుంటున్నట్టు చెప్తున్న అమెరికాలో కూడా వృద్ధిరేట్లు తగ్గిపోతున్నాయి. ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు చుక్కానిలా పనిచేసిన చైనా, జర్మనీలలో కూడా వృద్ధి మందగించింది. చైనా పారిశ్రామికోత్పత్తి 17 ఏళ్ల కనిష్టానికి తగ్గింది. జర్మనీ ఆర్థిక వ్యవస్థ పెరిగినట్టే పెరిగి ఏప్రిల్, జూన్ త్రైమాసికంలో కుప్పకూలిపోయింది. ప్రపంచ ఆర్థిక గొలుసులో కీలకమై చైనా, జర్మనీలలో మాంద్యం ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మీద ముఖ్యంగా ఆసియా, ఐరోపా దేశాల ఆర్థిక వ్యవస్థల మీద విస్తృతంగా వుంటుంది.

ఇప్పటి వరకు ఆదేశంలోనో, ఈ దేశంలోనో, ఆ రంగంలోనో, ఈ రంగంలోనో అంటూ వచ్చి మాంద్యం నేడు అన్ని దేశాలకు అన్ని రంగాలకు విస్తరిస్తోంది. స్టాకు మార్కెట్లు పడిపోతున్నాయి. ఆగస్టు 14న ఒక్కరోజే ప్రపంచ స్టాక్ మార్కెట్లు ఈ ఏడాదిలోనే కనిష్ట స్థాయికి పడిపోయాయి. వాల్‌స్ట్రీట్ కుప్పకూలడంతోబాటు అదే రోజు జపాన్ మార్కెట్ 1 శాతం, ఆస్ట్రేలియా 2.9 శాతం పడిపోయాయి. ఆర్థిక దిగజారుడును మరోసూచికంగా అమెరికా ట్రెజరీ బాండ్ల విలువ పెరుగుదల 2 శాతానికన్నా తక్కువకు పడిపోయింది. 1970వ దశకం తరువాత అమెరికా బాండ్ల విలువ ఇంతగా పడిపోవడం ఇదే ప్రథమం. బాండ్ల విలువ పడిపోవడం అంటే అర్థం అమెరికా ట్రెజరీ బాండ్లు కొనుగోలు చేసినవారు చివరి వరకు ఉంటే నష్టపోతారు.

ఈ మొత్తం మాంద్యానికి కారణం ప్రజల కొనుగోలు శక్తి పడిపోవడమే. గత కొన్ని దశాబ్దాల నయా-ఉదారవాద ప్రపంచీకరణ విధానాల వల్ల ప్రజల మధ్య ఆర్థిక వ్యత్యాసాలు తీవ్రతరమైనాయి. ప్రపంచీకరణ యుగంలో చౌకగా శ్రమ శక్తి లభించే చోటుకు ఉత్పత్తి కార్యకలాపాలు వెళ్ళి పోవడంతో ప్రపంచ వ్యాప్తంగా కార్మికుల వేతనాలు పడిపోయాయి. స్పెక్యులేటివ్ వ్యాపారం మీద ఆధారపడిన ఫైనాన్స్ పెట్టుబడిదారులు పెద్దఎత్తున లాభాలు మూటగట్టుకున్నారు. దీనికి తోడు ధనికులకు పన్ను రాయితీలు, ప్రజా ధనం దోచిపెట్టడం వంటి విధానాల వల్ల ధనికులకు పేదలకు మధ్య ఆర్థిక వ్యత్యాసాలు ఎన్నడూ లేనంత తీవ్రస్థాయికి చేరుకున్నాయి.

2008 ఆర్థిక సంక్షోభ కాలంలో ప్రపంచంలోని 1 శాతం ధనవంతుల వాటా మొత్తం ప్రపంచ సంపదలో 42.5 శాతం వుండగా అది 2017 నాటికి 50.1 శాతానికి పెరిగిందని క్రెడిట్ సూసి ప్రపంచ సంపద రిపోర్టు తెలియజేసింది. ఈ 1 శాతం ధనికుల వాటా 140 లక్షల కోట్ల డాలర్లకు పెరిగింది. ప్రతి సంవత్సరం వీరి వాటా శాతం పెరుగుతోంది. మరోవైపు ప్రపంచ జనాభాలో


70 శాతంగా గల 35 కోట్ల మంది పేదల సంపద 2.7 శాతానికి తగ్గిపోయింది. వీరి సంపద క్రమంగా తగ్గుతూ వస్తోంది.

భారతదేశంలో అత్యధిక ధనవంతులైన 1 శాతం ప్రజలు మొత్తం సంపదలో 53 శాతం కలిగివున్నారు. క్రింది 50 శాతం మంది పేద ప్రజలకు కేవలం 4.1 శాతం సంపద మాత్రమే ఉంది. ఆదాయ వ్యత్యాసాలు కూడా ఏటేటా పెరిగిపోతున్నాయి. మధ్య దిగువ తరగతి ప్రజల ఆదాయాలు తగ్గిపోతుండటంతో వారి కొనుగోలు శక్తి గణనీయంగా పడిపోతోంది. ప్రజల కొనుగోలు శక్తిని పెంకుండా వారి అప్పులు పెంచడం ద్వారా వస్తు వినియోగం పెంచడానికి చేసిన ప్రయత్నాలు కొంత కాలం వరకు పనిచేశాయి. 2008 సంక్షోభానికి ముందు రిస్కుతో కూడిన రుణాలు మంజూరు చేయడంతో ఒక వైపు ప్రజల వినిమయం పెరిగింది. మరోవైపురుణ భారమూ పెరిగింది. అయితే రుణాలపై ఆధారపడిన ఎదుగుదల ఎంతో కాలం నివలదని అందరికి తెలుసు. ఫలితంగా 2008లో విస్తృత మాంద్యం ఏర్పడింది. ఇప్పుడు కూడా అటు ప్రజలు, ఇటు కార్పొరేట్లు, మరో వైపు ప్రభుత్వాల రుణాలు విపరీతంగా పెరిగిపోయాయి. ఈ రుణ సంక్షోభం బద్దలై మరో పెద్ద మాంద్యం ప్రపంచాన్ని చుట్టుముట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి.

ఆర్థిక మాంద్యంతో భారతదేశంలాగానే ప్రపంచంలోని అనేక దేశాల్లో నిరుద్యోగం పెరిగింది. జీతాలకు కోతలు పడ్డాయి. సంక్షేమ కార్యక్రమాలు పలుచపడ్డాయి. ప్రజలల్లో అసంతృప్తి పెరిగింది. దానితో అన్ని దేశాల్లోనూ ప్రపంచీకరణ విధానాలకు వ్యతిరేకమైన సెంట్‌మెంట్ అభివృద్ధి చెందింది. ఈ సెంట్‌మెంట్‌ను ఉపయోగించుకొని అమెరికాలో డోనాల్డ్ ట్రంప్, ఐరోపాలోని అనేక దేశాల్లో మితవాద ప్రభుత్వాలు ఏర్పడ్డాయి. ప్రపంచ వాణిజ్యంలో అసమాన పోటీవల్లే ఈ సమస్యలు తెలెత్తాయని చెప్తూ ట్రంప్ ఇతర దేశాలపై వాణిజ్య యుద్ధానికి దిగాడు. ట్రంప్ చర్యలకు చైనా దీటుగా బదులు ఇవ్వడంతో రెండు ప్రపంచ ఆర్థిక అగ్రరాజ్యాల మధ్య వాణిజ్య యుద్ధం తీవ్రమై మొత్తం ప్రపంచాన్ని మరింత ఆర్థిక సంక్షోభంలోకి నెడుతోంది.

ఆర్థిక మాంద్యం నుండి బయటపట్టానికి పెట్టుబడిదారీ వ్యవస్థ వద్ద ప్రత్యామ్నాయ మార్గాలు ఏమికనిపించటం లేదు. మాంద్యం పరిస్థితులల్లో ఆర్థిక వ్యవస్థ పునరుత్తేజం పొందాలంటే ప్రజల కొనుగోలు శక్తి పెంచేవిధంగా ప్రభుత్వ వ్యయం పెరగాలి. కాని

"మాంద్యం ప్రపంచాన్నీ, భారతదేశ ఆర్థిక వ్యవస్థనూ ఆవహిస్తే ఈసారి దాని ఫలితాలు చాలా తీవ్రంగా వుంటాయి. మొదటిది, ఈసారి మాంద్యం సర్వవ్యాపి తంగా వుంటుంది. 2008 మాంద్యం ప్రభావం చైనా, భారత్, జర్మనీ వంటి దేశాలపై తక్కువగా పడింది. ఈ దేశాలల్లో స్వల్పకాలం వృద్ధి మందగించినా వెంటనే అధిక వృద్ధి రెట్లకు ఆర్థిక వ్యవస్థలు చేరుకున్నాయి. ఈసారి ఈ దేశాలే ముందుగా ఆర్థిక మాంద్యంలోకి వెళ్ళిపోయే పరిస్థితి కనిపిస్తోంది."



**భారత దేశంలో ఆర్థిక మాంద్యం మొదటి దెబ్బ ఆటోమొబైల్ రంగంపై పండింది. అమ్మకాలు పడిపోయి కొద్ది మాసాల్లోనే 3 లక్షల మందికి పైగా కార్మికులు ఉద్వాసనకు గురయ్యారు**

ప్రభుత్వాలు ఒక స్థాయికి మించి ఖర్చుపెట్టడానికి నయా-ఉదారవాద ఫైనాన్స్ పెట్టుబడి అంగీకరించదు. ధనికులకు మరిన్ని రాయితీలు, బ్యాంకులకు పెద్ద ఎత్తున డబ్బు సమకూర్చడం, విదేశీ పెట్టుబడికి ఎర్ర తివాచీలు పరచడం వంటి చర్యలేవి ప్రజల కొనుగోలు శక్తి పెంచడానికి తోడ్పడవు కనుక ఈ చర్యలు మాంద్యం నుండి బయటపడటానికి ఏవిధంగానూ ఉపయోగపడవు.

ప్రస్తుతం అందరూ భయపడుతున్న మాంద్యం ప్రపంచాన్నీ, భారతదేశ ఆర్థిక వ్యవస్థనూ ఆవహిస్తే ఈసారి దాని ఫలితాలు చాలా తీవ్రంగా వుంటాయి. మొదటిది, ఈసారి మాంద్యం సర్వవ్యాప్తితంగా వుంటుంది. 2008 మాంద్యం ప్రభావం చైనా, భారత్, జర్మనీ వంటి దేశాలపై తక్కువగా పడింది. ఈ దేశాలల్లో స్వల్పకాలం వృద్ధి మందగించినా వెంటనే అధిక వృద్ధి రెట్లకు ఆర్థిక వ్యవస్థలు చేరుకున్నాయి. ఈసారి ఈ దేశాలే ముందుగా ఆర్థిక మాంద్యంలోకి వెళ్ళిపోయే పరిస్థితి కనిపిస్తోంది. రెండవది ప్రయివేటు రంగం, ముఖ్యంగా కార్పొరేట్ రంగం తీవ్రమైన రుణాల ఊబిలో కూరుకు పోవడంతో మాంద్యం సంభవిస్తే వీటికి ఆస్తులు అమ్ముకోవడం, బ్యాంకులకు ఎగ్గొటడం మినహా మరో మార్గం వుండదు. అదే జరిగితే ఆస్తుల విలువ తగ్గిపోయి మొత్తం ఫైనాన్స్ రంగం మీద దాని ప్రభావం పడుతుంది. వడ్డీ రెట్లు తగ్గిపోవడం సెంట్రల్ బ్యాంకుల నిధులు కూడా ఇప్పటికే పెద్ద ఎత్తున వాడుకోవడం వలన ప్రభుత్వాలు తమ ద్రవ్య విధానాల ద్వారా కూడా సంక్షోభాన్ని అరికట్టడం కష్టమవుతుంది.

మాంద్యం ముంగిట నిలబడ్డ భారత ఆర్థిక వ్యవస్థను గట్టెక్కించే పేరుతో గత కొంత కాలంగా నరేంద్ర మోడీ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు - మరిన్ని సంస్కరణలు- పరిస్థితిని చక్కదిద్దకపోగా మరింత తీవ్రమైన సంక్షోభంలోకి నెడుతుంది. మాంద్యం సమయంలో కార్మికుల నిజవేతనాలు పెంచడం కాకుండా కార్మిక సంస్కరణల పేరుతో వారి వేతనాలకు కోతవిధించే చర్యలకు ప్రభుత్వం పాల్పడుతోంది. ఒకవైపు బడా కార్పొరేట్ పారిశ్రామిక వేత్తలకు వరాలు కురిపిస్తూ మరోవైపు వ్యవసాయం, ఉత్పాదక రంగాలల్లో పనిచేసే శ్రామికుల అధాయాలకు గండి కొట్టడం వల్ల సంక్షోభం పెరుగుతుందే గాని తగ్గదు.

ఈ మాసం ప్రత్యేకం

# తెలంగాణాలో 1948 సెప్టెంబర్ 17న ఏం జరిగింది?



రచయిత సిపిఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు, నవ తెలంగాణా సంపాదకులు

**ఎస్. వీరయ్య**

సెప్టెంబర్ 17కు ఎందుకింత ప్రాధాన్యత? ఇంత కాలం తర్వాత ఎందుకీ ప్రశ్న ముందు కొస్తున్నది?

నిజాం రాజు పాలనలో ఉన్న హైదరాబాదు రాజ్యం స్వతంత్ర భారతదేశంలో కలవడం విద్రోహమేనన్న వాదన కొంత మంది ఇప్పటికీ కొనసాగిస్తున్నారు. ప్రజలెవరూ అనుకోకపోయినా, కొంత మంది ఇంకా అట్లానే అనుకుంటున్నారు. మరికొందరు దాన్ని విమోచన దినంగా పరిగణించాలంటున్నారు. ఆ పేరుమీద ప్రతి సంవత్సరం హడావిడి చేస్తున్నారు. ఇంకొందరు విలీనం జరిగినమాట యదార్థం కదా! విలీనమే అనవచ్చు కదా! దీనికింత రాద్ధాంతం ఎందుకంటున్నారు? నిజమే. మొదట అది విద్రోహమో కాదో తెలియాలంటే చరిత్రను పరిశీలించాలి.

**దేశంలో కలవటం విద్రోహమా?**

1946 జూలై 4న దొడ్డి కొమరయ్య వీరమరణంతో తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి అంకురార్పణ జరిగింది. 1951 అక్టోబర్ 21 వరకు ఆ మహత్తర పోరాటం సాగింది. వెట్టి చాకిరీని తట్టుకోలేని తెలంగాణ రైతులు తిరగబడ్డారు. భూమి కోసం, భుక్తి కోసం, విముక్తికోసం పోరుబాట పట్టారు. భూస్వాములు, జమీందారులు, జాగీరుదారుల దోపిడీని ప్రతిఘటించారు. నిజాం నిరంకుశ పాలనపై తిరగబడ్డారు. దున్నేవాడికి భూమి పంచారు. గ్రామ రాజ్యాలు స్థాపించారు. ఫ్యూడల్ దోపిడీకి సమాధి కట్టాలని, నిజాం నిరంకుశ పాలన అంతం కావాలని కోరుకున్నారు. భారతదేశ విప్లవోద్యమానికి కొత్తబాటను చూపిన పోరాటమది. రైతుల తిరుగుబాటుకు తట్టుకోలేని భూస్వాములు గ్రామాలు వదలి హైదరాబాదు పట్టణ బాట పట్టారు. ఈ పెత్తందారుల రక్షణ కోసం నిజాం సైన్యం గానీ, రజాకార్ మూకలు గానీ చేసిన ప్రయత్నాలేవీ ఫలించలేదు. వారి దౌర్జన్యాలకూ, అణచివేత చర్యలకు రైతాంగం భయపడలేదు. కుల, మత, ఆడ, మగ, వయోభేదాలు వీడి కలిసి నడిచిన పోరాటమది.

1947 ఆగస్టు 15న భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చింది. నిజాం సర్కార్ స్వతంత్ర రాజ్యంగా కొనసాగేందుకు నెహ్రూ ప్రభుత్వం అంగీకరించింది. కానీ నిజాం పాలనను తెలంగాణ ప్రజలు అంగీకరించలేదు. అప్పటికే ఆంధ్ర మహాసభ, భారత కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో ఉధృతంగా సాగుతున్న పోరాటానికి భారత ప్రజలు పోరాడి సాధించుకున్న స్వాతంత్ర్యం మరింత ఉత్సాహాన్నిచ్చింది. భూస్వాములు గ్రామాలు వదిలి పారిపోవడమే కాదు, నిజాం రాజు పునాదులు కదులుతున్నాయి. ఇంకేమాత్రమూ తన రాచరిక పాలన కొనసాగించగలిగే స్థితిలో నిజాం ప్రభుత్వం లేదు. పరిస్థితిని ఇట్లానే వదిలేస్తే నిజాం ప్రభుత్వం కూలిపోయి, తెలంగాణలో కమ్యూనిస్టుల పాత్ర మరింత పెరిగే అవకాశమున్నది. ఇది గమనించిన నెహ్రూ ప్రభుత్వం హైదరాబాద్ స్టేట్‌ను భారతదేశంలో విలీనం చేయడం కోసం సైన్యాన్ని పంపుతున్నామని ప్రకటించింది. సెప్టెంబర్ 13న సైన్యాలను దింపింది. అప్పటికే పునాదులు కదులుతున్న స్థితిలో నిజాం రాజు నాలుగు రోజుల్లోనే లొంగిపోక తప్పలేదు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట ధాటికి తలవంచక తప్పలేదు. కథ ఇంతటితో ముగియలేదు.

హైదరాబాద్ స్టేట్‌ను ఇండియాలో విలీనం చేయడం కోసమే వచ్చామని చెప్పుకున్న నెహ్రూ సైన్యం అందుకు భిన్నంగా తెలంగాణ రైతాంగం మీద విరుచుకుపడ్డది. నిజాం సర్కార్ బలితీసుకున్న సంఖ్యకు రెట్టింపు మందిని పొట్టనపెట్టుకున్నది. నిజాం ప్రభువును రాజ ప్రముఖ్‌గా నియమించింది. ప్రజల మీద హత్యాకాండ కొనసాగించి రక్తపుటేరులు పారించింది. ఇందుకు కారణం అర్థం చేసుకోవడం పెద్ద కష్టమేమీ కాదు. నిజానికి నెహ్రూ సైన్యాల రాకను తెలంగాణ ప్రజలు స్వాగతించారు. నిజాం రాచరిక పీడ వదిలించు కునేందుకు ఈ సైన్యం సహకరిస్తుందని ఆశించారు. కానీ ఇందుకు భిన్నంగా జరిగింది. పేద రైతులు అప్పటికే సాగుచేసుకుంటున్న భూములను భూస్వాములకు తిరిగి ఇచ్చివేయాలని వత్తిడి చేసింది. అందుకు అంగీకరించని రైతాంగంపైన ఉక్కుపాదం మోపింది. పోరాట ఫలితంగా సాధించుకున్న భూమిని, హక్కులను రక్షించుకునేందుకు పోరాటం కొనసాగించక తప్పలేదు. అందుకే నిజాం ప్రభుత్వం కూలిపోయిన తర్వాత కూడా ఇండియన్ యూనియన్ సైన్యాలకు వ్యతిరేకంగా పోరాటం అనివార్యమైంది. ఈ పరిస్థితుల్లో పోరాట నాయకత్వం అప్పటికే సాధించుకున్న విజయాలను కాపాడుకునేందుకు పోరాటం కొనసాగించే ప్రయత్నం చేసింది. కానీ భారత దేశానికి స్వాతంత్ర్యం రావడంతో కొంత మందిలో భ్రమలు పెరిగాయి. హైదరాబాద్ స్టేట్ భారతదేశంలో విలీనమైన నేపథ్యంలో భూమి సమస్యను నెహ్రూ ప్రభుత్వమే పరిష్కరిస్తుందని భావించారు. అప్పటి వరకు పోరాటానికి అండగా నిలిచిన కొన్ని వర్గాలు వెనకడుగు వేసాయి. మరోవైపు కమ్యూనిస్టు పార్టీలో పెరిగిన విభేదాలు బహిరంగమై పోరాటానికి మరింత నష్టం చేకూర్చాయి. ఈ దశలో పోరాట స్వభావం మీద, లక్ష్యం మీద పార్టీ నాయకత్వంలో కొంత గందరగోళం ఏర్పడింది. పార్టీ కేంద్ర నాయకత్వం జోక్యం చేసుకుని తగు దిశా నిర్దేశం చేసింది. ఈ నేపథ్యంలో సాధించుకున్న విజయాలను సాధ్యమైనంత మేరకు కాపాడుకుంటూ పోరాటాన్ని ఉపసంహరించాలని పార్టీ నిర్ణయించింది. సాయుధ పోరాట విరమణ విషయంలో ఆనాడు పోరాటానికి నాయకత్వం వహిస్తున్న ప్రాంతీయ కమిటీలో గాని, కేంద్ర కమిటీలో గాని విభేదాలు లేవు. ఏకగ్రీవ నిర్ణయాలే.

**కేంద్ర కమిటీ ఏం చెప్పింది?**

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట పరిస్థితిని నాటి భారత కమ్యూనిస్టు పార్టీ కేంద్ర

కమిటీ అంచనా వేసింది. 1951 మే నెలలో జరిగిన కేంద్ర కమిటీ సమావేశం చేసిన తీర్మానంలో ఈ కింది విధంగా స్పష్టం చేసింది:

"తెలంగాణ పోరాటం నెహ్రూ ప్రభుత్వాన్ని కూలదోయడానికి కొనసాగించబడుతున్నదని కొందరు భావిస్తున్నారు. కానీ భూమికోసం, ఫ్యూడల్ భూస్వామ్య పీడనను, నైజాం పాలనను అంతమొందించడం కోసం తెలంగాణ రైతులు సాగిస్తున్న ఈ పోరాటం నెహ్రూ ప్రభుత్వం ఏర్పడడానికి చాలా కాలం ముందే అంటే 1946లోనే ప్రారంభమయ్యిందన్న వాస్తవాన్ని వారు గుర్తించడం లేదు. నెహ్రూ సైన్యాలు నైజాం సంస్థానంలో ప్రవేశించిన తర్వాత కూడా ఈ పోరాటం కొనసాగుతున్నదంటే అందుకు కారణం లేకపోలేదు. నైజాం పరిపాలనను అంతమొందించే లక్ష్యంతోనే హైదరాబాద్ సంస్థానంలో ప్రవేశించామని చెప్పుకున్న నెహ్రూ సైన్యాలు ఆ నైజాం నవాబుతోనే చేతులు కలిపి, పారిపోయిన భూస్వాములను తిరిగి తీసుకుని వచ్చాయి. కనుక నెహ్రూ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కూడా భూస్వాముల పీడనకు వ్యతిరేకంగా రైతుల ప్రయోజనాల రక్షణ కోసం అదే పోరాటాన్ని కొనసాగించాల్సి వచ్చింది. అందువలన తెలంగాణ రైతాంగ పోరాటం ప్రారంభం కావడం గానీ, కొనసాగడం గానీ నెహ్రూ ప్రభుత్వాన్ని కూలదోయడానికి కాదనీ, ఫ్యూడల్ భూస్వామ్య పీడనను తుదముట్టించడం కోసమనే విషయం అందరూ తెలుసుకోవాలి. ఫ్యూడల్ భూస్వామ్య పీడనను నిర్మూలించేందుకు జరిగే పోరాటం అవసరమన్న విషయాన్ని దేశం అభ్యుదయం వైపు పురోగమించాలని వాంఛించేవారంతా అంగీకరిస్తారు. ఎందువల్లనంటే; అలాంటి పోరాటం విజయం పొందడం ద్వారానే అందరికీ తిండీ, చేయడానికి పనీ, అభ్యుదయం, స్వాతంత్ర్యమూ చేకూరగలవు."

పోరాట విరమణకు దారితీసిన విషయాలను వివరిస్తూ కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య ఈ కింది విషయాలు చెప్పారు:

"పాక్షిక డిమాండ్ల కోసం జరిగే రైతాంగ సాయుధ గెరిల్లా పోరాటానికి, విముక్తి పోరాటంలో ఒక భాగంగా జరిగే గెరిల్లా యుద్ధానికి ప్రధానమైన తేడా ఉన్నదనే స్పష్టమైన అవగాహనను పొందడంతో తెలంగాణ విషయమై భవిష్యత్‌లో అనుసరించాల్సిన ఎత్తుగడల పంథాను రూపొందించుకోవడం తెలంగాణ ఉద్యమ నాయకులకు సులభమైంది.

నైజాం పాలనకు వ్యతిరేకంగా విముక్తి పోరాటంగా అభివృద్ధి చెంది, కొనసాగుతున్న తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం,

**"నైజాం పరిపాలనను అంతమొందించే లక్ష్యంతోనే హైదరాబాద్ సంస్థానంలో ప్రవేశించామని చెప్పుకున్న నెహ్రూ సైన్యాలు ఆ నైజాం నవాబుతోనే చేతులు కలిపి, పారిపోయిన భూస్వాములను తిరిగి తీసుకుని వచ్చాయి. కనుక నెహ్రూ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కూడా భూస్వాముల పీడనకు వ్యతిరేకంగా రైతుల ప్రయోజనాల రక్షణ కోసం అదే పోరాటాన్ని కొనసాగించాల్సి వచ్చింది."**



బాంచన్ నీ కాల్మొక్తా అన్న ప్రజలచేత బందూకులు పట్టించింది వీర తెలంగాణా విప్లవ పోరాటం. మహిళలు కూడా తుపాకులు పట్టి వెట్టి చాకిరీకి వ్యతిరేకంగా పోరాడారు. చిత్రంలో శిక్షణ పొందుతున్న మహిళా దళ సభ్యులు

హైదరాబాద్ స్టేట్‌లో భారత సైన్యాలు ప్రవేశించిన ఫలితంగా భారతదేశంలో ఒక భాగంగా విలీనమైన తర్వాత అది ఇంకెంత మాత్రం విముక్తి పోరాటం కాదని మనం గుర్తించి ఉండవలసింది. రైతుల స్వాధీనంలో ఉన్న భూములను సంరక్షించు కునేందుకు జరిగే రైతాంగ సాయుధ గెరిల్లా పోరాటంగా మాత్రమే అది ఉండగలదు; అంటే పాక్షిక సాయుధ గెరిల్లా పోరాటమన్నమాట. అప్పుడు మనం సాయుధంగా సంరక్షణ పోరాటాన్ని కొనసాగించుతూనే సాధ్యమైనన్ని హెచ్చు సౌకర్యాలు రైతాంగానికి సాధించేందుకు పట్టువిడుపులుగల ఎత్తుగడలను చేపట్టి పరిష్కారం కోసం ప్రయత్నించి ఉండవలసింది. అప్పుడు సకాలంలో తిరోగమించి మెరుగైన స్థితిలో బయటపడగలిగి ఉండేవారం."

ఈ సందర్భంగా అమరాబాద్ ప్రాంతీయ కమ్యూనిస్టుల, గెరిల్లాల సమావేశం చేసిన తీర్మానంలోని కొన్ని విషయాలు కూడా పరిశీలించ వచ్చు:

"గత ఐదు సంవత్సరాలుగా తెలంగాణ ప్రజలు ఆంధ్ర మహాసభ, కమ్యూనిస్టు పార్టీల నాయకత్వాన నైజాం నవాబుకు, భూస్వాములకు వ్యతిరేకంగా భూమికోసం, జాతీయ స్వాతంత్ర్యం కోసం సాయుధ పోరాటాన్ని సాగిస్తున్నారు. నైజాం నవాబు పరిపాలన పతనం కాబోతున్న పరిస్థితుల్లో నైజాం రజాకార్లను అంతమొందిస్తామనే పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వ సైన్యాలు హైదరాబాదులో ప్రవేశించాయి. కానీ వాస్తవంలో తెలంగాణ ప్రజలు సాధించుకున్న విజయాలను వమ్ము చేయడంలో అవి నిమగ్నమయ్యాయి. నైజాం నవాబును రాజ ప్రముఖ్‌గా నియమించారు. తెలంగాణ రైతాంగం నుండి భూములను లాక్కొని వాటిని తిరిగి దేశముఖుల, భూస్వాముల స్వాధీనం చేయడం ప్రారంభించారు."

"తెలంగాణ రైతాంగం నైజాం నవాబుకు వ్యతిరేకంగా భూమి కోసం, ఆంధ్ర ప్రజల జాతీయ ఐక్యత కోసం, తమ స్వాతంత్ర్యం కోసం పోరాడుతున్నది. కానీ మనం దాన్ని నెహ్రూ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూలదోసేందుకు అఖిల భారత పోరాటంగా ఉండదగిన విముక్తికై ప్రజల సాయుధ పోరాటం ఆరంభంగా పొరపాటుగా ఊహించుకున్నాం. ఈ పొరపాటు వల్ల నెహ్రూ ప్రచారాన్ని సకాలంలో వమ్ము చేయలేక పోయాం. తెలంగాణ ప్రజల పోరాటానికి, వారి న్యాయమైన డిమాండ్లకు మద్దతుగా భారతదేశంలోని ప్రజాతంత్ర వర్గాలకు చెందిన ప్రజలందరినీ సమీకరించ లేకపోయాము."

అదే సమయంలో పార్టీలో ముదిరిన అంతర్గత విభేదాలు, మితవాద ధోరణులు, తప్పుడు ప్రచారాల ఫలితంగా జరిగిన నష్టాన్ని కూడా ఆ తీర్మానం ఈ కింది విధంగా ప్రస్తావించింది.

"కానీ గత రెండు సంవత్సరాల కాలంలో పార్టీలో సాగిన ఆంతరంగిక చర్చలు పార్టీని బలహీనపరిచి తెలంగాణ రైతాంగ సాయుధ

> “ హైదరాబాద్ స్టేట్ భారత్‌లో విలీనం విషయంలో భిన్నాభిప్రాయాలు లేవు. సెప్టెంబర్ 17న విలీనమైన విషయం అందరూ అంగీకరించేదే. అట్లా జరగలేదని ఎవరూ చెప్పజాలరు. ఇది చారిత్రక వాస్తవం. అందు వల్ల సెప్టెంబర్ 17 విద్రోహదినమో లేక విమో చన దినమో కాదు. ఇది అక్షరాల విలీనమైన రోజు. ”

పోరాటానికి ఎనలేని హాని కలిగించాయి. తెలంగాణ ప్రజా ఉద్యమం, వ్యక్తిగత హింసా వాదం లేదా దళచర్యలు మినహా మరేదీ కాదనీ, అందులో ప్రజలు అస్సలు పాల్గొనడమే లేదని తప్పుడు వాదనలను, ప్రచారాన్ని కొనసాగించారు.”

“మనం సంప్రదింపుల ద్వారా పరిష్కారానికి సిద్ధంగా ఉన్నామనే కేంద్ర కమిటీ తీర్మానంలో భాగాన్ని పత్రికలకు విడుదల చేయడం మూలంగా మన శక్తి ఉడిగిపోయిందనీ, లంగుబాటుకు సిద్ధంగా ఉన్నామనీ ప్రభుత్వం భావించి మనపట్ల బిర్రబిగిసింది.”

పైవిషయాలను పరిశీలించినవారికెవరికైనా పోరాట విరమణ సమయంలో ‘విరమించడమా? లేక కొనసాగించడమా?’ అనే విషయం ప్రధానాంశమే కాదని స్పష్టంగా అర్థం చేసుకోవచ్చు. పోరాట నాయకత్వంలో పోరాట స్వభావమూ, నినాదాల విషయంలో ఏర్పడిన గందరగోళం సులభంగా నివృత్తి చేసుకున్నారు. అప్పటికే సాధించుకున్న విజయాలను కాపాడుకుంటూ, జాగ్రత్తగా విరమించడమా? లేక చేతులెత్తేయడమా? అన్నదే ప్రధానాంశం. కేంద్ర కమిటీ తీర్మానాన్ని పత్రికలకు లీక్ చేసి పోరాట క్షేత్రాన్ని వదిలేసిన మితవాదుల చర్యలే ప్రధాన సమస్య. సాయుధ రైతాంగ పోరాటాన్ని ఒంటెత్తు పోకడలుగా, దుందుడుకు చర్యలుగా, అతివాద, సెక్టేరియన్ ధోరణులుగా ముద్రవేసి దళాలను గందరగోళపరచిన మితవాదుల చర్యలే అసలు సమస్య. రైతుల స్వాధీనంలో వున్న భూములనూ, సాధించుకున్న ఇతర హక్కులనూ కాపాడుకోవడానికి ఆటంకమ య్యాయి. అందువల్ల పోరాటం కొనసాగించి ఉండవలసిందనీ, భారత దేశంలో విలీనం కావడం విద్రోహమని చెప్పడం నాటి తెలంగాణ ప్రజాభిప్రాయాన్ని గమనించక పోవడమే. అందుకే సెప్టెంబర్ 17ను విద్రోహ దినంగా చెప్పడం అర్థరహితం.

**ఇది విమోచన కాదా?**

బీజేపీ, సంఘ్‌పరివార్ శక్తులు తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటాన్ని హిందూ, ముస్లిం సమస్యగా చిత్రీకరించేందుకు ప్రయత్నిస్తున్నారు. తమ స్వార్ధ రాజకీయ ప్రయోజనాలకోసం చరిత్రను వక్రీకరిస్తున్నారు. నిజానికి తెలంగాణ ప్రజలు ఆనాడు దీన్ని మత సమస్యగా చూడలేదు. గ్రామీణ ప్రాంతాల్లో భూస్వాముల దౌర్జన్యాలకు, వెట్టిచాకిరీకి వ్యతిరేకంగా పోరాటం మొదలైంది. భూస్వాములు, జమీందారులు, జాగీరుదారులు హిందువులు అనే విషయం గమనించాలి. జమీందారీ దోపిడీకి వ్యతిరేకంగా మాత్రమే కాదు, నిజాం నిరంకుశత్వాన్ని కూడా ఎదిరించారు. జమీందారులకు రక్షణగా వచ్చిన నిజాం సైన్యాలను, రజాకార్లను ప్రతిఘటించారు. హిందూ జమీందార్లు, ముస్లిం పాలకులు ఏకమయ్యారు. దోపిడీకి వ్యతిరేకంగా పోరాడుతున్న రైతాంగాన్ని అణచివేసేందుకు పూనుకున్నారు. అయినా పోరాటం ఆగలేదు. మూడు జిల్లాల పరిధిలో 10 లక్షల ఎకరాల భూమి పంచారు. మూడువేల గ్రామాల్లో గ్రామ రాజ్యాలు ఏర్పడ్డాయి. ఈ గ్రామాల్లో ప్రజలే పరిపాలించారు. వెట్టిచాకిరీ రద్దు చేశారు. బేదఖళ్ళు నిలిపివేశారు. వ్యవసాయ కార్మికుల కూలి పెంచారు. కనీసవేతనం అమలు చేశారు. వడ్డీ వ్యాపాలరులను నియంత్రించారు. దౌర్జన్యంగా వ్యవహరించే ఫారెస్టు అధికారులను అక్కడినుండి తొలగించారు. దీంతో గిరిజనులు, అడవిని అనుకొని వున్న గ్రామాల ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. ఈ పోరాట ధాటికి తట్టుకోలేక భూస్వాములు పట్టణాలకు వలసపోయారు. నిజాం పాలన పునాదులే కదిలాయి. ఇదీ చరిత్ర. కానీ హైదరాబాద్ స్టేట్ ఇండియన్ యూనియన్‌లో విలీనం అయిన తర్వాత భూస్వామ్య దోపిడీ అంతం కాలేదు. పెట్టుబడిదారీ దోపిడీ పెరిగింది. దోపిడీ వ్యవస్థ నుంచి తెలంగాణ ప్రజలకు విముక్తి లభించలేదు. అందుకే సెప్టెంబర్ 17 విమోచన దినం కాదు. ఇది విమోచన దినమైతే, తెల్లదొరల నుంచి స్వాతంత్ర్యం పొందిన ఆగష్టు 15 కూడా విమోచన దినం కావాలి. అక్టోబర్ 26న కాశ్మీర్‌లో రాజా హరిసింగ్ పాలన అంతమై భారత్‌లో విలీనమైన రోజు కూడా విమోచన దినమే కావాలి. కానీ ఇవేవీ విమోచన దినం అనదగినవి కావు. విమోచన దినంగా పరిగణించకూడదు. మతపరమైన విభజన సృష్టించి పబ్బం గడుపుకోవడం కోసమే నేడు బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ వంటి సంఘ్ పరివార్ శక్తులు విమోచన దినంగా చెబుతున్నారు. తెలంగాణలో సెప్టెంబర్ 17న హిందువులు ముస్లిం పాలన నుండి విమోచన పొందారని ప్రచారం చేస్తున్నారు. భూస్వామ్య దోపిడీకి, రాచరికానికి వ్యతిరేకంగా సాగిన మహత్తర పోరాట చరిత్రను వక్రీకరిస్తున్నారు. 1940లో కామ్రేడ్స్ అసోసియేషన్‌ను స్థాపించింది ముస్లింలే. నిజాం ప్రభుత్వ దౌర్జన్యాలకు వ్యతిరేకంగా పోరాడి అసువులు బాసిన బందగి గానీ, రాచరికాన్ని నిలదీసి ప్రజాస్వామ్యం కోసం కలం పట్టి బలైన షోయబుల్లాఖాన్ గానీ, కార్మికోద్యమంతో నిజాం పాలకులను గడగడలాడించిన మగ్దూం మొహియుద్దీన్ గాని ముస్లింలేనన్న విషయం మరుగుపరిచేందుకు ప్రయత్నిస్తున్నారు.

**అసలేం జరిగింది?**

1948 సెప్టెంబర్ 17న హైదరాబాదు స్టేట్ ఇండియన్ యూనియన్‌లో విలీనమైంది. ముందే చెప్పుకున్నట్టు నిజాం ప్రభుత్వం కూలిపోయే దశలో నెహ్రూ సైన్యం జోక్యం చేసుకున్నది. రైతాంగ పోరాటం, కమ్యూనిస్టుల ప్రభావం పెరగటంతో ఆందోళన చెందిన నెహ్రూ ప్రభుత్వం రంగంలోకి దిగింది. ఇక్కడ నిజాం పాలకులు, అక్కడి నెహ్రూ ప్రభుత్వం మిలాఖత్ అయ్యాయి. నిజానికి ప్రజాస్వామ్య ప్రభుత్వానికీ, రాచరికానికి పొసగదు. అయినా కమ్యూనిస్టుల భయంతోనే వీరు కుమ్మక్కయ్యారు. పెట్టుబడిదారీ ప్రతినిధులు, జమీందారీ ప్రతినిధులు మిలాఖత్ అయ్యారు. స్వాతంత్ర్యోద్యమ కాలంలోనూ, ఆ తర్వాత క్రమంగా బలపడిన పెట్టుబడిదారులు, భూస్వాముల మిలాఖత్‌కు కొనసాగింపే ఇది. అందుకే హైదరాబాద్ స్టేట్ భారత్‌లో విలీనం కొందరు ప్రచారం చేస్తున్నట్టు సర్దార్‌పటేల్ ఘనకార్యం కాదు. నెహ్రూ, నిజాంల మైత్రి ఫలితం కూడా కాదు. ఇది తెలంగాణ రైతాంగ పోరాట ఫలితం.

హైదరాబాద్ స్టేట్ భారత్‌లో విలీనం విషయంలో భిన్నాభిప్రాయాలు లేవు. సెప్టెంబర్ 17న విలీనమైన విషయం అందరూ అంగీకరించేదే. అట్లా జరగలేదని ఎవరూ చెప్పజాలరు. ఇది చారిత్రక వాస్తవం. అందు వల్ల సెప్టెంబర్ 17 విద్రోహదినమో లేక విమోచన దినమో కాదు. ఇది అక్షరాల విలీనమైన రోజు. 1946 జూలై 4 దొడ్డి కొమరయ్య అమరుడైన రోజు. సాయుధ రైతాంగ పోరాటం ప్రారంభమైన రోజు. దేని ప్రాధాన్యత దానిదే. చరిత్రను ఎవరూ వక్రీకరించజాలరు. ❋

చరిత్ర

# కొత్త రాతియుగం: భారతదేశం

ఎంవిఎస్ శర్మ

పాతరాతియుగం నుండి మధ్య శిలాయుగం దాటి కొత్తరాతి యుగంలోకి మానవ ప్రస్థానం మొదలైంది. 'కొత్తరాతియుగం' అని ప్రత్యేకించి ఈ దశను విభజించడానికి ప్రాతిపదిక ఏమిటి?

పాత, మధ్య రాతియుగాల్లో ఒకరాయిని ఇంకొక రాయితో కొట్టి పగలదీసేవారు. అలా పగిలినపుడు మొనదేలిన అంచులతో పదునుగా ఉండే పనిముట్లు వచ్చేవి. అవి రకరకాల ఆకారాలు కలిగి ఉండి రకరకాలుగా ఉపయోగపడేవి. కొత్తరాతియుగంలో ఒకరాయిని కావాల్సిన ఆకారం వచ్చేవరకూ ఇంకొక పెద్దరాయి మీద అరగదీసే పద్ధతి మొదలు పెట్టారు. ఇదే కొత్తరాతియుగం మొదలైంది అనడానికి సూచన. ఇలా అరగదీయడం వలన నునుపైన, ఒక నిర్దిష్టమైన ఆకారం కలిగిన పరికరాలను తయారు చేయడానికి వీలుపడింది. ధాన్యాన్ని పొట్టుతీయడానికి గాను దంచడం ఇటువంటి నునుపు గలిగిన పనిముట్ల వల్లనే సాధ్యపడింది. తిరగలి, రోలు, పాత్రం వంటి పనిముట్లను నేటికీ ఇంకా వినియోగిస్తున్న ఇళు ఉన్నాయి. కొత్త రాగియుగం పరికరాల వల్ల పిండిదంచడం, పొట్టుతీయడం వంటి పనులు సాధ్యపడ్డాయి. బాగా పదును ఉండేలా అంచును అరగదీసిన తర్వాత ఆ రాతి గొడ్డలితో చెట్లు నరకడం అంతకు ముందుతో పోల్చితే తేలికయింది. బాగా చదునుగా అరగదీసిన రాతి దిమ్మతో నేలను చదును చేయడం తేలికయింది. ధాన్యాన్ని సేకరించడమేగాక వాటిని పునరుత్పత్తి చేయడానికి కొన్ని గింజలను గుంతలు తవ్వి విత్తే ప్రక్రియ ఈ కాలంలో మొదలైంది. వేటాడే పనిలో మగవారు ఎక్కువగా పాల్గంటే గింజలు, కాయలు, దుంపలు వంటివి సేకరించే పనిలో ఆడవారు ఎక్కువగా పాల్గన్నారు. స్త్రీలు బిడ్డలను కనేవారుగా ప్రకృతిరీత్యా ఉన్నందువల్లనే బహుశా ఈ విధమైన మొట్టమొదటి శ్రమవిభజన జరిగి వుండొచ్చని ప్రముఖ పురాతత్త్వ శాస్త్ర నిపుణుడు గార్డన్ చైల్డ్ (1892–1957) భావించారు. పదునైన మొన కలిగి వుండే విధంగా రాయిని అరగదీసి దానిని ఒక కర్రకు కట్టి, ఆ పనిముట్టుతో నేలను తవ్వి గుంతలు చేసి వాటిలో విత్తులు విత్తేవారు. పదునైన అంచుగల గొడ్డళ్లు, వాడి మొనగలిగిన రాళ్లను కర్రలకు కట్టి తయారు చేసిన ఈటెలు, బాణాలు వేటాడే సామర్థ్యాన్ని పెంచాయి.

భూగోళం మీద కొత్తరాతియుగంలోకి మానవులు అడుగుపెట్టిన కాలం క్రీ.పూ. 10,000 సంవత్సరాల క్రితం నాటి మొదటి ఆధారాలు ప్రస్తుత పాలస్తీనా, సిరియా ప్రాంతంలో లభించాయి. ఆఫ్ఘనిస్తాన్ మీదుగా భారత ఉపఖండంలోకి కొత్తరాతియుగం ప్రవేశించింది. క్రీ.పూ. 8,000 సంవత్సరంలో సింధునది పరీవాహక ప్రాంతంలోని మెహర్‌ఘర్ (ప్రస్తుతం బెలూచిస్థాన్‌లో ఉంది) తవ్వకాలంలో కొత్తరాతియుగపు అవశేషాలు లభించాయి.




(కొత్త రాగి యుగం పనిముట్ల 1.గొడ్డలి. 2. కత్తి 3. వెడల్పాటి కత్తి 4. రింగు 5. రోలు)

### పశ్చిమ సరిహద్దుల్లో తొలిరైతులు


మెహర్‌ఘర్ ప్రాంతంలో లభించిన అవశేషాలు క్రీ.పూ 7,000–5,000 సంవత్సరాల కాలానికి చెందినవి. వీటిని బట్టి ఆ ప్రాంత ప్రజలు మట్టి ఇటుకలు (ఎండబెట్టినవి. అప్పటికి ఇంకా కాల్చిన ఇటుకల తయారీ మొదలు కాలేదు) ఉపయోగించి కట్టిన ఇళ్లల్లో ఉండేవారని తెలుస్తోంది. ఈ ఇళ్లు వేరువేరు గదులుగా విభజించబడి ఉన్నాయి. ఒక గదిని ప్రత్యేకంగా నిప్పు ఉంచేందుకు కేటాయించారు. దొరికిన ధాన్యపు గింజలను బట్టి ఆ కాలంలో బార్లీ, గోధుమ, మొక్కజొన్న వంటివి పండించేవారని తెలుస్తోంది. వ్యవసాయం విస్తృతంగా చేస్తూ వుండేవారని చెప్పవచ్చు. అక్కడి ఇళ్లల్లో కొన్నింటిని ధాన్యాగారాలుగా ఉపయోగించినట్టు అనిపిస్తోంది. వ్యవసాయం విస్తృతంగా జరగబట్టి పశువులకు మేత దండిగా లభించే వీలు ఏర్పడింది. దీనివలన పశుపోషణ కూడా జరిగిందని, వాటినుండి పాలు, మాంసం లభించే వీలు కలిగినందున వేటపై ఆధారపడడం తగ్గిందని చెప్పాలి. ఆహార లభ్యత పెరిగినందున జనాభా పెరుగుదలతో బాటు స్థిర ఆవాస ప్రాంతాలు ఏర్పడ్డాయి. వ్యవసాయం రోజువారీ పోషణనేగాక కొంత మిగులును కూడా అందిస్తుంది. ఈ మిగులుపై ఆధిపత్యం కోసం ఆచారాల పేరుతోనో, మత సాంప్రదాయాలపేరుతోనో, బలప్రయోగం ద్వారానో ఇతరులు ప్రయత్నించడానికి కూడా ఆస్కారం ఏర్పడింది. వర్గాలు, వ్యక్తిగత ఆస్తి రంగప్రవేశం చేయడానికి ప్రాతిపదిక ఏర్పడింది.

ఈ మొత్తం మార్పునే కొత్తరాతి యుగ విప్లవం అని గార్డన్ చైల్డ్ అన్నాడు. ఈ మార్పు జరగడానికి 3,000 సంవత్సరాల కాలం పట్టిందని, అటువంటప్పుడు ఇది 'విప్లవం' ఎలా అవుతుందని కొందరు గార్డన్ చైల్డ్‌తో విభేదించారు. మధ్యరాతియుగకాలం 25,000 సంవత్సరాల వ్యవధిలో మార్పులు జరిగిన వేగంతో పోల్చితే కేవలం 3,000 సంవత్సరాల వ్యవధిలో కొత్తరాతియుగంలో వచ్చిన మార్పులు వ్యవసాయం, స్థిరనివాసం, మిగులు,



రచయిత
ప్రజాశక్తి సంపాదకులు

> **❝ అంటే దక్షిణాపథంలో ఈకాలంలో మానవ నాగరికత ఉండేదన్నమాట. ఉత్తరప్రదేశ్‌లో క్రీపూ. 8000 నాటి ఆధారాలు తవ్వకాలలో లభించాయి. సరాయ్‌నహర్‌రాయ్, మహాదపం అనే ప్రాంతాలలో ఆ కాలానికి చెందిన మానవ అస్థిపంజరాలు లభించాయి. వీటిని బట్టి ఆ మనుషులు ఎత్తైనవారని ధృవపడింది. మగవాడు 180 సెంటీమీటర్లు ఆడువారు 170 సెంటీమీటర్లు పొడవు సగటున ఉన్నారు. ఆ సమాధుల దగ్గర దొరికిన పరికరాలలో విల్లంబు లు ఉన్నాయి.❞**



మెహర్‌ఘర్ వాసుల గృహం (ఊహచిత్రం)

వర్గవిభజన– వంటివి రావడం విప్లవాత్మక మేనని చెప్పాలని గార్డన్ చైల్డ్ భావించాడు.

మెహర్‌ఘర్ ప్రాంతంలో మేకలు, మూపురం ఉండే ఎద్దులు, ఆవులు, గొర్రెలు పెంపుడు జంతువులుగా ఉన్నాయి. కొన్నింటిని పట్టి మచ్చిక చేస్తే మరికొన్ని పశువుల కొట్టాల్లోనే పుట్టుకొచ్చాయి. మరికొన్ని జంతువులు ఇంకా మచ్చిక కాలేదు. వాటిలో గేదెలు ఉన్నాయి. ఇవి ముఖ్యమైన ఆహార అవసరు కావడంతో వేట అవసరం తగ్గినా, వాటికోసం దాన్ని కొనసాగించడం ఆవశ్యమే అయింది.


మెహర్‌ఘర్‌లో ఈదశకు సంబంధించిన తవ్వకాలలో కుండల తయారీకి సంబంధించిన ఆధారాలేవీ లేవు. కాని అడవిలో దొరికే పూడలతో చేసిన బుట్టలు ఉన్నాయి. జంతువుల బచ్చుతో చేసిన వస్త్రాలున్నాయి. గులకరాళ్లు, శంఖాలు ఆభరణాలుగా ధరించేవారు. మరణించినవారిని ఆ భరణాలతో సహ పూడ్చిపెట్టేవారు. ఇటువంటి ఆభరణాలను పొందడానికి పెద్దమొత్తంలో తమ స్వాధీనంలోని ధాన్యాన్ని పెత్తందార్లు ముట్టజెప్పేవారు. పశు పెంపకం, చేతివృత్తులు అభివృద్ధి చెందాయి.

క్రీ.పూ 5,000–4,000 మధ్య కాలం రెండోదశకు చెందినది. ఈ దశలో ధాన్యాగారాల సైజు పెరిగింది. అంటే మిగులు పోగేసుకోవడం పెరిగిందనుకోవాలి. అలాగే వ్యవసాయం మరింత విస్తరించి ఉండాలి. కొడవళ్లు ఉపయోగించటం మొదలైంది. తారులో రాతి ముక్కలను అతికి కొడవళ్లు రూపొందించారు.

ఈ కాలానికి సంబంధించిన గోధుమ, బార్లీ గింజలను బట్టి నీటిపారుదల వ్యవస్థ ఒకమేరకు అభివృద్ధి చెందివుండాలని చెప్పవచ్చు. తగినంత నీటి సదుపాయం లేనిదే అటువంటి పంటలు పండవు. అంతేగాక దొరికిన గింజలలో పత్తి గింజలు కూడా ఉన్నాయి. అంటే పత్తి సాగుకూడా మొదలైందన్నమాట. ప్రపంచంలోనే బట్టల తయారీ తొలుత మొదలైంది ఇక్కడే అని చెప్పవచ్చు. క్రీ.పూ. 4,000 నాటికి మేకల సైజు తగ్గిపోయింది. పెంపకంలో వాటి శరీరాకృతి ఆ విధంగా మారి పోయింది. వేట ద్వారా లభించే జంతుమాంసం కన్నా పెంపుడు జంతువుల మాంసాన్నే ఎక్కువ వినియోగించారని దొరికిన ఎముకల అవశేషాలను బట్టి నిర్ధారించారు.

చేతివృత్తుల్లో ముఖ్యమైన పరిణామం ఈ కాలంలో కుండలు తయారు చేయడంలో కనపబడుతుంది. మొదట్లో ముద్దలు ముద్దలుగా మట్టిని అమర్చి వంకరటింకరగా కుండలు చేసేవారు. ఆ తర్వాత చెట్ల ఊడలను బుట్టలుగా అల్లి, గట్టిపడడానికి వాటిని కాల్చి వాటిమీద మట్టిపూసేవారు. దొరికిన మేరకు తారు కూడా పూసేవారు. క్రీ.పూ 4,000 నాటికి కుమ్మరి సారె వాడకంలోకి వచ్చింది. పశ్చిమ ఆసియాలో ఈ కుమ్మరి సారె క్రీ.పూ 5,000 నాటికే ఉంది. దీనిని బట్టి మెహర్‌ఘర్ ప్రజలు దీనిని మధ్య ఆసియా నుండి దిగుమతి చేసుకున్నారని భావించారు. ఈ కుమ్మరి సారె వినియోగంతో కుండల తయారీ వేగమూ, నైపుణ్యమూ రెండు పెరిగాయి.

ఆనాటి సమాధులను పరిశీలిస్తే మరణించిన వారి దేహాలతో బాటు కొన్ని పనిముట్లను, చంపిన జంతువులను, ఆభరణాలను కూడా సమాధి చేసినట్టు కనబడుతుంది. దీనిని బట్టి ఆనాటి ప్రజలకు మరణానంతరం వేరే లోకంలో జీవితం కొనసాగుతుందన్న విశ్వాసాలు ఉన్నట్టు చెప్పవచ్చు. ఆ సమాధుల్లో దొరికిన కొన్ని రంగురాళ్లు మెహర్‌ఘర్ ప్రాంతంలో లభించేవి కావు. అంటే సుదూర ప్రాంతాల నుంచి వాటిని తెచ్చారన్నమాట. దీనిని బట్టి మెహర్‌ఘర్ ప్రజలకు దూరప్రాంతాలతో వ్యాపార సంబంధాలు ఉండినవని చెప్పవచ్చు. కొన్ని సమాధుల్లో మాత్రమే ఈ రంగురాళ్లు దొరికాయి. కొన్నింట్లో లేవు. అంటే ప్రజల్లో వర్గవిభజన ఉన్నట్టు,



వ్యవసాయ పనిముట్లు: రాతి కొడవలి


సంపన్నులకే రంగురాళ్లు ధరించే స్తోమత ఉన్నట్టు నిర్ధారించవచ్చు.

మట్టితో చేసిన కొన్ని ఆకారాల బొమ్మలు, జేగురు రంగు పూసినవి. జంతువుల ఆకారాల మట్టిబొమ్మలు, మట్టిపూసల ఆభరణాలు కూడా దొరికాయి. బహుశ ప్రజలు వీటిని తాయెత్తుగా ధరించి వుండొచ్చు. వారికున్న మూఢనమ్మకాలకు ఇవి తార్కాణం.

మెహర్‌ఘర్ వంటి గ్రామాలు మరికొన్ని ఆ చుట్టుపక్కల (బెలూచిస్తాన్ వాయువ్య ప్రాంతంలో) తవ్వకాలలో బైటపడ్డాయి. సింధు ప్రాంతానికి దక్షిణాన కూడా ఇటువంటి గ్రామాల ఉనికి బైటపడింది. పశ్చిమాన మధ్యధరా ప్రాంతం నుండి తూర్పున సింధునది ప్రాంతం వరకు నడుమ ఉన్న విస్తార భూభాగంలో ఇటువంటి గ్రామాల ఉనికి పలుచోట్ల ఉండినట్టు ఆధారాలు తెలియజేస్తున్నాయి. సంచారతెగలు, ముఖ్యంగా పశువుల కాపరులు వివిధ ప్రాంతాల మధ్య సంబంధాలు ఏర్పడడానికి సంధానకర్తలుగా ఉండినట్టు భావించాలి. ఈ విస్తార ప్రాంతంలో పలుజాతులు జీవించినట్టు కనపడుతుంది. అస్థిపంజరాల పళ్లవరసను పరిశీలిస్తే మన భారతదేశపు తొలి "రైతులు" పశ్చిమ ఆసియా వాసులకన్నా దక్షిణ ఆసియా, ఆగ్నేయ ఆసియా వాసులకు దగ్గరగా ఉన్నట్టు స్పష్టం అవుతోంది. భిన్న జాతుల నడుమ సంపర్కం కొనసాగిన క్రమంలోనే మెహర్‌ఘర్ వాసుల జన్యులక్షణాలలో మార్పులు క్రమంగా చోటుచేసుకున్నాయని చెప్పాలి. ❋

# పెట్టుబడిదారీ వ్యవస్థ, జనాకర్షణవాదం: సంక్షోభంలో ఉదారవాదం

**(అఖిల్ బిల్‌గ్రామీ అంతర్జాతీయంగా పేరు ప్రఖ్యాతులు పొదిన భారతీయ తత్వవేత్త. మేధావి. 1970లో బొంబాయి విశ్వవిద్యాలయానికి చెందిన ఎల్ఫిన్‌స్టోన్ కాలేజీలో పట్టభద్రుడైన బిల్‌గ్రామి తరువాత ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీలో చదివారు. తదుపరి అమెరికా వెళ్లి 1983లో చికాగో యూనివర్శిటీ నుండి తత్వశాస్త్రంలో పిహెచ్‌డి పట్టా పొందారు. అనేక విశ్వవిద్యాలయాల్లో ఆయన పనిచేశారు. లౌకికవాదం, ఆధునికవాదం, మార్క్సిజం, గాంధీయిజంపై ఆయన చేసిన రచనలు, ఆయన తాత్విక ఆలోచనలు ఈ అంశాల్లో కొత్త కోణాలను వెలికితీశాయి. ట్రై కాంటినెంటల్ ఇనిస్టిట్యూట్ ఫర్ సోషల్ రిసెర్చ్‌కు చెందిన జిప్సన్ జాన్, జితీష్ పి.ఎం లు ఇటీవల బిల్‌గ్రామీని సుదీర్ఘంగా ఇంటర్వ్యూ చేశారు. ఆ ఇంటర్వ్యూ సారాంశాన్ని మార్క్సిస్టు పాఠకులకు రెండు భాగాలుగా అందిస్తున్నాం... సంపాదకుడు)**



**– అఖీల్ బిల్‌గ్రామీ**

మనం పత్రికల్లో తరచూ జనాకర్షక (పాపులిస్టు) విధానాలు, జనాకర్షక చర్యలు అనే వాటి గురించి చదువుతూ ఉంటాం. జనాకర్షణ ఉద్యమాలు, రాజకీయాల చుట్టూ కూడా పెద్ద చర్చ జరుగుతోంది. జనాకర్షణవాదం (పాపులిజం) అన్న పదానికి నిఘంటువుల్లో ''ధనవంతులను ప్రతిఘటించడానికి సామాన్యప్రజలు చేసే రాజకీయ కృషి" అనే అర్థం ఉంది. వాస్తవానికి జనాకర్షక వాదం అనేదానికి దాదాపు అర్థం అదే. కానీ చాలా మంది ఈ పదాన్ని ఇప్పుడు ఒక అవమానకరమైన పదంగా ఉపయోగిస్తున్నారు. ధనిక వర్గాలవారే కాదు మామూలు ప్రజలు కూడా దీన్ని ఈ విధంగా పేర్కొనడం తరచూ జరుగుతోంది. జనాకర్షణవాదం అంటే ధనవంతులను ప్రతిఘటించడం అయితే అది సామాన్య ప్రజల దృష్టిలో చెడ్డ పదం ఎలా అవుతుంది? ప్రజాస్వామ్యం అనేదానికి అర్థం కూడా ధనికులను సామాన్య ప్రజలు ప్రతిఘటించడమే. మరి అలాంటప్పుడు ప్రజాసామ్యానికీ, జనాకర్షణవాదానికీ మధ్య తేడా ఏముంటుంది?

జనాకర్షణవాదం అనే పదాన్ని చాలా మంది చాలా రకాలుగా ఉపయోగిస్తున్నారు. ఒకదానికొకటి పొసగని విషయాలకు కూడా ఈ పదాన్ని ఉపయోగిస్తున్నారు. ఉదాహరణకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, సోషలిస్టు భావాలు వ్యక్తం చేసే ప్రతిపక్ష నేత బెర్నీ సాండర్స్ ఇద్దరివీ జనాకర్షక విధానాలే అంటున్నారు. అలాగే టర్కీ అధ్యక్షుడు ఎర్డొగాన్, భారత ప్రధాని నరేంద్ర మోడీ, బ్రిటన్‌లో ప్రతిపక్షనేత జెరిమీ కార్బిన్, బ్రెగ్జిట్ కోరుకునే వాళ్లు, ఫ్రాన్స్‌లో ఫాసిస్టు నేత లీ పెన్... వీరందరినీ జనాకర్షక (పాపులిస్టు) నాయకులు అంటున్నారు. ఒకప్పుడు అర్జెంటీనాలోని పెరోనిజం, రష్యాలో నరోద్నిక్కులను, 19వ శతాబ్దం చివరిలో అమెరికాలో బయలుదేరిన వ్యవసాయ ఉద్యమాలను కూడా ఇదే కోవలో చేర్చారు. ఇవన్నీ కూడా జనాకర్షక విధానాలే అయితే, వాటిని అనుసరించే వారంతా జనాకర్షక నేతలే అయితే వీరి మధ్య ఏదో ఒక ఉమ్మడి అంశం ఉండాలి కదా! కాని విచిత్రమేమంటే ఈ విధానాలన్నీ ఒకటి కావు, ఈ నాయకులంతా ఒకే కోవకు చెందరు.

ఉదాహరణకు ట్రంప్, బ్రిటన్‌ను ఐరోపా యూనియన్‌నుండి వైదొలగాలని కోరుకునే వారు (బ్రెగ్జిటీర్స్) ఒక రకంగా ప్రపంచీకరణకు వ్యతిరేకులు. కానీ అభివృద్ధి చెందుతున్న దేశాల్లో నరేంద్ర మోడీ, ఎర్డొగాన్‌లు దీనికి భిన్నంగా ప్రపంచీకరణను కోరుతున్నారు. అమెరికాలో సాండర్స్, బ్రిటన్‌లో కార్బిన్‌లను వామపక్ష జనాకర్షక వాదులు అంటున్నారు. లి పెన్, ట్రంప్‌లను మితవాద జనాకర్షణవాదులు అంటున్నారు. జానాకర్షణవాదం వెనుక

“ జనాకర్షణవాదం అనే దాన్ని సాంస్కృతిక, మానసిక అంశాలతో వివరించడానికి పూనుకుంటారు. ఎవరో ఒక వ్యక్తి కేంద్రంగా ఇది నడుస్తుందని చెబుతారు. వ్యక్తి ఛారిష్మాపై ఆధారపడుతుందంటారు. కానీ అన్ని వేళలా అది నిజం కాదు. మోడీ, ఎర్డొగాన్‌ల విషయంలో ఇది నిజం కావచ్చుగానీ శాండర్స్, కార్బిన్‌ల విషయంలో కాదు. ”



వలసలను అడ్డుకోడానికి మెక్సికో సరిహద్దుల్లో అమెరికా నిర్మిస్తున్న గోడ

ఇటువంటి వ్యతిరేకమైన సారాంశాలున్నప్పుడు దాన్ని రెండుగా అర్థం చేసుకునే అవకాశం ఉంది. మొదటిది, జనాకర్షణవాదం అనేది దేనికదే ఒక భిన్నమైన అంశం. అంటే వామపక్ష జనాకర్షణవాదం వేరు మితవాద జనాకర్షణవాదం వేరు. ప్రపంచీకరణ అనుకూల జనాకర్షణవాదం వేరు, ప్రపంచీకరణ వ్యతిరేక జనాకర్షణ వాదం వేరు. రెండోది, అన్ని రకాల జనాకర్షణ వాదాల వెనుక ఒక ఉమ్మడి అంశం ఏదో ఉంది. పరిశీలిస్తే మొదటి వాదనే సరైందని తేలుతుంది. జనాకర్షణవాదం అనే విభిన్న రకాల మధ్య ఉమ్మడి అంశం ఏదీ లేదు.

జనాకర్షణవాదం అనే దాన్ని సాంస్కృతిక, మానసిక అంశాలతో వివరించడానికి పూనుకుంటారు. ఎవరో ఒక వ్యక్తి కేంద్రంగా ఇది నడుస్తుందని చెబుతారు. వ్యక్తి ఛారిష్మాపై ఆధారపడుతుందంటారు. కానీ అన్ని వేళలా అది నిజం కాదు. మోడీ, ఎర్డొగాన్‌ల విషయంలో ఇది నిజం కావచ్చుగానీ శాండర్స్, కార్బిన్‌ల విషయంలో కాదు. అందువల్ల జనాకర్షణవాదం అనేదాన్ని రాజకీయాలు, రాజకీయ అర్థశాస్త్రం నుండి విడగొట్టి కేవలం సాంస్కృతిక, మానసిక అంశాలుగా చూడకూడదు. జనాకర్షణ వాదాన్ని రాజకీయాలు, రాజకీయ అర్థశాస్త్ర కోణంలో పరిశీలించినప్పుడు వామపక్ష జనాకర్షణవాదానికీ, మితవాద జనాకర్షణవాదానికీ అసలు పొంతనే లేదనీ, ఈ రెండూ రెండు భిన్నమైన అంశాలని తేలుతుంది. అందువల్ల ఎవరైనా జనాకర్షణవాదాన్ని విశ్లేషించబూనుకున్నప్పుడు రెండు రకాల జనాకర్షణవాదాలను వేరువేరుగా చూసి, వేరువేరుగా విశ్లేషించాలి.

అయితే ఈ రోజు సారాంశంలో విభిన్న రకాలైన ఒక్కోసారి ఒకదానికి ఒకటి వ్యతిరేకంగా ఉండే రెండు రకాల జనాకర్షణవాదాల ఎదుగుదలకు ఒకే ఉమ్మడి కారణం ఉంది. మనం గనుక లోతుగా అధ్యయనం చేస్తే ఈ ఉమ్మడి కారణం వెనుక రెండు అంశాలు కనిపిస్తాయి. మొదటిది, సామాన్య ప్రజలపై గత మూడు దశాబ్దాలుగా పెట్టుబడిదారీ విధానం మోపుతున్న తీవ్రమైన భారాలు, కష్టాలు. రెండవది, ఈ కష్టాల కారణాలను అర్థం చేసుకుని, విమర్శించి, ప్రతిఘటించడంలో రాజకీయ స్థాయిలో జరిగిన వైఫల్యం. ఇక్కడ మొదటి పాయింటు కన్నా రెండో పాయింటు ముఖ్యమైనది. ప్రస్తుత పెట్టుబడిదారీ వ్యవస్థ ప్రజలపై విధిస్తున్న భారాలను గుర్తించే చాలామంది రెండో పాయింటు అంటే రాజకీయ రంగంలో దాన్ని ప్రతిఘటించడంలో జరిగిన వైఫల్యాలను తెలుసుకోవడంలో విఫలం అవుతున్నారు. దీనికి కారణమేమంటే లిబరల్ బూర్జువాల్లోనే నేడు జనాకర్షణవాదానికి వ్యతిరేకత నెలకొని ఉండడం. నిజానికి జనాకర్షణ విధానాలు అహేతుకమైనవని చెబుతూ వాటిని తీవ్రంగా వ్యతిరేకిస్తున్న లిబరల్ రాజకీయవేత్తలు, వ్యాఖ్యాతలు ఒక రకంగా వారే తీవ్రమైన నిర్హేతుకతలో ఉన్నారు. జనాకర్షణవాదం పట్ల లిబరల్స్‌లోని ఈ నిర్హేతుకతే గత మూడు దశాబ్దాలుగా వారు నయా-ఉదార ఆర్థిక వాదంతో కలిసి పయనించడానికి కారణమయ్యింది. నిజానికి లిబరలిజం యొక్క ఈ నిర్హేతుక విధానమే వామపక్షాలకు అసలైన శత్రువు.

మన కాలంలో జనాకర్షణ విధానాలు పెంపొందడానికి అంతర్జాతీయ ఫైనాన్స్ పెట్టుబడిదారీ వ్యవస్థ కారణమని చాలామంది చెబుతుంటారు. కానీ ఈ జనాకర్షణ విధానాల్లో అనేకం “అహేతుకంగా” ఉండడానికి కారణం లిబరలిజం అని తెలుసుకోరు. రాజకీయ రంగంలో ప్రపంచీకరణకు వస్తున్న ప్రతిఘటనను కుదించడంలో, పక్కదారి పట్టించడంలో లిబరలిజం నిర్వహిస్తున్న పాత్ర దీని వెనుక నున్న అసలైన కారణం. ఉదాహరణకు, ఫైనాన్షియల్ టైమ్స్‌లో ఎడ్వార్డ్ లూసి అనే లిబరల్ వ్యాఖ్యాత వ్యాసం చూద్దాం. ట్రంప్ గెలుపుపై ఆయన రాస్తూ, “2008లో ఒబామా గెలుపు ప్రజల్లో భవిష్యత్తుపై ఆశను ఉద్దీపనం గావించింది, కానీ ట్రంప్ గెలుపు ప్రజల్లో ఆగ్రహాన్ని వ్యక్తీకరించింది” అన్నాడు. కానీ ఆయన తన వ్యాసంలో ఎక్కడా కూడా ఒబామా తన హామీలు నెరవేర్చకపోవడం వల్లనే ఈ ఆగ్రహం వ్యక్తమైందన్న విషయం చెప్పలేదు. ఒబామాతో పోల్చి చెప్పడం ద్వారా ఆయన ట్రంప్ మితవాద జాతీయవాదాన్ని పైకి ఎత్తివేస్తూ లిబరలిజం చనిపోయిందని పేర్కొంటున్నారు. అమెరికాలోనే కాదు యూరప్ అంతటా తలెత్తుతున్న మితవాద జాతీయవాదం లిబరలిజాన్ని చంపేస్తున్నదని రాస్తున్నారు. కానీ లిబరలిజం చనిపోలేదు. అది అన్నిచోట్లా ఉంది. మితవాదం విఫలమయితే దాని స్థానంలో

బెర్నీ శాండర్స్ వంటి వారు చేపట్టిన సోషల్ డెమొక్రాటిక్ విధానాలు అధికారంలోకి రాకుండా చేయడం కోసం లిబరలిజం అన్ని చోట్లా పొంచి కూర్చుంది. అభివృద్ధికర ఆర్థికవేత్తగా పరిగణించబడే పాల్ క్రుగ్‌మాన్ గత ఎన్నికల్లో ప్రైమరీల్లో హిల్లరీ క్లింటన్‌కు మద్దతిచ్చాడే గాని శాండర్స్‌కు కాదు. అలాగే యువ ఆశలకు ప్రతిబింబంగా చెప్పబడే రోలింగ్ స్టోన్ మ్యాగజైన్ కూడా శాండర్స్‌కు కాకుండా హిల్లరీకి మద్దతిచ్చింది. విద్యా రుణభారం పెరిగిపోయిన అమెరికన్ యువత ఒకవైపు శాండర్స్ వెనుక సమీకృతమైతే యువకుల గళంగా పేర్కొనే రోలింగ్ స్టోన్ పండితులంతా హిల్లరీ వెనుక నిలిచారు. ట్రంప్‌కన్నా హిల్లరీ నయం కదా అంటే అవును నయమే. కాని ఎనిమిదేళ్ల లిబరల్ ఒబామా పాలనలోనే కార్మికుల వేతనాలు స్తంభించిపోయాయి, నల్లజాతి అమెరికన్ల పరిస్థితి దిగజారిపోయింది, జాత్యాహంకారం ముందుకు వచ్చింది, సంక్షోభానికి కారణమైన బ్యాంకర్లు తప్పించుకుపోయారు, విద్యా రుణభారం పెరిగిపోయింది. అంతేకాదు ఈ రోజు వలసవాదులపై ట్రంప్ తీసుకుంటున్న చర్యలను లిబరల్స్ సరిగ్గానే విమర్శిస్తున్నారు, కానీ 2008 ఎన్నికల్లో ఒబామానే ఈ విషయంలో తన ప్రత్యర్థి జాన్ మెక్కైన్ కన్నా మితవాద వైఖరి తీసుకున్నాడు.

అందరికన్నా శాండర్స్ ఎన్నుకోడానికి మెరుగైన వ్యక్తి అంటే అర్థం ఆయన విధానాలు నేటి పెట్టుబడిదారీ సంక్షోభం నుండి అమెరికాను బయటపడేస్తాయని కాదు. కానీ ఈ లిబరల్ మేధావులంతా కూడా శాండర్స్‌ను ఒక శాపంగా పరిగణించడాన్ని చూస్తే లిబరలిజం ఉద్దేశం ఏమిటో తెలుస్తుంది. అందువల్ల లిబరలిజం చనిపోవడం లేదు, వామపక్షంవైపు ప్రజా నిరసన కొట్టుకుపోకుండా ఆపడం కోసం అది అన్ని చోట్లా బతికే ఉంది. అందుకే ఈ లిబరల్‌వాదులు శాండర్స్, కార్బిన్‌లను కూడా "జనాకర్షణవాదుల" జాబితాలో చేర్చి, వారు ఎన్నిక కావడానికి అనర్హులని తేలుస్తారు.

1980వ దశకం నుండి కార్మిక వర్గానికి గతంలో ఉన్న సదుపాయాలను కత్తిరించడం అనేది పెట్టుబడిదారీ ప్రపంచ అంతటా జరుగుతోంది. అందువల్లనే శ్రామిక ప్రజలు నేడు జనాకర్షక ఉద్యమాల్లోకి పెద్ద ఎత్తున వస్తున్నారు. ఈ ఉద్యమాలే ట్రంప్‌లూ, మోడీలు పెరగడానికి కారణమవుతున్నాయి. బ్రెగ్జిట్ వంటి క్రమాలకు కారణమవుతున్నాయి. బ్రెగ్జిట్ ఒప్పందం మీద చాలా చర్చ జరిగింది. కానీ యూరోపియన్ యూనియన్ (ఇయు) నుండి బ్రిటన్ బయటకు రావడానికి కారణం లండన్ నగరం కాకుండా ఇతర ఇంగ్లండ్ పట్టణాల్లోని కార్మికవర్గం అసంతృప్తి చెందడం. ప్రపంచీకరణ విధానాల వల్ల ఇంగ్లండ్‌లోని ఇతర ప్రాంతాలన్నీ విపారిశ్రామీకరణ చెందగా ఒక్క లండన్ నగరం మాత్రమే బాగుపడింది. కన్సర్వేటివ్ పార్టీ నాయకురాలు మార్గరెట్ థాచర్ ప్రారంభించిన విధానాలను తరువాత లేబర్ పార్టీకి చెందిన బ్లెయిర్, కామెరూన్ కాలంలో కొనసాగించారు. నిజానికి లేబర్ పార్టీ స్వరూపాన్ని మార్చివేసి 'న్యూ లేబర్' ను సృష్టించడమే తను సాధించిన గొప్ప విజయం అని థాచర్ గర్వంగా చెప్పుకున్నారు. అంటే ఈ కాలంలో లేబర్ పార్టీ కార్మిక అనుకూల విధానాలకు దూరమైంది. అలాగే అమెరికాలో రొనాల్డ్ రీగన్ సాధించిన విజయం కూడా డెమొక్రటిక్ పార్టీ క్లింటన్, ఒబామా హయాంలో ప్రపంచీకరణ విధానాలు చేపట్టి పూర్తిగా తన ప్రజా పునాదిని కోల్పోవడం.

**"బ్రిటన్‌లో థాచర్ తరువాత వచ్చిన లేబర్ పార్టీ కూడా ఆమెలాగే కార్మిక హక్కులపై దాడికి దిగింది. దాంతో కార్మిక ప్రజలు ఏ పార్టీ వచ్చినా తమకు ఒరిగేదేమీ లేదన్న అభిప్రాయంతో క్రమంగా ఎన్నికల్లో పాల్గొనడం తగ్గించారు. కానీ బ్రెగ్జిట్ వంటి ఏక ఎజెండాపై ప్రజాభిప్రాయం కోరే సరికి వారు తమ అభిప్రాయం చెప్పడానికి పెద్ద ఎత్తున ముందుకు వచ్చి బ్రెగ్జిట్‌కు అనుకూలంగా ఓటు వేశారు."**



విదేశీయుల పట్ల, శరణార్థుల పట్ల ద్వేషాన్ని పెంచి పోషించి అనేక దేశాల్లో మితవాద పార్టీలు బలపడుతున్నాయి: సిరియా నుండి శరణార్థులుగా వచ్చిన వారు గ్రీసు సరిహద్దుల్లో సహాయం కోసం ఎదురు చూస్తున్న దృశ్యం

బ్రెగ్జిట్ అనే ఏక సమస్యమీద ప్రజాభిప్రాయం కోరి ఉండాల్సింది కాదు అని చాలామంది లిబరల్ మేధావులు వ్యాసాల మీద వ్యాసాలు రాస్తున్నారు. వారి ఉద్దేశంలో నాలుగేళ్లకో, అయిదేళ్లకో ఒకసారి ఒకే ప్యాకేజీ మీద ఎన్నికలు జరగాలి. ఎన్నికైన ప్రభుత్వం ప్రజాభిప్రాయంతో నిమిత్తం లేకుండా తన ఇష్టం వచ్చినట్లు చేసుకుపోతుంది. బ్రిటన్‌లో థాచర్ తరువాత వచ్చిన లేబర్ పార్టీ కూడా థాచర్ మాదిరిగానే నయా–ఉదారవాద విధానాలు అమలు చేశాయి. కార్మికవర్గం హక్కులపై దాడికి దిగాయి. దాంతో కార్మిక ప్రజలు ఏ పార్టీ వచ్చినా తమకు ఒరిగేదేమీ లేదన్న అభిప్రాయంతో క్రమంగా ఎన్నికల్లో పాల్గొనడం తగ్గించారు. కానీ బ్రెగ్జిట్ వంటి ఏక ఎజెండాపై ప్రజాభిప్రాయం కోరే సరికి వారు తమ అభిప్రాయం చెప్పడానికి పెద్ద ఎత్తున ముందుకు వచ్చి బ్రెగ్జిట్‌కు అనుకూలంగా ఓటు వేశారు.

> “ ఐరోపాలోనూ, అమెరికాలోనూ కార్మిక వర్గం పరాయిప్రజలను ద్వేషించే మితవాదంవైపు మొగ్గినట్లు చెబుతున్నారు. అమెరికాలోనూ కార్మికవర్గ జనాకర్షణ వాదం ట్రంప్‌ను సమర్థిస్తే, బ్రిటన్‌లో అది బ్రెగ్జిట్‌ను సమర్థిం చింది. ఇదే మనకు ప్రపంచీకరణ యొక్క ఆర్థిక అంశాన్ని, సాంస్కృతిక అంశంతో విడదీసి చూడాల్సిన అవసరాన్ని గుర్తింపజేస్తుంది. ”

అయితే బ్రిటన్ వామపక్షం మాత్రం బ్రెగ్జిట్‌ను వ్యతిరేకించింది. యుకె ఇండిపెండెంట్ పార్టీ వంటి పరాయి దేశస్తులను ద్వేషించే పార్టీ బ్రెగ్జిట్‌కు అనుకూలంగా ప్రచారం చేయడంతో వామపక్షం దీన్ని వ్యతిరేకించి ఉంటుంది. లండన్ నగరం ఒక్కటే బ్రహ్మాండంగా అభివృద్ధి సాధించడం వల్ల ఇంగ్లండ్‌లోని ఇతర ప్రాంతాల ప్రజలు అసంతృప్తి చెందడం కూడా బ్రెగ్జిట్ అనుకూల ఓటింగు మీద ఉండి ఉండవచ్చు. అమెరికాలో కూడా మెట్రోపాలిటన్ నగరాలపై లోతట్టు ప్రాంత ప్రజలకు ఇటువంటి అసంతృప్తే మనం చూస్తాం.



విద్వేషాలు పెంచి పోషిస్తున్న మితవాద పాపులిస్టు రాజకీయ వేత్తలు ట్రంప్(అమెరికా) లి పెన్ (ఫ్రాన్స్), మోడీ (భారత్)

రెండవ ప్రపంచ యుద్ధం తరువాత యూరోపియన్ కార్మిక వర్గానికి ఆరోగ్యం, విద్య, వృద్ధాప్యంలో పెన్షన్లు, నిరుద్యోగ భృతి వంటి అనేక సంక్షేమ కార్యక్రమాలు ఏర్పాటు చేయబడ్డాయి. ఇవన్నీ జాతీయ స్థాయిలో జరిగాయి. మరి ఈ దేశాలన్నీ కలిసి యూరో జోన్ ఏర్పడితే తమ సంక్షేమం ఏమవుతుందోనని వారు భయపడ్డారు. అనుకున్నంతా జరిగింది. ‘సూపర్ నేషన్”గా మారిన ఇయులో కార్మిక సంక్షేమానికి కోతపడింది. నిజానికి అప్పటికే బాగా నడుస్తున్న యూరోపియన్ ఉమ్మడి మార్కెట్‌ను ఇయుగా మార్చాల్సిన అవసరం ఏమొచ్చింది? అంటే చాలామంది ఇయు సమర్థకుల వద్ద సరైన సమాధానం లేదు. వాస్తవానికి ఇయు అనేది బాంకర్లు, కార్పొరేట్ పెత్తందార్ల ప్రయోజనాల కోసం వారు కుట్రపూరితంగా రూపొందించి, అమలుచేసిన ప్రణాళిక.

యూరోప్‌లోనూ, పశ్చిమ దేశాల్లోనూ వామపక్షాలు ప్రపంచీకరణపై పెద్ద ఎత్తున దాడి చేయలేకపోవడానికి కారణం ఏమిటి? ప్రపంచీకరణ మీద దాడిచేస్తే దానికి ప్రత్యామ్నాయంగా ఆయా దేశాల్లో మితవాదం బలపడుతుందని వారు భయపడుతున్నారు. దీనిపై ఐరోపా వామపక్ష వర్గాల కథనాలు ఇలా ఉన్నాయ: “ఐరోపాలో జరిగిన రెండు ప్రపంచ యుద్ధాల్లో జాతీయవాదం ప్రాతిపదికపై దేశాలు ఒకదానితో ఒకటి వినాశనకర యుద్ధానికి తలపడ్డాయి. జాతీయవాద భావాల ఆధారంగా ఆ దేశాల్లో లక్షలాది మంది మైనారిటీలను ఊచకోతకోసి చంపారు. ఈ వేర్పాటువాద భావాలు పోవాలంటే ఉమ్మడి యూనియన్‌గా ఉండడమే మార్గం.” ఈ ఉదాత్త భావాలు నిజమేగాని ఇయు ఏర్పాటు వెనుక ఆర్థిక ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకోకపోవడం పశ్చిమ దేశాలు వామపక్షాలు ఎదుర్కొంటున్న సందిగ్ధతకు కారణం.


అందువల్ల ప్రపంచీకరణ వెనుకనున్న రెండు అంశాలను విడదీసి చూడాలి. ఒకటి ఆర్థిక కారణం, రెండోది రాజకీయ–సాంస్కృతిక కారణం. ఈ రెంటినీ వేరుగా చూడాలనడం, చూడ్డం రెండూ సంక్లిష్టమైన విషయాలే. ఎందుకంటే ఇలా వేరుగా చూడ్డం సరైందేనా అన్న వాదన వస్తుంది. కానీ ఇటీవల ఐరోపాలో తలెత్తిన శరణార్థులు, వలసల సమస్యపై వామపక్షవాదుల వాదనలు చూడండి. స్లావొజ్ జిజాక్ ఐరోపా వామపక్ష మేధావుల్లో ఒకడు. మూడేళ్ల క్రితం లండన్ రివ్యూ ఆఫ్ బుక్స్ మ్యాగజైన్‌లో ఒక వ్యాసం రాశాడు. అందులో పశ్చిమాసియాలో పశ్చిమ దేశాల సైనిక దుశ్చర్యల వల్లనే శరణార్థుల సమస్య తలెత్తిందని సరిగ్గానే రాశాడు. అందువల్ల శరణార్థులను ఐరోపా ఆహ్వానించి, అక్కున చేర్చుకుని ఉదారంగా ఆశ్రయమివ్వాలని సూచించాడు. అదే సమయంలో ఆయన ఇలా పేర్కొన్నాడు: “కానీ వచ్చిన వాళ్లు మన పశ్చిమ దేశాల జీవన విధానాన్ని అనుసరించి జీవించాలి. ఐరోపా ఆశ్రయం కోసం వారు ఈ మూల్యం చెల్లించక తప్పదు. విదేశీ ఛాందసవాదులను, అదే సమయంలో మన దేశాల్లోని జాత్యాహంకారులను అణచివేసేందుకుగాను ఆశ్రయం ఇచ్చే ప్రజలకు మన నిబంధనలు చెప్పాలి, నిరంకుశంగా అమలుజరపాలి.” పశ్చిమ దేశాల జీవన విధానాన్ని నిరంకుశంగా రుద్దితే అది శరణార్థి సమస్యకు పరిష్కారం కాకపోగా ఉగ్రవాదాన్ని మరింత పెంచుతుంది. నిజానికి పశ్చిమ దేశాల జీవన విధానం అనే ప్రతిపాదనే తప్పు. ఇది జిజెక్ వంటి వారి సంకుచితత్వానికి అద్దం పడుతుంది. మితవాద జాతీయవాదంలోని ఏ సంకుచితత్వాన్నయితే ఐరోపా వామపక్షాలు వ్యతిరేకిస్తున్నాయో శరణార్థుల విషయంలో వారు అటువంటి సంకుచితత్వానికి లోనవుతున్నారు. వాస్తవానికి ఈ సమస్యకు లౌకికతత్వం, ఉదారవాద హక్కుల పరిరక్షణ సరైన పరిష్కారం అవుతుంది.

ఐరోపాలోనూ, అమెరికాలోనూ కార్మిక వర్గం పరాయిప్రజలను ద్వేషించే మితవాదంవైపు మొగ్గినట్లు చెబుతున్నారు. అమెరికాలోనూ కార్మికవర్గ జనాకర్షకవాదం

ట్రంప్‌ను సమర్థిస్తే, బ్రిటన్‌లో అది బ్రెగ్జిట్‌ను సమర్థించింది. ఇదే మనకు ప్రపంచీకరణ యొక్క ఆర్థిక అంశాన్ని, సాంస్కృతిక అంశంతో విడదీసి చూడాల్సిన అవసరాన్ని గుర్తింపజేస్తుంది. ట్రంప్ ప్రతిపాదించిన పరాయిదేశస్తుల పట్ల ద్వేషం, జాతి వివక్ష, స్త్రీ ద్వేషం... వంటి వాటి వల్లనే తెల్లజాతి కార్మికులు ఆయనకు పెద్ద ఎత్తున ఓట్లు వేశారని లిబరల్ మేధావులు రాస్తున్నదంతా తప్పు. నిజానికి ట్రంప్‌కు ఓటు వేసిన వారిలో ఇటువంటి వారు లేకపోలేదు. కానీ చాలామంది ఆయన జాతి వివక్షనూ, స్త్రీ ద్వేషాన్నీ ఇష్టపడలేదు. ట్రంప్ గెలిచిన తరువాత వచ్చిన విశ్లేషణల్లో అనేకం చెప్పిందేమంటే ట్రంప్ మంచివాడని ఆయనకు ఓట్లు వేసిన వాళ్లు అనుకోలేదు. అయినా ఓట్లు వేశారు. ఎందుకంటే ఆయన ప్రత్యర్థి హిల్లరీ క్లింటన్‌కు ఓట్లు వేయడం ఇష్టం లేక. హిల్లరీ స్థానంలో శాండర్స్ ఉండి ఉంటే ట్రంప్ ఖచ్చితంగా ఓడిపోయేవాడని చాలామంది రాశారు. ఇక్కడనే మనకు కార్మికవర్గం ట్రంప్‌కు ఎందుకు మద్దతిచ్చింది అనే దానికి సరైన సమాధానం దొరుకుతుంది. లిబరల్ మేధావులు ఈ సమాధానంతో ఏకీభవించరు అది వేరే విషయం.

తెలిసిగానీ, తెలియక గానీ కార్మికవర్గం పరాయిదేశస్తులను ద్వేషించే, జాతివివక్షను అనుసరించే శక్తులను ఎందుకు బలపరుస్తోంది? కార్మికవర్గాన్ని నిందించాల్సిన అవసరం లేదా? కానీ దానికి ముందు ఒక విషయం మనం ఆలోచించాలి. కార్మికవర్గానికి ఈ ధోరణులు, ఆలోచనలు, సమాచారం ఎక్కడినుండి వస్తాయి? ఐరోపాలో టాబ్లాయిడ్ పత్రికలు, రేడియో, టివి చర్చలు, ఎన్నికల సమయంలో నాయకుల ప్రసంగాల నుండి. ఈ మీడియా అంతా విదేశీయుల పట్ల నిత్యం ద్వేషాన్ని రెచ్చగొడుతోంది. ఎన్నికల్లో నాయకులు ట్రంప్ ఒక్కడే కాదు దాదాపు రాజకీయ నాయకులంతా పోటీలు పడి ఈ విద్వేషాలను రెచ్చగొట్టారు. బ్రిటన్‌లో మితవాద బ్రెగ్జిట్ అనుకూలురుతో పోటీపడి డేవిడ్ కామెరూన్ విద్వేష ప్రచారం గావించాడు. అమెరికాలో 2008 ఎన్నికల్లో డెమోక్రాటిక్ ఒబామా మితవాత మెక్ కెయిన్ కన్నా ఎక్కువగా విదేశీ వ్యతిరేక ప్రచారం గావించాడు. "ప్రజలు తమకు దొరికిన నాయకులనే (లేక మీడియానే) ఎన్నుకుంటారు" అన్న నానుడి ఉంది కదా! కానీ ఈ విషయంలో పశ్చిమ దేశాల్లో నిజమైన వామపక్షాలు మాత్రమే వ్యక్తులను కాకుండా ఇటువంటి విద్వేషాలు రెచ్చగొట్టే సంస్థలను

"రోజువారీ జీవనం గడుపుకోడానికే ఆపసోపాలు పడే సాధారణ కార్మికునికి.. విదేశీయుల రాక వల్ల తన నోటి దగ్గర కూడు పోతుందని మీడియా, రాజకీయ నాయకులు చేసే ప్రచారాన్ని నమ్మడం తేలిక గానీ వారి వల్ల తమ దేశ ఆర్థిక వ్యవస్థ బాగుపడుతుందనే విశ్లేషణ చేసుకోవడం కష్టం. నయా-ఉదారవాద పెట్టుబడిదారీ వ్యవస్థ కార్మికుల జీవితాలపై చూపుతున్న ప్రభావాలు, ఈ ప్రభావాలకు ధీటైన సమాధానం చెప్పడంలో లిబరల్ బూర్జువా వైఫల్యం అర్థం చేసుకుంటే ఈ సమస్యను మనం సరిగ్గా అర్థం చేసుకోగలుగుతాం."



ప్రజానుకూల విధానాలతో మితవాదాన్ని ఎదిరిస్తున్న రాజకీయ నాయకులు
శాండర్స్ (అమెరికా), కార్బిన్ (బ్రిటన్)

గురించి మాట్లాడాయి. ఒకవైపు ప్రజాస్వామ్యాన్ని నమ్ముతూ దానికి పట్టుగొమ్మలైన ప్రజలను ద్వేషించడం సరైంది కాదు. కానీ చాలామంది లిబరల్ మేధావులు ఈ పనే చేస్తున్నారు. నీవు ప్రజలను నమ్మకుండా ప్రజాస్వామ్యాన్ని నమ్మలేవు. ప్రజలను నమ్మకపోవడం అంటే వ్యక్తులను నమ్మడమే అవుతుంది. అప్పుడు నీకు ప్రజాస్వామ్యం ఎందుకు మంచి నమ్మకస్తుడైన రాజు పరిపాలన ఉంటే సరిపోతుంది కదా! కానీ ప్రజాస్వామ్యం ఎలా పనిచేస్తుంది అనేది ప్రజలు ఏమి తెలుసుకుంటున్నారు అనే దాని మీద ఆధారపడి ఉంటుంది. వారేం చేస్తున్నారు, వారు ఎలా ఓట్లు వేస్తున్నారు, వారు ఎలా నివసిస్తున్నారు అన్న విషయాలను తెలుసుకుంటేనే మనకు ప్రజాస్వామ్యం ఎలా పనిచేస్తున్నదో తెలుస్తుంది. ఇంటర్‌నెట్ యుగంలో ప్రజలకు సమాచారం అందుబాటులో ఉంది కదా! వారు అన్ని విషయాలు తెలుసుకుని ఓటు వేయవచ్చు కదా అని అడగవచ్చు. నిజమే కానీ, రోజుకు 8 గంటలు, ఒక్కోసారి అంతకంటే ఎక్కువ పనిచేసే కార్మికులకు సమాచారం సేకరించడానికీ, దొరికిన సమాచారం విశ్లేషించుకోడానికీ సమయం ఉండదు. అందువల్ల వారు ప్రధానంగా ఆధారపడేది టాబ్లాయిడ్లు, మీడియా చర్చల మీదనే. ఆఫ్ఘనిస్థాన్ మీద అమెరికా దురాక్రమణను అమెరికాలో ఒక మేధావి సమర్థిస్తూ, "ట్విన్ టవర్స్ మీద దాడి జరిగిన వెంటనే అమెరికా ఏదో ఒకటి చేసి ఉండాల్సింది" అని రాశాడు. ఇప్పుడు ట్రంప్ విద్వేష రాజకీయాలకు ఓటు వేసిన అమెరికా తెల్లజాతి పురుషులకన్నా ఈ మేధావిని విమర్శించడం సరైంది. ఎందుకంటే సమయం లేదు. కానీ ఈ మేధావి రోజుకు నాలుగు గంటలు పనిచేస్తాడు. ఏడాదికి అయిదు మాసాలు శెలవులు తీసుకుంటాడు. మధ్య ప్రాచ్యంలో అమెరికా చేసిన దురాగతాల గురించీ, కాబూల్‌పై క్లస్టర్ బాంబులతో సృష్టించిన విధ్వంసం గురించీ ఈయన తెలుసుకోలేడా!

రోజువారీ జీవనం గడుపుకోడానికే ఆపసోపాలు పడే సాధారణ కార్మికునికి.. విదేశీయుల రాక వల్ల తన నోటి దగ్గర కూడు పోతుందని మీడియా, రాజకీయ నాయకులు చేసే ప్రచారాన్ని నమ్మడం తేలిక గానీ వారి వల్ల తమ దేశ ఆర్థిక వ్యవస్థ బాగుపడుతుందనే విశ్లేషణ చేసుకోవడం కష్టం. నయా-ఉదారవాద పెట్టుబడిదారీ వ్యవస్థ కార్మికుల జీవితాలపై చూపుతున్న ప్రభావం, ఈ ప్రభావాలకు ధీటైన సమాధానం చెప్పడంలో లిబరల్ బూర్జువాల వైఫల్యం అర్థం చేసుకుంటే ఈ సమస్యను మనం సరిగ్గా అర్థం చేసుకోగలుగుతాం. బ్రెగ్జిట్‌నే తీసుకుందాం. జాతి రాజ్యాలు తమకు కల్పించిన సంక్షేమ సదుపాయాలు సూపర్ జాతి రాజ్యం (ఇయు) హయాంలో ఒక్కొటే కోల్పోతూ ఉంటే

> **"లిబరల్స్ ఎప్పుడూ నియంతృత్వాన్ని చూసి భయపడరు. వారికి ప్రజలంటే, ప్రజా వెల్లువలంటే భయం. వారు ప్రజాపోరాటాన్ని రాజకీయ రంగం నుండి తప్పించడానికే ప్రయత్నిస్తారు. నేటి సమాజంలో మార్పుల పట్ల వారు కావాలని గుడ్డితనం ప్రదర్శిస్తారు. పెట్టుబడిని నియంత్రించాల్సిన అవసరాన్ని గుర్తించ నిరాకరిస్తారు. ఫలితంగా పెట్టుబడి దాడితో అసంతృప్తి చెందిన కార్మికులకు తమకు మంచి భవిష్యత్తు ఇస్తామని పెద్దపెద్ద మాటలు చెప్పే జాతీయవాదుల చెంతకు చేరడం మినహా మరో మార్గం కనిపించదు."**

కార్మిక వర్గం సహజంగానే సూపర్ రాజ్యం పట్ల అనుమానాస్పదంగా చూస్తుంది. కానీ వారు ఈ సరైన అనుమానాల నుండి వలస ప్రజల పట్ల, శరణార్థుల పట్ల తప్పుడు నిర్ధారణలు తీసుకున్నారు. వారు తమ జీవనాన్ని దెబ్బతీస్తున్నారన్న నిర్ధారణలు తీసుకున్నారు.

వాతావరణ కాలుష్యం సమస్యను తీసుకోండి. ట్రంప్, ఇతర మితవాద జనాకర్షణవాదులు అసలు వాతావరణ కాలుష్యం వల్ల ప్రమాదం వస్తోందన్న విషయాన్నే తిరస్కరిస్తున్నారు. ప్రపంచ దేశాల శాస్త్రవేత్తలు, వారి పరిశోధనలూ, అనేక నిరూపణలూ ఈ ప్రమాదం గురించి చెబుతున్నా నమ్మకపోవడం అంటే వీరంతా పూర్తి నిర్హేతుకంగా ఉన్నారన్న మాటే. మితవాదుల నిర్హేతుకతను లిబరల్స్ సరిగ్గానే విమర్శిస్తారు. అదే సమయంలో వాతావరణ కాలుష్య నివారణ సమస్య వచ్చేసరికి లిబరల్స్ కూడా అంతే నిర్హేతుకంగా ప్రవర్తిస్తారు. ఉదాహరణకు, పెట్టుబడిదారీ రాజకీయ ఆర్థిక వ్యవస్థ మౌలిక అంశాలను మార్చకుండా వాతావరణ కాలుష్య ప్రమాదాన్ని నివారించలేమన్నది నేడు అందరూ చెబుతున్న విషయం. ఈ అంశంపైనే కోపెన్‌హాగన్ సమావేశం నుండి బొలీవియా అధ్యక్షుడు ఇవో మొరెల్స్ వాకౌట్ చేసి వెళ్ళిపోయాడు. సమావేశంలో ఎవ్వరూ కూడా వాతావరణ కాలుష్య సమస్యకు పెట్టుబడిదారీ వ్యవస్థ కేంద్ర బిందువుగా ఉన్నదన్న విషయాన్ని బహిరంగంగా అంగీకరించడం లేదు అని ఆయన పేర్కొన్నాడు. ఈ విషయంలో లిబరల్ బూర్జువా మేధావులు కూడా పెట్టుబడిదారీ వ్యవస్థ కేంద్ర స్థానాన్ని అంగీకరించరు. అందువల్లనే వాతావరణ సమస్య విషయంలో మితవాదులు ఎంత నిర్హేతుకంగా ఉన్నారో లిబరల్స్ కూడా అంతే నిర్హేతుకంగా ఉన్నారు. ఈ నిర్హేతుకతనుండి బయటపడినప్పుడు మాత్రమే లిబరల్స్ కూడా వామపక్షవాదుల మాదిరిగానే వాతావరణానికి నిజమైన శత్రువు ఎవరో గుర్తించగలుగుతారు.

మొత్తం మీద చూసినప్పుడు జనాకర్షణవాదాన్ని వ్యతిరేకిస్తున్న ఉదారవాదం పరోక్షంగా ఆ జనాకర్షణవాదంలో సంక్షోభానికి కారణమవుతోంది. అమెరికాలో ట్రంప్‌నూ, బ్రిటన్‌లో బ్రెగ్జిట్‌నూ వ్యతిరేకిస్తున్న లిబరల్ బూర్జువావాదం వాటికి మారుగా అమెరికాలో ఒబామా-క్లింటన్ పాలననూ, బ్రిటన్‌లో బ్లెయిరయిట్ లేబర్ ప్రభుత్వాలనూ కోరుకుంటోందే గాని ఇంకో ప్రత్యామ్నాయం రావడానికి ఇష్టపడ్డం లేదు. అలాంటిదేదైనా వస్తే దాన్ని అనవసరమైన జనాకర్షణవాదం అని ధ్వజమెత్తుతోంది. చివరికి కాస్త సోషల్ డెమొక్రటిక్ లక్ష్యాలు కలిగిన శాండర్స్, కార్బిన్‌ల వాదనలను కూడా అది తట్టుకోలేకపోతోంది. ఇప్పుడు కూడా అమెరికా మధ్యంతర ఎన్నికల్లో గతంలో శాండర్స్‌కు మద్దతుగా నిలబడిన యువ డెమొక్రాట్లను సంప్రదాయ డెమొక్రాట్లు ముందుకు రాకుండా అడ్డుకుంటున్నారు. ఇప్పటికైనా అక్కడక్కడా ఎవరైనా ఇటువంటి వారు గెలిచారు అంటే అది సంప్రదాయ డెమొక్రాటిక్ పార్టీ నాయకుల హృదయపూర్వక మద్దతు వల్ల కాదు, కార్మిక ప్రజల్లో ప్రభుత్వం పట్ల ఉన్న వ్యతిరేకత వల్లనేనన్న విషయం మనం గుర్తుంచుకోవాలి.

అందువల్ల లిబరల్స్ ఎప్పుడూ కూడా నియంతృత్వాన్ని చూసి భయపడరు. వారికి ప్రజలంటే, ప్రజా వెల్లువలంటే భయం. గతంలో ఫ్రెంచ్ విప్లవంలోనూ, ఇంగ్లండ్‌లో క్రామ్‌వెల్ కాలం నుండీ అదే జరిగింది. లిబరల్స్ ఎప్పుడూ కూడా ప్రజాపోరాటాన్ని రాజకీయ రంగం నుండి తప్పించడానికే ప్రయత్నించారు. వర్తమాన సమాజంలో జరుగుతున్న మార్పుల పట్ల వారు కావాలని, గుడ్డితనం ప్రదర్శిస్తారు. పెట్టుబడిని నియంత్రించాల్సిన అవసరాన్ని గుర్తించ నిరాకరిస్తారు. ఫలితంగా పెట్టుబడి యొక్క దాడితో అసంతృప్తి చెందిన కార్మిక వర్గానికి తమకు మంచి భవిష్యత్తు ఇస్తామని పెద్దపెద్ద మాటలు చెప్పే జాతీయవాదుల చెంతకు చేరడం మినహా మరో మార్గం కనిపించదు. కానీ ఈ వికృత క్రీడలో తాము ఓడిపోయామని తెలుసుకున్నప్పుడు కార్మిక ప్రజానీకం మొత్తాన్ని తలకిందులు చేయడానికి ప్రయత్నిస్తుంది. ఆ క్రమంలో అది పూర్తి ఫాసిస్టు తరహా జాతీయ వాదాన్ని ఓట్లు వేసి గెలిపిస్తుంది.

ఈ మొత్తం సారాంశం ఏమంటే: మితవాద జనాకర్షణవాదం అనేది కార్మికుల వేతనాలు దశాబ్దాల కొద్దీ స్తంభించడం వల్ల వచ్చిన నిస్పృహ నుండి, నిరుద్యోగ సమస్య నుండీ మాత్రమే అభివృద్ధి చెందదు. దానర్థం ఈ కారణాలను నిరాకరించడం కాదు. ఇవి ప్రధాన కారణాలన్న దాంట్లో సందేహం లేదు. కానీ మనందరం గుర్తించని మరో విషయం ఏమంటే, ప్రస్తుత నయా-ఉదారవాద ఫైనాన్స్ ప్రపంచీకరణ దశలో పెట్టుబడి యొక్క దుందుడుకుతనాన్ని పూర్తిగా అర్థం చేసుకుని, విమర్శించి, తదుపరి రాజకీయంగా వ్యతిరేకించే రాజకీయ సంస్కృతి లేకపోవడం వల్ల మితవాద జనాకర్షణవాదం పెంపొందుతుంది. "మనం ప్రపంచ అంతాన్ని చూడగలం గానీ పెట్టుబడిదారీ వ్యవస్థ అంతాన్ని చూడలేకపోతున్నాం" అని ఫ్రెడరిక్ జేమ్సన్ ఒకసారి అంటాడు. ఒకవైపు లిబరలిజం మీద ప్రధాన బాధ్యత పడుతూ, మరోవైపు కార్మిక ప్రజలు పెట్టుబడిదారీ వ్యవస్థ కింద నలిగిపోతున్న పూర్వరంగంలో మనం ఈనాడు మితవాద జనాకర్షకవాదం పెరుగుదల ప్రమాదాన్ని చూస్తున్నాం.

పెట్టుబడిదారీ వ్యవస్థపై మౌలిక విమర్శ చేయడాన్ని రాజకీయ సంస్కృతికి దూరంగా ఉంచడంలో లిబరలిజం చాలా సమర్థంగా పనిచేస్తున్నది. దీన్నే కారల్ మార్క్స్ లిబరలిజపు సైద్ధాంతిక విజయంగా పేర్కొన్నాడు. మార్క్స్ మాత్రమే కాదు, మహాత్మా గాంధీ కూడా లిబరలిజపు ఈ సైద్ధాంతిక పాత్రను గమనించాడు. అందువల్ల చివరిగా తెలుసుకోవలసిందేమంటే.. ఆర్థిక విషయాలను సాంస్కృతిక విషయాలతో వేరుచేయడం కాకుండా పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థలో ఆర్థిక నిర్ణాయకాలు తుదకు మానవ సమాజంలోని సైద్ధాంతిక, సాంస్కృతిక అంశాలపై ఆధారపడి పనిచేస్తాయన్న విషయం గుర్తించాలి. ఈ విషయాన్ని చెప్పిన మొదటి వ్యక్తి కారల్ మార్క్స్.

**(తెలుగు సేత: ఎన్. వెంకట్రావు)**

## జాతీయోద్యమాన్ని ప్రజా ఉద్యమంగా మార్చిన

# జలియన్‌వాలా బాగ్

కె ఎల్ టుటేజా



**1919** ఏప్రిల్ 12 వ తేదీన ప్రజలు బహిరంగంగా గుమిగూడకూడదని అధికారికంగా ప్రకటన వచ్చింది. అందుకు నిరసనగా అమృతసర్‌లోని జలియన్‌వాలాబాగ్‌లో బహిరంగ ప్రదేశానికి వచ్చిన ప్రజలపై జరిగిన నరమేధానికి పంజాబ్ ప్రజలు హతాశులయ్యారు. ఆ ప్రకంపనలు దేశాన్ని మొత్తంగా కుదిపేశాయి. ఆ బహిరంగ సభలో ఇరవై వేలకు పైగా ప్రజలు పాల్గన్నారు. అందులో చుట్టుపక్కల గ్రామాల నుండి వైశాఖి ఉత్సవంలో పాల్గనడానికి అమఅత్‌సర్‌కి వచ్చిన చాలామంది ఉన్నారు. బ్రిగేడియర్ జనరల్ రెజినాల్డ్ డయ్యర్ తన సైన్యంతో సభ జరుగుతున్న జలియన్ వాలాబాగ్‌కు వెళ్లాడు. అక్కడికి చేరిన వెనువెంటనే కాల్పులు జరిపేందుకు ఆదేశాలు ఇచ్చాడు. ఏ విధమైన ముందస్తు హెచ్చరికలు చేయలేదు. గుమిగూడిన ప్రజలను చెదిరిపొమ్మని హెచ్చరిక చేయలేదు.

పది నిముషాల పాటు 1650 రౌండ్ల కాల్పులు జరిగాయి. వెంటతెచ్చుకున్న మందుగుండు పూర్తి అయిపోయిన తరువాత మాత్రమే కాల్పులు నిలుపుదలకు ఆదేశాలు ఇచ్చాడు. ప్రజలు ఎక్కువమంది గుంపుగా ఉన్నచోటే కాల్పులు జరపమని ఆదేశాలు ఇచ్చాడు. అధికారిక లెక్కల ప్రకారం 379 మంది చనిపోగా 1200 మందికి గాయాలయ్యాయి. నిజానికి అధికారిక లెక్కలు వాస్తవాలను తక్కువ చేసి చూపాయి. గాయాల బారిన పడినవారు ఇంకా చాల ఎక్కువమంది ఉన్నారు. ఈ నరమేధం భారతదేశంలోనే కాదు, ఇంగ్లాండ్ నుండి కూడా విమర్శలను ఎదుర్కొంది. ఉదాహరణకి ఆ తరువాతి కాలంలో ఇంగ్లాండ్ ప్రధానమంత్రి అయిన చర్చిల్ దీనిని "కుటిలత్వంతో కూడిన పైశాచిక చర్యగా" గా అభివర్ణించారు. బ్రిటిష్ ప్రభుత్వపాలన భారతదేశంలో న్యాయబద్ధంగా కొనసాగుతున్నదని నమ్మిన వారు కూడా విభ్రాంతికి గురయ్యారని, ఆందోళన చెందారని ఈ ప్రతిస్పందన తెలియ చేస్తున్నది.

భారతదేశం లోని చాలామంది దీనిని చరిత్రలో దేనితోనూ సరిపోల్చలేని అమానవీయ ఘాతుక చర్యగా భావించారు. ఈ సంఘటన భారతదేశ ప్రజలలో మిగిల్చిన వేదన మహాత్మా గాంధీ ఈ కింది మాటలలో ప్రతిబింబిస్తుంది: "మనం డయ్యర్‌ని శిక్షించ దలుచుకోలేదు. మనకు ప్రతీకార కాంక్ష లేదు. మనం డయ్యర్‌ని తయారు చేసిన వ్యవస్థను మార్చాలనుకుంటున్నాము." ఆ తరువాతి సంఘటనలు సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా జరిగిన పోరాటం దిశనే మార్చేసాయి. భారతదేశంలో బ్రిటిష్ పరిపాలనను సవాలు చేసిన శక్తుల బలాన్ని మరింతగా పెంచాయి.

### చారిత్రిక నేపథ్యం

ఇక్కడ నా లక్ష్యం ఈ నరమేధానికి ఏ ఒక్క వ్యక్తినో బాధ్యుడిని చేయడం కాదు, లేదా కాల్పులను ఖండించి చేతులు దులుపుకోవడం కాదు. ఆ సంఘటనకు దారితీసిన ఆ నాటి సామాజిక పరిస్థితులను అర్థం చేసుకునే ప్రయత్నం చేయడం. పంజాబ్ చరిత్రలో అక్కడి సమాజంలో, రాజకీయాలలో జరిగిన ఒక అంశంగా ఈ సంఘటనను చూసినప్పుడు అందులో ఇమిడి ఉన్న సమస్యలను తెలుసుకోవడం, భారతదేశ జాతీయ స్థాయిలో సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటాన్ని అధ్యయనం చేయడం ఈ వ్యాసం ముఖ్య ఉద్దేశం.

ఆధునిక భారతదేశ చరిత్రలో 1919 సంవత్సరం ఒక మైలురాయి. ఆ ఏడు మహాత్మా గాంధీ భారతదేశ రాజకీయాలలో ప్రముఖ స్థానాన్ని ఆక్రమించారు. ఆయన నాయకత్వంలో భారత జాతీయోద్యమం పెను మార్పులను సంతరించుకుంది. 1919 ఆగస్టు 6వ తేదీ ఆయన నాయకత్వంలో సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా రౌలట్ చట్టానికి వ్యతిరేకంగా సత్యాగ్రహం జరిగింది. ఇది భారతదేశంలోని వివిధ ప్రాంతాలకు పాకింది గానీ పంజాబ్‌లో ఎక్కువగా కేంద్రీకఅతం అయింది. ఈ ఆందోళన సందర్భంగానే ఈ మూకుమ్మడి నరమేధం జరిగింది. భారతదేశంలో "విప్లవ నేరాలు" జరగడంపై విచారణ జరిపి, వాటిని అణచివేయడానికి తగిన సిఫారసులు చేయమని ప్రభుత్వం సిడ్నీ రౌలట్ అనే న్యాయవాదిని నియమించింది. ఆ కమిటీ సిఫారసుల ఆధారంగానే ప్రభుత్వం ఇంపీరియలిస్ట్ లెజిస్లేటివ్ కౌన్సిల్‌లో 'దేశద్రోహం', 'విప్లవ కార్యకలాపాలు' అణచివేయడానికి రెండు బిల్లులను ప్రవేశపెట్టింది. భారత ప్రతినిధుల నుండి తీవ్రమైన వ్యతిరేకత ఎదురైనా ఇంపీరియలిస్ట్ లెజిస్లేటివ్ కౌన్సిల్ బిల్లులను పాస్ చేసింది. మొదటి బిల్లు పేరు 'అరాచక , విప్లవ నేరాల చట్టం'. సామాన్య ప్రజల స్వేచ్ఛను మట్టుపెట్టడానికే ఈ చట్టం చేయబడింది. ఇది నిరంకుశ చట్టం. ఎందుకంటే ఈ చట్టం పోలీసులకు ఏ భారతీయుడినయినా వారెంట్ లేకుండా, విచారణ లేకుండా ఖైదు చేయడానికి, అనుమానితులను నిర్బంధించడానికి అనుమతిస్తుంది. ఖైదు కాలాన్ని మరో రెండేళ్ళు

> **“1849లో ఈస్ట్ ఇండియా కంపెనీ పంజాబ్‌ను తనకంపెనీలో కలుపుకున్న తరువాత అది బ్రిటిష్ సామ్రాజ్యంలో అంతర్భాగమైంది. భారత దేశ బ్రిటిష్ సామ్రాజ్య వాయువ్య సరిహద్దులో పంజాబ్ ఉన్నది. అందువలన బ్రిటిష్ సైన్యం పంజాబ్‌ని తన సైనిక స్థావరంగా మలుచుకుంది. మొదటి ప్రపంచ యుద్ధానికి ముందు బ్రిటిష్ సైన్యంలో మూడొంతుల మంది పంజాబ్ రాష్ట్రానికి చెందిన వారే. పంజాబ్ వీరత్వ సంప్రదాయం కల సమాజం. పంజాబ్‌లో సైనిక శిక్షణ పొందే కొన్ని తరగతుల నుండి ప్రత్యేకంగా సైనికులను చేర్చుకునే వారు.”**

పొడిగించ వచ్చుకూడా. పైగా ముగ్గురు హైకోర్టు న్యాయవాదులు కెమెరాలతో ఫోటోలు తీస్తుండగా నిందితుల విచారణ నిర్వహిస్తారు. దానికి అప్పీలు కూడా ఉండదు. పోలీసులకిచ్చిన ఈ అధికారాలను సామాన్య ప్రజలు వ్యతిరేకించడంలో ఆశ్చర్యం లేదు. మహాత్మా గాంధీ దీనిని 'దేశానికి చేసిన అన్యాయం' గా అభివర్ణించారు. ఎందుకంటే 'దేవుడు ప్రజలకిచ్చిన హక్కులను ప్రభుత్వం తీసేసుకుంది' అన్నారు. ఈ చట్టాన్ని గాంధీ నైతికత ఆధారంగా సవాలు చేసారు. దీనిని వ్యతిరేకించడానికి సత్యాగ్రహ సభను ఏర్పాటు చేశారు. దాని సభ్యులు ఈ చట్టానికి వ్యతిరేకంగా 'చట్ట ధిక్కారం చేయడానికి శపథం చేయవలసి ఉంటుంది. మార్చి 26వ తేదీ గాంధీ దీని పరిధి పెంచాలని నిర్ణయించారు. దేశ ప్రజలందరూ వారి వ్యతిరేకతను తెలియచేస్తూ ఒక రోజు హర్తాళ్ చేయాలని పిలుపు నిచ్చారు. నిజానికి మార్చి 30వ తేదీన హర్తాళ్ చేయాలని నిర్ణయించారు. కానీ చివరికి ఏప్రిల్ 6వ తేదికి మార్చడం జరిగింది. భారతీయులంతా 24 గంటలు ఉపవాస దీక్ష చేయాలని పిలుపు నిచ్చారు. ఇదే ఒక పెద్ద ప్రజాఉద్యమంగా తరువాతి కాలంలో మలుపు తిరిగింది. పంజాబ్ జాతీయోద్యమ ప్రధాన కేంద్రాలలో ఒకటిగా మారింది.

1849లో ఈస్ట్ ఇండియా కంపెనీ పంజాబ్‌ను తనకంపెనీలో కలుపుకున్న తరువాత అది బ్రిటిష్ సామ్రాజ్యంలో అంతర్భాగమైంది. భారత దేశ బ్రిటిష్ సామ్రాజ్య వాయువ్య సరిహద్దులో పంజాబ్ ఉన్నది. అందువలన బ్రిటిష్ సైన్యం పంజాబ్‌ని తన సైనిక స్థావరంగా మలుచుకుంది. మొదటి ప్రపంచ యుద్ధానికి ముందు బ్రిటిష్ సైన్యంలో మూడొంతుల మంది పంజాబ్ రాష్ట్రానికి చెందిన వారే. పంజాబ్‌లో సైనిక శిక్షణ పొందే కొన్ని తరగతుల నుండి ప్రత్యేకంగా సైనికులను చేర్చుకునే వారు. పంజాబ్ వీరత్వ సంప్రదాయం కల సమాజం. పంజాబ్ నుండి అత్యధికంగా సైనిక నియామకాలు చేయడం వాస్తవ పరిస్థితులపై బ్రిటిష్ వారి అవగాహనను తెలియ చేస్తుందని ఇయన్ టాల్బో అంటారు. వీరరసం గల జాతుల సిద్ధాంతం పురాణ గాథలలో జప్పించడం చేతనతోనే జరిగింది. ప్రభుత్వం గ్రామీణప్రాంతంపై పట్టు నిలుపుకోడానికి, నిరంతరంగా సైన్యం నియామకాలు జరగడానికి ఇది అవసరమని భావించింది. తమ అధికారానికి భంగం వాటిల్లే ఏ చర్య అయినా 'దేశద్రోహం చర్య' అని భావించిన బ్రిటిష్ ప్రభుత్వం అటువంటి చర్యలను సమూలంగా తుద ముట్టించాల్సిన అవసరం ఉందని అనుకుంది. వలస పాలన మొదలయిన తొలి రోజుల నుండే ఈ ప్రాంతంలో 'పంజాబ్ ఆలోచనా సిద్ధాంతం' అంటూ ఒక ప్రత్యేకమైన సిద్ధాంతం మొదలు పెట్టింది. ఈ సిదంతాన్ని నమ్మే వారు, ఆత్మ విశ్వాసం గల పాలనాధికారాన్ని ఉపయోగించడం ద్వారా, క్రమశిక్షణ ద్వారా మాత్రమే రైతులలో అభివఅద్ధి సాధించడం సాధ్యమవుతుందని నమ్మేవారు. ఆ మార్పు తేవడం పితఅస్వామ్య ఉన్నత వర్గం బాధ్యత అని గట్టిగా నమ్మేవారు. అంతేకాక బ్రిటిష్ వారిని వ్యతిరేకించే వారిపై ప్రజలు సవాలు చేస్తే వారిపై చర్యలు తీసుకోవాలని భావించేవారు. అంటే బ్రిటిష్ పాలనకు ఎదురుతిరిగితే అణచివేయాలన్న పెద్ద మౌలికాంశం ఇందులో ఇమిడి ఉంది.

ముంబై కలకత్తాలో వలే కాక పంజాబ్‌లో రాజకీయ చైతన్యం చాల ఆలస్యంగా మొదలయింది. అదీ పట్టణ ప్రాంతాలకే పరిమితమయింది. లాహోర్ కేంద్రంగా అభివఅద్ధి చెందింది. భారత దేశంలోని బ్రిటిష్ సైన్యానికి సరిహద్దు సైన్యం సరఫరాకు అవసరమైనందువలన ఉద్దేశపూర్వకంగానే పంజాబ్‌లో రాజకీయ చైతన్యం పెంపొందకుండా ఆపే ప్రయత్నాలు జరిగాయి. 1861 భారతదేశ శాసనసభ చట్టం ప్రకారం ఇతర ప్రాంతాలలో శాసన సభలు ఏర్పడ్డా పంజాబులో శాసన సభ ఏర్పడలేదు. 1897లో మాత్రమే ప్రభుత్వం శాసనసభను ఏర్పాటు చేసింది. భారతీయ శాసన సభ్యులు కూడా ఎన్నుకోబడేవారు కాదు. వారికీ ప్రశ్నించే హక్కు ఉండేది కాదు. జాతీయ నాయకత్వం, పాత్రికేయులు దీనిని తీవ్రంగా విమర్శించేవారు. పంజాబ్‌లో జాతీయోద్యమం పట్టణ కేంద్రాలలో ఉన్న మధ్య తరగతి నాయకత్వంలో జరిగేది. స్వేచ్ఛ, ఆధునికతను గురించిన వారి ఆలోచనలు పట్టణాలకు వెళ్లి వచ్చిన వారికి క్రమంగా పాకాయి. లాహోర్‌లో విద్యా సంస్థలు, గ్రంథాలయాలు వెలిశాయి. సంఘాలు, చర్చా వేదికలు ఏర్పడడం మొదలయింది. పత్రికల ప్రచురణలు పుంజుకున్నాయి. ఇవి పంజాబ్‌లోని మధ్య తరగతి ఆలోచనలను మార్చివేశాయి.

పత్రికలకు సంబంధించినంత వరకు ఆంగ్ల పత్రికల ప్రచురణ ప్రారంభించడం ఒక మూల మలుపు. 1881 ఫిబ్రవరి 2 వ తేదీ దయాల్ సింగ్ మజిథియ లాహోర్‌లో ది ట్రిబ్యూన్ పత్రికను స్థాపించారు. మొదటి సంచికలో సంపాదకీయంలో ట్రిబ్యూన్ పత్రిక స్థాపన లక్ష్యాలను రాశారు. 'పేరులో ఉన్నట్టే సామాన్య ప్రజల సమస్యలను వెలుగులోకి తేవడం దీని లక్ష్యం' అని రాసుకున్నారు. భారతదేశ ప్రజల, ముఖ్యంగా ఉత్తర భారతదేశ ప్రజల ఉద్దేశాలు బహిరంగ పరచడం, తమ పరిధిలో ఉన్నంత వరకు వారి భావాలను మలిచే ప్రయత్నం చేయడం, వారికి అవగాహన కల్పించడం ట్రిబ్యూన్ పత్రిక ముఖ్యోద్దేశాలుగా రాసుకున్నారు. కొద్ది కాలంలోనే ట్రిబ్యూన్ పత్రిక మధ్య తరగతిలో ప్రాచుర్యం పొందింది. ఉత్తర భారతదేశంలో ప్రముఖ పత్రికగా పేరు గడించింది. కొత్తగా ఏర్పడ్డ మేధావి వర్గం ఒకే రకంగా సమాజాన్ని చూడడానికి కారణం ఒకే రకమైన మేధావి వర్గం నుండి రావడం అన్నది కొంతవరకు వాస్తవమే. కానీ ఒకే రకమైన వలసపాలన అనుభవాలు కలిగి ఉండడం అంతకన్నా ప్రధానమైన కారణం. బ్రిటీషువారు విదేశీయులని, కేవలం వారి స్వప్రయోజనాల కొరకు పరిపాలిస్తున్నారని, భారతదేశ ప్రయోజనాలు సదా వెనక పట్టు పడుతున్నాయని పంజాబీ మేధావులు గుర్తించారు.

1877లో సురేంద్రనాథ్ బెనర్జి ఈ ప్రాంతానికి వచ్చినప్పుడు లాహోర్‌లో ఏర్పాటు చేసిన ఇండియన్ అసోసియేషన్ ఇక్కడి మొట్టమొదటి రాజకీయ సంఘం. దీనిలో బెంగాల్, పంజాబ్ నుండి వచ్చిన వలస వాదులు ఎక్కువ మంది సభ్యులుగా ఉండేవారు. దాయాళ్‌సింగ్ మజీతియా లాంటి కొందరు

బ్రహ్మ సమాజీకులు కూడా ఉండేవారు. 1885లో ముంబైలో జరిగిన మొదటి సర్వసభ్య సమావేశానికి ఇక్కడి నుండి ఇద్దరు ప్రతినిధులు హాజరయ్యారు – అంబాలా నుండి మురళీధర్ అనే న్యాయవాది, లాహోర్ నుండి పండిట్ శివ్ నారాయణ్ అగ్నిహొత్రి అనే బ్రహ్మ సమాజానికి చెందిన వ్యక్తి. జాలియన్ వాలాబాగ్‌కి ముందు 1893, 1900, 1909లలో లాహోర్ లో మూడు సార్లు సర్వసభ్య సమావేశాలు జరిగాయి. పంజాబులోని పట్టణ ప్రాంతాలలో కాంగ్రెస్ బలం నానాటికి పెరగడం ప్రారంభమయింది. 1907లోని వ్యవసాయోద్యమం, గదర్ ఉద్యమం లాంటి స్వదేశీ ఉద్యమాలలో ప్రజలు అసంఖ్యాకంగా పాల్గనడం, ప్రజలలో సామ్రాజ్యవాదానికి వ్యతిరేకత పెరుగుతున్నదనడానికి నిదర్శనంగా ఉంది. మొదటి ప్రపంచయుద్ధ కాలంలో జాతీయ కార్యక్రమాలు చాలా వరకు నిలిపివేయ బడ్డాయి. దీనికి కారణం లెఫ్టినెంట్ గవర్నర్ మైఖేల్ ఓ డయ్యార్ సారథ్యంలో ప్రభుత్వం విపరీతంగా అణచివేతకు పాల్పడడం. కానీ 1917లో రాజ్య కార్యదర్శి మాంటేగ్ పట్టుబట్టడం వలన రాజకీయ కార్యకలాపాలపై నిషేధం ఎత్తివేయడం జరిగింది. పంజాబ్ ప్రాంతీయ కాంగ్రెస్ కమిటీ, కాంగ్రెస్ యొక్క తదుపరి జాతీయ సమావేశాన్ని అమృత్‌సర్‌లో జరపమని కోరడం, అక్కడ పెరిగిన రాజకీయ చైతన్యానికి సాక్ష్యంగా చెప్పుకోవచ్చు. దీని గురించి ట్రిబ్యూన్ పత్రిక ఎంతో సంతఅప్తితో ఇలా వ్యాఖ్యానించింది. మారాల్సిన విధంగానే మార్పు జరుగుతున్నందుకు సంతోషంగా ఉంది. గత కొద్ది కాలంలో ఎన్నో కాంగ్రెస్ కమిటీలు ఉనికిలోకి వచ్చాయి. పంజాబ్ తదుపరి కాంగ్రెస్ సభ జరుపుతామని ఉత్సాహంతో ఆహ్వానించటం అంటే పంజాబ్ కమిటీ ఏంతో విలువైన పనే చేసిందన్న మాట'. మరో మాటలో చెప్పాలంటే జాతీయ సెంటిమెంటు బాగా అభివఅద్ధి చెందిందన్నమాట. 1919లో రౌలట్ సత్యాగ్రహంలో అధిక సంఖ్యలో పాల్గనడానికి ఇది కూడా ఒక ముఖ్య కారణం.

### పెరిగిపోతున్న ఆర్థిక ఇబ్బందులు

యుద్ధ కాలంలో ఎదుర్కొన్న ఆర్థిక కష్టాలు కూడా ప్రజలలో సామ్రాజ్యవాదం పట్ల వ్యతిరేకత పెరగడానికి దోహద పడ్డాయి. అందులో మొట్ట మొదటిది విపరీతంగా పెరిగిన అత్యవసర వస్తువుల ధరలు. ఇది సామాన్యులకు ఆందోళన కలిగించింది. 1917కి 1919కి మధ్య ఆహార పదార్థాల ధరలు ఏకంగా 100 శాతం పెరిగాయి. కానీ కార్మికుల జీతాలు మాత్రం 20 నుండి 25 శాతం మాత్రమే పెరిగాయి. ఇది పట్టణాలలో నివసించే మధ్య తరగతి వర్గం, వఅత్తిదారులు, కార్మికులు, ఇతర స్థిరమైన ఆదాయాలు కలవారిని తీవ్రమైన ఆర్థిక సంక్షోభంలోకి నెట్టేసింది. అమఅత్‌సర్‌లోని వఅత్తిదారులు, అక్కడ నివసించే కాశ్మీర్ ముస్లింలలో ఎక్కువ భాగం చిన్న చిన్న వ్యాపారాలు చేసుకునే వారు, పట్టణాలలో నివసించేవారు ధరల పెరుగుదలతో తీవ్రంగా ఇబ్బందులు పడ్డారు. పంజాబ్‌లోని వఅత్తిదారులు మధ్యతరగతి వ్యాపారాలు కూడా యుద్ధం కాలం నాటి పన్నులను, ముఖ్యంగా ఈ మధ్యనే చేసిన ఆదాయపు పన్ను సవరణలను వ్యతిరేకించారు. ఈ సవరణ ద్వారా పన్ను అంచనావేసే వారికి ఇంటింటికి వెళ్లి అంచనా వేసే అధికారం కట్టపెట్టారు. ప్రభుత్వం తమ ఆస్తులను కబళించే పన్నాగంలో ఇది భాగమని మధ్యతరగతి వారు భావించారు. ధరలు పడిపోతుండడంతో వ్యాపారుల కష్టాలు పెరిగాయి. వీటన్నిటికి తోడుగా డయ్యార్ మధ్యతరగతికి, పట్టణ మధ్య తరగతికి వ్యతిరేకంగా వ్యవహరించేవాడు. పెరుగుతున్న ఆర్థిక అసంతఅప్తి సామ్రాజ్యవాద వ్యతిరేకతకు దారితీస్తున్నదని, అదే రౌలట్ సత్యాగ్రహంలో భాగస్వాములు కావడానికి కారణమని భావించడం జరిగింది. నిజానికి ఆర్థిక కారణాలు సామ్రాజ్యవాద వ్యతిరేకతను పెంచడానికి తోడ్పడి ఉండవచ్చు. కానీ అసలైన కారణం అది కాదు. 18, 19 శతాబ్దాలలో యూరప్‌ను అధ్యయనం చేసిన జార్జ్ రూడ్ అన్నట్టు ఆర్థిక కారణాలు 'ఉద్యమాన్ని' రేపలేవు. 'సామూహిక మనస్తత్వం' ఏర్పడడానికి సామాజిక, ఆర్థిక, రాజకీయ కారణాలు అన్నీ కలిసాయి. ఉద్యమ రూపం తీసుకోడానికి ఒక సంఘటన మాత్రమే కావలసి వచ్చింది. దీనినే లెఫ్వె 'సామూహిక ఆలోచనా సరళి' అని పేరుపెట్టారు. అందువలన ఆనాటి పంజాబ్ మధ్యతరగతిలో వచ్చిన ఆలోచనలలోని మార్పులను అర్థం చేసుకోవడం అత్యంత ప్రాధాన్యతను సంతరించుకుంటుంది.

### రౌలట్‌ను ఎలా అర్థం చేసుకోవాలి?

ఈ ఆందోళనలో రౌలట్ చట్టాన్ని పంజాబ్‌లోని ప్రజలు ఎలా అర్థం చేసుకున్నారన్న పార్శ్వం అత్యంత కీలక మైనది. రౌలట్ చట్టం తాత్కాలిక మైనదని దేశ ద్రోహం తలపెట్టిన వారి పైనే ఉపయోగించ బడుతుందనిప్రభుత్వం చెప్పుకుంది. సామాన్యుల భయాలు తొలగించడానికి ఇది కేవలం రాజకీయ నాయకులపైనే ఉపయోగించ బడుతుంది సామాన్యులకు దీని వలన ఎటువంటి ఇబ్బంది ఉండదని చెప్పింది. కానీ పంజాబ్‌లోని రాజకీయ నాయకత్వం, పాత్రికేయులు ఇది అప్రజాస్వామిక చర్య అని, నిర్బంధ పూరితమైనదని గగ్గోలు పెట్టారు. పౌరస్వేచ్ఛను హరిస్తుందని హెూరెత్తించేశారు.

బహిరంగ సభలలో రౌలట్ చట్టాన్ని ఉపమానాలతో వివరించారు. సామాన్య మానవుని జీవనాన్ని నాశనం చేస్తుందని, దుర్మార్గమైనదని పద్యాలు కూడా చదివి వినిపించారు. అందు వలన సహజంగానే ప్రజలు 'అణచివేత దారుల హస్తాలు బలపడే' ఈ చట్టాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. రౌలట్ చట్టం తమ దైనందిన జీవితాలలో స్వేచ్ఛను హరిస్తుందని నమ్మారు. చట్టాన్ని గురించి వీధులలో జరిగిన చర్చలు ప్రజల ఆలోచనలను మలచడంలో ప్రముఖ పాత్ర పోషించాయి. వీటికి తోడు అణచివేత దారులకు వ్యతిరేకంగా వదంతులు వ్యాప్తి చెందడంతో ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉన్న ప్రజల మధ్య సాన్నిహిత్యం పెరిగింది. సామ్రాజ్యవాద పాలనకు వ్యతిరేకంగా చిన్న వ్యాపారాలు చేస్తున్నవారు, కార్మికులు, ఆర్థికంగా బలహీన వర్గాలు, వఅత్తిదారులు, ఒక్కటై 'జాతీయ బంధం' ఏర్పరచుకున్నారు.

అధికారికంగా గాంధీ రౌలట్ చట్టానికి వ్యతిరేకంగా నిరసనోద్యమం ప్రారంభించక ముందే పంజాబ్‌లో నిరసనలు ప్రారంభ

"మొదటి ప్రపంచయుద్ధ కాలంలో జాతీయ కార్యక్రమాలు చాలా వరకు నిలిపేయ బడ్డాయి. దీనికి కారణం లెఫ్టినెంట్ గవర్నర్ మైఖేల్ ఓ డయ్యార్ సారథ్యంలో ప్రభుత్వం విపరీతంగా అణచివేతకు పాల్పడడం. కానీ 1917లో రాజ్య కార్యదర్శి మాంటేగ్ పట్టుబట్టడం వలన రాజకీయ కార్యకలాపాలపై నిషేధం ఎత్తివేయడం జరిగింది. పంజాబ్ ప్రాంతీయ కాంగ్రెస్ కమిటీ, కాంగ్రెస్ యొక్క తదుపరి జాతీయ సమావేశాన్ని అమృత్‌సర్‌లో జరపమని కోరడం, అక్కడ పెరిగిన రాజకీయ చైతన్యానికి సాక్ష్యంగా చెప్పుకోవచ్చు."

**"ఏప్రిల్ 10వ తేదీ యూరోపియన్లను చంపడం, వారి ఆస్తులు ధ్వంసం చేయడం ప్రభుత్వంపై విజయాలుగా మాత్రమే చూశారు. మెయిల్స్ ఇర్వింగ్ మాటల్లో 'ప్రజలు .... ఏ కారణం వలన అయితేనేం.. ప్రభుత్వ పాలనాంగాన్ని దుర్బల పరిచారు. నేషనల్ బ్యాంకును కాల్చేస్తున్నప్పుడు పోలీసులు ఏ చర్యలు తీసుకోకుండా ఉండడం, ప్రభుత్వం ఏమి చేయలేదన్న భావనను కల్పించింది. "**

మయ్యాయి. ఉదాహరణకి మార్చి 23, 29, 30 తేదీలలో అమఅతసర్‌లో '45,000 మంది ప్రజలతో' సమావేశాలు జరిగాయి. గాంధీ ఈ నిరసనల ముందు కానీ తరువాత కానీ పంజాబ్‌కు గాంధీ రాకపోవడం గమనించ వలసిన విషయం. దీనర్థం అయన ఈ ఉ ద్యమమాలో ప్రత్యక్షంగా పాల్గనలేదని. మార్గ నిర్దేశనం చేయడం గాని నాయకత్వం వహించడం గాని చేయలేక పోయారు. గాంధీ ఏర్పరచిన సత్యాగ్రహ సభ కార్యకలాపాలకు ప్రజల నుండి ఆదరణ కొరవడింది. సత్యాగ్రహ ప్రమాణానికి ఒక డజను కన్నా ఎక్కువమంది సంతకాలు చేయలేదు. రవీంద్ర కుమార్ అన్నట్టు 1919 ఏప్రిల్ 6న హర్తాళ్ కి పిలుపు ఇచ్చే నాటికి 'గాంధీ కి భారత రాజకీయాలలో అంతగాపట్టు లేదు. కానీ గాంధీ ఇచ్చిన పిలుపుకు అమఅతసర్, ఇతర పంజాబ్ పట్టణ ప్రాంతాలలో మంచి ప్రజా స్పందన వచ్చిందన్న విషయం అందరికి తెలిసినదే. అంటే గాంధీకి ప్రజలలో ఆకర్షణ, బలం ఉ ందన్నమాట. అప్పటికే అయన 'రక్షకుడు, దేవ దూత' అన్న బిరుదుల్ని ప్రజల నుండి పొందారు. సుమిత్ సర్కార్ అన్నట్టు గాంధీని ఆ కాలంలో చాలామంది చాలా రకాలుగా ఊహించుకున్నారు. అప్పటికింకా ఆయనను చాలా మంది దూరం నుండి మాత్రమే చూసారు. కొంతమంది ఆయన గురించి కేవలం విన్నారు.' అద్భుతమైన పనులు చేయించగల 'దివ్య మూర్తి' అని అనుకుం టుండేవారు. ఈ రకంగా దివ్య శక్తులున్న గాంధీ పంజాబ్ ప్రజల ఉహాలలోకి చేరిపోయాడు. ఇదంతా రౌలట్ చట్టం రాకముందటి విషయమే. రౌలట్ ఆందోళన రాకముందు కూడా 'గాంధీ జికి జై' నినాదాన్ని ప్రజలు ఎంతో ఉత్సాహంగా చెప్పేవారు. పంజాబ్ చాల ప్రజా ప్రదర్శనలు గాంధీ బొమ్మ ముందు పెట్టుకుని సాగేవి. గాంధీని సామాన్యులు ఒక క్రీస్ట్ తోనో, మహమ్మద్ తోనో, కఅష్ణుడి తోనో పోల్చుకునే వారు. ఒక సమా వేశంలో స్థానిక నాయకుడు మౌల్వీ గులాం మోహి-ఉద్ దిన్, 'శత్రువు(బ్రిటీషువారు) పెట్టే వేదనలను బాధలను', గాంధీ తనలోకి తీసేసు కుంటాడని చెప్పారు. అంతేకాదు, గాంధీ తనలో దాచుకున్న అనంత ఆధ్యాత్మిక శక్తి, అధికార యంత్రాంగాన్ని తుత్తునియలు చేస్తుందని, సత్యాగ్రహ ఆయుధం తమను భయపెడుతున్న బాధల నుండి విముక్తి చేస్తుందని నమ్మారు. 'గాంధీ నాయకత్వం లో ఉండగా వలస ప్రభుత్వానికి బెదర వలసిన అవసరం లేదని అనుకున్నారు. క్లుప్తంగా చెప్పుకోవాలంటే దైవాంశగా చిత్రించబడిన గాంధీ, అతని సమ్మోహన శక్తి బ్రిటిష్ వారి అధికార సమర్థతను తక్కువగా అంచనా వేసేట్టు చేసాయి. బ్రిటిష్ వారి చట్ట భద్రతను నైతికఅధికారాన్ని బహిర్గత పరచలేకపోయాయి.

### సత్యాగ్రహం

మార్చ్ 30, ఏప్రిల్ 6న పంజాబ్ లోని పెద్ద పెద్ద పట్టణాలలో హర్తాళ్‌తో సత్యాగ్రహం ప్రశాంతంగా ప్రారంభమయింది. అయితే స్థానికులు తమ నాయకులైయిన సైఫుద్దీన్ కిచ్లూ, సత్యపాల్‌లు అమఅత్‌సర్‌లో ఖైదు చేయబడ్డారని తెలుసుకుని ఆందోళన చెందారు. పాల్వాల్ రైల్వే స్టేషన్‌లో ఏకంగా గాంధీనే బంధించారని తెలుసుకుని మరింత ఆందోళనకు గురయ్యారు. వెంటనే అమఅత్‌సర్ లోని దుకాణాలన్నీ మూసేసి పెద్ద సంఖ్యలో బ్రిటిష్ అధికారులు, వారి కుటుంబాలు నివసించే సివిల్ లైన్స్‌కి చేరుకున్నారు. అప్పటికి ప్రజలు శాంతియు తంగానే ఉన్నారని ఏ రకమైన దౌర్జన్యాలు చేసే ఉద్దేశంలో లేరని గమనించవలసి ఉంది. కానీ ఎప్పుడయితే నగరాన్ని, సివిల్ లైన్స్‌ని విడదీసే చోట పోలీసులు వారిని అడ్డుకున్నారో అప్పుడే వారు రాళ్ళు రువ్వడం మొదలుపెట్టారు. వెంటనే పోలీసులు కాల్పులు మొదలు పెట్టారు. ఆ నాడు ఆ కాల్పులలో కొంత మంది తమ సహచరులు మరణించిన తరువాత మాత్రమే ప్రజలు బ్రిటిష్ వారిని అణచివేతదారులుగాను వారి ఆఫీసులు, భవనాలను అణచివేతకు గుర్తులుగాను చూశారు. ఆ సమయం లోనే వారు షెర్వుడ్ అనే పట్టణ మిషనరీ స్కూల్ మేనేజర్‌పై, కేవలం ఆమె బ్రిటిష్ దేశస్తురాలు అయినందువలన దాడి చేశారు. ఆలా కొడుతున్న ప్పుడు కొంతమంది ' ఆంగ్లేయురాలిని కొట్టండి' అంటూ నినాదాలు చేసారు. అలాగే బ్యాంకులు, మరికొన్ని ప్రభుత్వ భవనాలపై దాడి చేశారు. అయితే ఈ దాడులలో దోచుకోవాలన్న నేరపూరిత ఉద్దేశాలు ఎంతమాత్రం లేవు. అందుకు భిన్నంగా బ్రిటిష్ పాలన ఎడల వైషమ్యం, సామ్రాజ్యవాద వ్యతిరేక చైతన్యం ఉండేవి.

ఏప్రిల్ 10వ తేదీ యూరోపియన్లను చంపడం, వారి ఆస్తులు ధ్వంసం చేయడం ప్రభుత్వంపై విజయాలుగా మాత్రమే చూశారు. మెయిల్స్ ఇర్వింగ్ మాటల్లో 'ప్రజలు .... ఏ కారణం వలన అయితేనేం.. ప్రభుత్వ పాలనాంగాన్ని దుర్బల పరిచారు. నేషనల్ బ్యాంకును కాల్చేస్తున్నప్పుడు పోలీసులు ఏ చర్యలు తీసుకోకుండా ఉండడం, ప్రభుత్వం ఏమి చేయలేదన్న భావనను కల్పించింది. 'కేవలం కొత్వాలీలో తప్ప అమఅత్‌సర్ పట్టణంలో మరేదీ వాస్తవానికి ప్రభుత్వ అధీనంలో లేదని' సామాన్యులు అనుకున్నారు. ఆ తరువాత హంటర్ కమిటి ముందు ఇర్వింగ్ తన స్టేట్‌మెంట్‌లో కూడా ఈ విషయాన్ని ఒప్పుకున్నారు. 'బయటికి బ్రిటిష్ ప్రభుత్వ పరిపాలనే గాని అంతర్గతంగా ఇది పట్టణం లోని హిందూ ముస్లింల పరిపాలనే 'అలాగే ఇప్పుడు మా పరిపాలన' అనే వారు. ఇవన్నీ బ్రిటిష్ ప్రభుత్వానికి తాము ప్రజలపై తమ అధికారం, పట్టు కోల్పోయామను కునేటట్టు చేశాయి. వలసపాలన సైద్ధాంతిక వారసత్వం తరిగి పోతుందని, ఇది 'అపాయకరం' అని భావించారు. అందువలననే రౌలట్ నిరసనను రాజ్యానికి వ్యతిరేకంగా 'తిరుగుబాటు' అని అన్నారు. అలాంటి పరిస్థితులలో ప్రభుత్వం యొక్క ప్రాధమిక సమస్య మొట్ట మొదటిగా అమఅత్‌సర్‌లో నివసిస్తున్న యూరోపియన్ల రక్షణ. అందువలననే దయ్యర్ తన సైన్యంతో ఏప్రిల్ 11 వతేది అమఅతసర్ వెళ్ళాడు. మొత్తం నగరాన్ని తన ఆధీనంలోకి తెచ్చుకున్నాడు. పట్టణమంతా సైనిక కవాతు నిర్వహించాడు. అన్ని సమావేశాలు కూటములు నిషేధించబడ్డాయని ప్రభుత్వం ప్రకటించింది. ఈ ప్రకటన పట్టణ ప్రజలను ఏ మాత్రం ఆశ్చర్యానికి గురిచేయలేదు. నిజానికి లాహోర్,

కసూర్ పట్టణాలలోని నిరసనలను ప్రభుత్వం ఏమాత్రం తీవ్రంగా తీసుకోలేదన్న వార్తలు వారిని మరింత ఉత్తేజపరిచాయి. ఇటువంటి పరిస్థితి ప్రజానీకాన్ని మరింత ఎదురు తిరిగేందుకు ప్రోత్సాహించింది.

డయ్యర్ సమావేశాలు పెట్టకోవద్దనడం, గుమిగూడవద్దనడం కేవలం సైన్యంతో గుంపులను చెదర గొట్టడం ప్రజలను మోసం చేయడానికే అని అనుకున్నారు. అందువలననే ఏప్రిల్ 13 వ తేదీ స్థానిక నాయకులు బహిరంగ సభ పెట్టుకున్నారు. పట్టణ ప్రజానీకం స్పందించి సభా స్థలానికి చేరుకున్నారు. చెప్పుకోదగ్గ నాయకుడెవరూ రాకపోయినా జనం వేలాదిగా తరలి వచ్చారు. అందులోని అత్యధికులు వలస వ్యతిరేక చైతన్యం గలవారు కావడంతో డయ్యర్ సమావేశ స్థలంలోకి అడుగు పెట్టినా చలించలేదు. ఏమాత్రం బెదరలేదు. తమ బలహీనతను ప్రదర్శించలేదు. సైనికులు కాల్పులు మొదలు పెట్టినప్పుడు కూడా సమావేశంలో పాల్గన్న ప్రజలు మొదట్లో భయపడలేదు. కొంతమంది తూటాలు వట్టివని, బెదరవద్దని అరిచారు. కానీ కొద్దీ నిమిషాలలోనే వందల మంది చనిపోయారు లేదా గాయపడ్డారు. అప్పటికిగాని ప్రజలు అసలు విషయం గ్రహించలేదు.

"డయ్యర్ సమావేశాలు పెట్టుకోవద్దనడం, గుమిగూడవద్దనడం కేవలం సైన్యంతో గుంపులను చెదర గొట్టడం ప్రజలను మోసం చేయడానికే అని అనుకున్నారు. అందువలననే ఏప్రిల్ 13 వ తేదీ స్థానిక నాయకులు బహిరంగ సభ పెట్టుకున్నారు. పట్టణ ప్రజానీకం స్పందించి సభా స్థలానికి చేరుకున్నారు. చెప్పుకోదగ్గ నాయకు డెవరూ రాకపోయినా జనం వేలాదిగా తరలి వచ్చారు. అందులోని అత్యధికులు వలస వ్యతిరేక చైతన్యం గలవారు కావడంతో డయ్యర్ సమావేశ స్థలంలోకి అడుగు పెట్టినా చలించలేదు."



జలియన్‌వాలా బాగ్‌లో అమాయక ప్రజలపై కాల్పులు జరుపుతున్న బ్రిటిష్ ముష్కరులు (తైల చిత్రం)

### భారతీయులలో భయాన్ని పాదుగొల్పడం, అణచివేయడం

బ్రిటిష్ ప్రభుత్వ విధానాలు, జనరల్ డయ్యర్ పాత్ర ఎన్నో రచనలలో చర్చించడం జరిగింది. అయితే రెండు విషయాలను ఇక్కడ చెప్పుకోవాలి. మొదటిది బ్రిటిష్ వలస రాజ్యాన్ని, అమతసర్, లాహోర్, ఇతర పట్టణాలలో రౌలట్ చట్టాన్ని నిరసనలతో సవాలు చేయడం. మార్చి నుండి పంజాబ్‌లో తన ప్రభావం, అధికారం బ్రిటిష్ ప్రభుత్వం కోల్పోయింది. అందువలననే జాలియన్‌వాలా బాగ్‌లో జరిగిన సమావేశాన్ని, భారత ప్రభుత్వ కార్యదర్శి, ప్రత్యక్షంగా తమ అధికారాన్ని సవాలు చేయడం' గా అభివర్ణించారు. కానీ అసలు సమస్య సత్యాగ్రహరూపంలో ఉన్న నిరసనలలో దాగి ఉన్న ప్రమాదకరమైనశక్తి. బ్రిటిష్ వారికి భారతీయులను అణచి వేయాలనే 'జబ్బు'కు కారణం' ఇదే. ఇటువంటి పరిస్థితులలో నిర్దాక్షిణ్యంగా అణచివేయడం మినహా మరో మార్గం లేదనే అభిపాయాన్ని బ్రిటిష్ అధికారులలో అత్యధిక భాగం వ్యక్తం చేసింది. జాలియన్ వాలాబాగ్‌లో జరిపిన కాల్పులు పంజాబ్‌ని తన అధీనంలోకి తెచ్చుకోడంలో భాగమే. ప్రజలను తమ అధీనంలో ఉ ంచుకోడానికి ఎల్లప్పుడూ అధికారాన్నే ఉ పయోగించారు. అవసర మైనప్పుడు, వలస పాలనను సవాలు చేసిన వారిని బలంతో తొక్కిపెట్టారు. గతంలో పంజాబ్ ప్రభుత్వం ప్రభుత్వ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినం దుకు గాను 66గురు కుకాస్ ని తుపాకులతో కాల్చిచంపారు.

అంటే తిరుగుబాటు చేసిన వారిపై బల ప్రయోగం (అణచివేత) చేయడం చట్టబద్ధమైన పాలనని నెలకొల్పడమని, న్యాయమైన పద్ధతిని అనుసరించడమేనని భావించారు. అందువలననే ఆంగ్లేయులలో అత్యధిక భాగం, బ్రిటిష్ ప్రభుత్వాన్ని బలపరిచే పాత్రికేయులు డయ్యర్ పౌరులపై సైన్యాన్ని ప్రయోగించడాన్ని సమర్ధించారు. ఎందుకంటే అది సాధారణ స్థితిని నెలకొల్పేందుకు దోహద పడింది. రెండో విషయం 1857 తిరుగుబాటు తరువాత బ్రిటిష్ అధికారులకు శాంతిని కాపాడడం కోసం 'అణచివేత' అన్నది సమర్ధవంతమైన ముందస్తు చర్యగా మారింది. 1857 భూతం బ్రిటిష్‌వారిని వెన్నాడుతూనే ఉన్నది. ఏ ప్రదేశంలో నయినా ఎప్పుడయినా బ్రిటిష్ వారిపై దాడులు జరుగవచ్చన్న భయం వారిని వదిలిపెట్టలేదు. ఆ భయంతోనే కొంతమంది బ్రిటిష్ అధికారులు తమ కుటుంబాలను కొంత ప్రశాంతమైన ప్రదేశాలకు తరలించారు. బ్రిటిష్ వారి ప్రజా వ్యతిరేక విధానాలకు ప్రజలందరూ ఎదురు తిరిగితే తీవ్రమైన అణచివేతనే అమలు చేయాలని 1857 నాటి అనుభవం తరువాత భావించారు.

### హిందూ ముస్లింల ఐక్యత : బ్రిటిష్ వారి భయం

మరో ముఖ్యమైన అంశం పంజాబ్‌లో హిందూ ముస్లింల ఐక్యత. ఇది రౌలట్ సత్యాగ్రహ సమయంలో స్పష్టంగా కనిపించింది. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఏర్పాటు చేసిన అన్ని ప్రదర్శనలలో బహిరంగ సభలలో హిందూ ముస్లిం ఐక్యత వర్ధిల్లాలని నినాదాలు వినిపించేవి. రాంభుజ్ చౌదరి అనే లాహోర్ నుంచి వచ్చిన ఒక జాతీయ నాయకుడు 'హిందూ ముస్లింల ఐక్యతే' ఇప్పటి తక్షణ ఆవశ్యకత అని నొక్కి చెప్పే వారు. ఏప్రిల్ 9వ తేదీ జరిగిన శ్రీ రామ నవమి రోజు అమతసర్‌లో ముస్లింలు పెద్ద ఎత్తున వచ్చి హిందువులకు మద్దత్తు ఇచ్చి ఉత్సవంలో పాల్గన్నారు. ఇదే వారి మధ్య సౌహార్ధతకి నిదర్శనం. ఒకే బిందెలో నీళ్లు తాగి తామిద్దరం ఒకే మాట మీద ఉన్నట్టు ప్రకటించారు. లాహోర్‌లో స్వామి శ్రద్ధానంద్ కొందరు నిరసన కారులను ఉద్దేశించి మాట్లాడారు. నిజానికి ఏప్రిల్ 11న నిరసన కారుల పాటలలో అమృతసర్ పై పట్టు సంపాదించిన తరువాత అది 'హిందూ ముస్లింల పరిపాలన' అవుతుందనే చెప్పుకున్నారు. ఆందోళన జరుగుతున్న కాలమంతటిలో

> **"ఈ కాలంలో అంతే ముఖ్యమైన మరో విషయం పంజాబ్ జాతీయవాదులందరు కలిసి కట్టుగా ఉండడం. గాంధీ తన ఆత్మ కథలో 'హిందువులు ముస్లింలు వేరు వేరు కాదు ఒకరే అనేటట్టు' ఉండేవారు అని రౌలట్ సత్యాగ్రహ సమయంలో రాసినవాటిలో కొనియాడారు. స్వామి శ్రద్ధానంద్ కూడా హిందువులు ముస్లింలు గంగా, యమునలు కలిసినట్టు కలిసి పోయారని చెప్పుకున్నారు."**

హిందూ ముస్లింలు ఐక్యంగా పనిచేయడం, వారసత్వంగా వారు ఒకే ప్రాంతానికి చెందిన వేరువేరు మతస్థులని, 19 శతాబ్దం వరకు వారు 'వేరు వేరుగా ఉన్నా, కలిసి ఉన్నారని' తెలియచేస్తుంది.

ఈ కాలంలో అంతే ముఖ్యమైన మరో విషయం పంజాబ్ జాతీయవాదులందరు కలిసి కట్టుగా ఉండడం. గాంధీ తన ఆత్మ కథలో 'హిందువులు ముస్లింలు వేరు వేరు కాదు ఒకరే అనేటట్టు' ఉండేవారు అని రౌలట్ సత్యాగ్రహ సమయంలో రాసినవాటిలో కొనియాడారు. స్వామి శ్రద్ధానంద్ కూడా హిందువులు ముస్లింలు గంగా, యమునలు కలిసినట్టు కలిసి పోయారని చెప్పుకున్నారు. లాలా లజపత్ రాయ్ కూడా విదేశాల నుండి తిరిగి వచ్చి '1919వ సంవత్సరం ఎప్పటికి గుర్తుండి పోతుంది, ఎందుకంటే అప్పుడు హిందూ ముస్లింలు ఐక్యంగా ఉన్నారని, హిందువులు ముస్లింలు ఒకే భూభాగాన్ని వారసత్వంగా పొందిన వారు, ఒకే జాతికి చెందిన వారు, ఒకే దేశస్థులు' అని అన్నారు. రాయ్ హిందూ ముస్లిం ఐక్యత కొనసాగుతుందని నమ్మారు. అయినా హిందూముస్లిం ఐక్యతను గురించి జాతీయ నాయకులు చెప్పినదానిలో కొంత భావుకత లేకపోలేదు. అయితే అందులో ఆనాటి జాతీయవాదం, దేశీయతా భావనలు, పంజాబ్ సమాజంలో పెరుగుతున్నాయన్నది కూడా వాస్తవం. కానీ ప్రభుతం హిందూ ముస్లిం ఐక్యతకు మరో అర్థం చెప్పే ప్రయత్నం చేసింది. పంజాబ్ లోని అశాంతిని అధ్యయనం చేయడానికి వేసిన హంటర్ కమిషన్ ఈ ఐక్యత కేవలం తాత్కాలికమేనని, అందుకొరకు చేసే ప్రయత్నాలు రాజకీయ ప్రయోజనాలు ఆశించి చేసినవేనని, అవి బ్రిటిష్ ప్రభుత్వానికి నష్టదాయకమని, అయితే ఏదో హడావుడిలో చేసినవి అయినందువలన వాటి ప్రభావం దీర్ఘకాలం ఉండబోదని తెలియచేసింది.

అలాగే అగ్రకుల నాయకత్వం కూడా ఆందోళనలు చేస్తున్న ఈ కాలంలో ఏర్పడిన మత –జాతి చైతన్యం వాస్తవమైనది కాదని కేవలం ప్రభుత్వాన్ని ఎదిరించడానికి మాత్రమే ఏర్పడినదని భావించింది. పంజాబ్ హిందూ మహాసభ నాయకుల్లో ఒకరైన రాజా నరేంద్ర నాథ్ ఈ ఐక్యత పైపైన ఏర్పడిన ఐక్యతగానే భావించారు. అలాగే ముస్లిం ఉన్నత తరగతి నాయకులైన మియా మొహమ్మద్ షఫీ, మాలిక్ ఉమర్ హైయత్ ఖాన్ తివానా ఈ ఐక్యత తాత్కాలికమైనదని భావించారు. ఎందుకంటే రెండు జాతుల ప్రజల మధ్య స్థిరమైన బేధాలు ఉన్నాయి. హిందూ ముస్లిం జాతుల ఐక్యతా దలక్పధం అగ్రకుల నాయకులకు లేనందువలన జాతీయ పోరాటం మరింతగా సామ్రాజ్య వ్యతిరేకతను సంతరించుకుని స్థిరపడి పదునెక్కి, స్పష్టంగా కనిపించిన తరువాత వారు ఈ ఐక్యతను కొనసాగించలేకపోయారు. వలసవాద అధికార యంత్రాంగం లాగే వారి వారి జాతుల మధ్య ఉన్న ప్రత్యేకమైన బేధాలను వలస రాజ్యం ముందు పెట్టి మరిన్ని ప్రయోజనాలు, సదుపాయాలు పొందాలనుకున్నారు.

ముఖ్యమైన విషయం ఏమిటంటే ఉన్నతకుల నాయకులకుండే ఈ అభిప్రాయం పంజాబ్ మధ్య ప్రాంతంలో ఉన్న పట్టణ సామాన్య మధ్యతరగతి ఆలోచన పై తక్షణ ప్రభావం చూపలేదు. కానీ రెండు జాతులు 'శత్రువులన్న' భావన, తరువాతి కాలంలో వారి మధ్య దూరాన్ని పెంచింది. వలస పాలనకు వ్యతిరేకంగా ఐక్యపోరాటాలు చేయాలన్న జాతీయ దలక్పధాన్ని గందరగోళానికి గురిచేసింది.

జలియన్‌వాలాబాగ్‌లో డయ్యర్ భయంకరమైన కాల్పులు జరిపిన తరువాత కూడా ఉద్యమకాలంలో ఎక్కడయితే పెద్ద ఎత్తున నిరసనలు వెల్లువెత్తాయో అక్కడంతా సామాన్య ప్రజానీకాన్ని తీవ్రంగా అణచివేయడాన్ని పంజాబ్ ప్రభుత్వం కొనసాగించిందని, ఎన్నో అమానుష దాడులు జరిపిందన్న విషయాన్ని ఇక్కడ మనం గమనించాలి. పంజాబ్ లెఫ్టినెంట్ గవర్నర్ మైఖేల్ ఓ డయ్యర్ ఆ తరువాత కాలంలో తాను చేసిన పనిని పూర్తిగా సమర్ధించుకున్నారు. బ్రిటిష్ వారి ఆధిపత్యాన్ని నిలబెట్టడానికి, శాంతి భద్రతలు నెలకొల్పడానికి ఈ చర్యలు అవసరమని చెప్పుకున్నారు. ముందే చెప్పినట్టు మహాత్మా గాంధీ ఎంతో మంది అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోయినందుకు చాలా బాధపడ్డారు. అయితే ఆయన కూడా భారతీయులు హింసాత్మక సంఘటనల్లో పాల్గొన్నందుకు విమర్శించారు. రౌలట్ చట్టానికి వ్యతిరేకంగా వెల్లువెత్తిన నిరసనలు హింసాత్మకమైనవి. అవి గాంధీగారి అహింసా సిద్ధాంతానికి వ్యతిరేకమైనవి. అందుకని ఇంత పెద్ద ప్రజా ఉద్యమం గురించి అయన ఆత్మ విమర్శ చేసుకుని 'ఇది హిమాలయమంత' తప్పిదమన్న నిర్ణయానికి వచ్చారు. అంతేకాదు 'ఉద్యమంలో పాల్గన్నవారు అహింసకు కట్టుబడి ఉంటారన్న నమ్మకం తనకు లేనందువలన ఇకపై తాను సత్యాగ్రహాలకు నాయకత్వం వహించకూడదనే' నిర్ణయానికి వచ్చారు.

జలియన్ వాలా బాగ్ ఊచకోత, ఆ తరువాత పంజాబ్ ప్రజలపై జరిగిన అణచివేత సంఘటనలు 'అనాగరిక మైనవి, అధికార యంత్రాంగానికి తగని పని, వాటిని కనిపెట్టినవారి నైతిక దిగజారుడుతనమని భావించారు' రవీంద్రనాథ్ టాగూర్. ఇందుకు నిరసనగా తనకి ఇచ్చిన 'నైట్ హుడ్ '(గౌరవ సూచకంగా ఇచ్చిన బిరుదు ) త్యజించడానికి నిర్ణయించుకున్నారు. బ్రిటిష్ ఉన్నతాధికారులు డయ్యర్‌ని సమర్ధించి అతని గౌరవ సూచకంగా భారతదేశంలోనూ, బ్రిటన్ లోనూ విందులు ఇవ్వడం' పట్ల జవహర్ లాల్ నెహ్రూ చాలా బాధపడ్డారు. 'సంఘటనను నన్ను విభ్రాంతికి గురిచేసింది. ఇది పూర్తిగా అనైతికం, అనుచితం. బ్రిటిష్ సామ్రాజ్యం ఎంత క్రూరమైనదో, బ్రిటిష్ ఉన్నత వర్గం మన ఆత్మలలోనికి ఎంతగా చొచ్చుకుపోయిందో నేను మొదటిసారిగా గుర్తించాను' అన్నారు. భగత్ సింగ్ జలియన్ వాలాబాగ్‌కి వెళ్లి అక్కడి మట్టిని కొంత వెంట తెచ్చుకున్నారు. ఆలా చేయడంలో అర్థం బహుశా శాంతియుతులైన భాతీయుల పట్ల బ్రిటిష్ ప్రభుత్వం ఎంత అమానుషంగా ప్రవర్తించిందో తెలిపే ఒక గుర్తయి ఉండవచ్చు. లేదా వలస పాలనకు వ్యతిరేకంగా చేసిన అత్యున్నతమైన త్యాగాలకు గుర్తయి ఉండవచ్చు.

**భారత స్వతంత్ర పోరాటంలో మైలురాయి**

జాలియన్ వాలాబాగ్ దుర్ఘటన ఆ తరువాతి కాలంలో జరిగిన జాతీయోద్యమానికి

ఒక ప్రతిరూపం. బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా, బలమైన అధికార కేంద్రానికి వ్యతిరేకంగా తమకున్న సంకెళ్లు తెంపుకుని స్వేచ్ఛ పొందేం దుకు వెల్లువెత్తిన ప్రజా నిరసన అది. డేవిడ్ హోర్డిమెన్ మాటల్లో" 1919 ఏప్రిల్ 13వ తేదీ ఆ బహిరంగ స్థలంలో జరిగిన ఘటన దేశ మంతా పదే పదే గాథలుగా చెప్పబడింది. పాటలుగా పాడబడింది. రకరకాల కళా రూపా లలో దర్శనమిచ్చింది. అమృతసర్ ఘటన దేశ ప్రజల హృదయాలను ద్రవింప చేసింది. బ్రిటిష్ వారి తుపాకి తూటాలకు ఎదురొడ్డి నిలవమని ప్రజలను ప్రేరేపించింది. 'సామ్రాజ్యవాద దుష్ట పాలనకు' డయ్యర్' ఒక పర్యాయ పదమయాడు. అంటే భారతదేశ స్వేచ్ఛకోసం ప్రజలు చేసిన త్యాగాలకు ఆ సంఘటన ఒక ప్రతీక అయింది. ఇక్కడ ఆ సంఘటనను సామాన్య ప్రజలు ఎలా చూశారో తెలుసుకోవడం కూడా అవసరం. ఈ ప్రశ్నకు సమాధానం చెప్పడం చాలా కష్టం. ఎందుకంటే ఆ రోజు భారతదేశంలో చదువు కున్న వారే అతి తక్కువమంది. అయినా ఆ దుర్ఘటన ప్రజానీకంలో వలసపాలన అనుసరించే పాశవిక అణచివేత విధానానికి ఒక ఉదాహర ణగా నిలిచింది. అంతేకాదు కేవలం మహాత్మా గాంధీ మాత్రమే జాలియన్‌వాలా బాగ్ లాంటి విషాదాలు జరగకుండా ఆపగలడని సామాన్యు లు భావించారు. ఆ విధంగా జాలియన్ వాలాబాగ్ దుర్ఘటన తరువాత ఉద్యమం ఒక తాటి పైకి వచ్చింది. ఆ నరమేధం తరువాత గాంధీకి, స్వాతంత్రోద్యమానికి ప్రజలందరూ పాల్గనే ఉద్యమ స్వభావాన్ని కల్పించక తప్పలేదు. అందులో కింది మధ్య తరగతి, రైతులు, కార్మికులు పాల్గనేటట్టు చేయవలసి వచ్చింది.

జాలియన్ వాలాబాగ్ సంఘటన తరు వాత పంజాబ్‌లోని పట్టణకేంద్రాలలో ప్రజా సమూహం ఉద్యమాలలో భాగస్వాములయి తీరాలని గాంధీ నేతృత్వంలోని స్వాతంత్రోద్య మ నాయకులు అర్థం చేసుకున్నారు. అయితే గాంధీ సూచించిన సత్యాగ్రహ విధానాలను తప్పనిసరిగా అనుసరించాలనుకోలేదు ఎందు కంటే వారి దృక్పధం గాంధీ ఆలోచనలు చాలా సార్లు వేరు వేరుగా ఉండేవి. గాంధీ ప్రభావంతో బ్రిటిష్ ప్రభుత్వ బలాన్ని ఎదిరించలేమన్న భయం పోయి ధైర్యం వచ్చిన తరువాత వారికి స్వేచ్ఛ పొందగలమన్న భావన ఏర్పడింది. బ్రిటిష్ ప్రభుత్వ పాలనను ఎదిరించగలమన్న నమ్మకం ఏర్పడి, ప్రభుత్వ శక్తిని తక్కువగా అంచనా వేసుకోవడం మొదలు పెట్టారు. ఒక గట్టి దెబ్బ కొట్టి బ్రిటిష్ ప్రభుత్వాన్ని కూల్చేయాలన్న కోరిక కలిగింది. ఈ అమితమైన ఆత్మ విశ్వాసం గాంధీగారి ప్రతిఘటనా పద్ధతులను అధిగమిం చేటట్టు వారిని ప్రోత్సహించింది. సామ్రాజ్యవాద పాలనకు ఎదురు తిరగడానికి హింసాత్మకంగా వ్యవహరించటానికి వారు ఏమాత్రం వెనుకాడలేదు.

**“ జలియన్ వాలాబాగ్ దుర్ఘటన ఆ తరువాతి కాలంలో జరిగిన జాతీయోద్యమానికి ఒక ప్రతిరూపం. బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా, బలమైన అధికార కేంద్రానికి వ్యతిరేకంగా తమకున్న సంకెళ్లు తెంపుకుని స్వేచ్ఛపొందేందుకు వెల్లువెత్తిన ప్రజా నిరసన అది. 1919 ఏప్రిల్ 13వ తేదీ ఆ బహిరంగ స్థలంలో జరిగిన ఘటన దేశమంతా పదే పదే గాథలుగా చెప్పబడింది. పాటలుగా పాడబడింది. రకరకాల కళా రూపాలలో దర్శనమిచ్చింది. బ్రిటిష్ వారి తుపాకి తూటాలకు ఎదురొడ్డి నిలవమని ప్రజలను ప్రేరేపించింది. ”**

రౌలట్ చట్టానికి వ్యతిరేకంగా నిరసనలు తెలపడానికి ఏర్పరచిన సత్యాగ్రహ సభలుగాని, కాంగ్రెస్ నిర్మాణంగానీ గాంధీ లక్ష్యానికి, విధానాలకు అనుగుణంగా ఆందోళనను నిర్మిం చేంత సమర్ధవంతమైనవి కావు. అటువంటి సమయంలో ప్రజలు తాము పరిస్థితులను అర్థం చేసుకున్నట్టు తమకు తోచినట్టు ఆకస్మిక నిర్ణయాలు తీసుకుని ఆందోళనలో పాల్గన వలసి వచ్చేది. బ్రిటిష్ అధికారుల నిరంకుశత్వాన్ని బహిర్గతం చేయడమే కాక దానిని పడగొట్టాలని పని చేసే క్రమంలో గడబిడకు లోనయ్యేవారు.

గాంధీ తన ఆలోచనా ధోరణికి, ఉవ్వెత్తున లేస్తున్న ప్రజాందోళనలకు మధ్య ఉన్న దూరం గుర్తించడంతో, ప్రజలకు పైనుండి మార్గదర్శ కాలు ఇవ్వడానికి అవసరమైన సరైన నిర్మాణం లేదన్న విషయాన్ని అర్థం చేసుకున్నారు. సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటం అహింసా యుతంగా కొనసాగించడానికి ఇప్పుడున్న నిర్మాణం సరిపోదు. ఆ తరువాత 1920లో గాంధీ సహాయ నిరాకరణ ఉద్యమం మొదలు పెట్టినపుడు కాంగ్రెస్ నిర్మాణాన్ని అయన సమర్ధవంతంగా వినియోగించుకోవాలను కున్నారు. అందువలననే 1920లో జరిగిన మహాసభలో దాని నిర్మాణంలో మార్పులు చేశారు. స్థానిక శాఖలు పెద్ద ఎత్తున ప్రారంభిం చారు. వాటిని, పై నుంచి జాతీయ నాయకత్వం ఇచ్చే పిలుపులు అమలుచేయడానికి వినియో గించుకోవాలనుకున్నారు. ఆ తరువాతే జాతీయ స్థాయిలో ఇచ్చిన పిలుపులు కింద గ్రామ స్థాయి వరకు అమలు చేసే వీలు కలిగింది. కాంగ్రెస్ ప్రజలను పెద్ద సంఖ్యలో సమకూర్చుకో గల గడమే కాక జాతీయ స్థాయిలో తీసుకున్న నిర్ణయాలను సమర్ధవంతంగా అమలు చేయగలిగింది. సమాజంలో సంస్కరణలు అమలు చేయాలన్న గాంధీ బహుత్తరమైన ప్రణాళిక కూడా నెమ్మదిగా నిర్మాణతను సంతరిం చుకుంది. 1920ల నుండి నెమ్మదిగా విస్తరిస్తూ దేశం నలుమూలలలో అనేకమంది మద్దత్తు దారులను సమకూర్చుకోగలిగింది.

ప్రజలను ఇట్టె ఆకర్షించగల గాంధీ నాయకత్వమే వలస పాలనకు వ్యతిరేకంగా, రౌలట్ సత్యాగ్రహాన్ని విజయవంతం చేయగలి గిందనడానికి ఎటువంటి సందేహం లేదు. కానీ ఆనాటి పరిస్థితులలో గాంధీ ప్రజాసమూహాన్ని కూడగట్టడానికి ప్రజలలో చెలరేగిన ఆవేశమే ఎక్కువగా ఉపయోగపడింది. గాంధీ పిలుపులు ప్రజలను ఉత్తేజ పరచడానికి పనికి వచ్చాయి కానీ ఎక్కువకాలం ఆ ఉత్తేజం నిలబడడానికి సరిపోలేదు. అలా నిలపాలంటే రోజువారీ వారు ఎదుర్కొంటున్న సమస్యలకు కారణం సామ్రాజ్య వాదమని, అందువలన దానిని వ్యతిరేకించాలన్న చైతన్యం వారిలో కలిగించవలసి ఉంది. భారత దేశంలోని వివిధ తరగతుల ప్రజలలో రేగిన అసంతృప్తిని, రౌలట్ చట్టానికి వ్యతిరేకంగా జరిగిన ఆందోళనలతో మేళవింపు చేయడం సాధ్యపడింది. ఇదే గాంధీ మొదలు పెట్టిన ఉ ద్యమానికి ఊపు నిచ్చింది. అంటే పంజాబ్‌లో రౌలట్ చట్టానికి వ్యతిరేకంగా వచ్చిన ఆవేశం ఆ నాడు ప్రజలలో ఉన్న సామాజిక, ఆర్థిక సమస్యలకు సంబంధించినదే. పంజాబ్‌లో రౌలట్ సత్యాగ్రహం పథకం ప్రకారం చేసినది కాదు. ప్రజల భౌతిక అవసరాల వలన అనుకోకుండా ఏర్పడిన ఉద్యమం. 1919 తరు వాత మాత్రమే గాంధీ, కాంగ్రెస్ కూడా ప్రజల సమస్యలను సామ్రాజ్యవాద వ్యతిరేకతకు జోడించే ప్రయత్నం చేశారు. అయితే ఇదికూడా సమర్ధ వంతంగా జరగలేదు. అనుకున్న దృక్పథానికి అనుగుణంగా కూడా జరగలేదు. రౌలట్ చట్టం సత్యాగ్రహం, జాలియన్ వాలాబాగ్ నరమేధం జాతీయోద్యమాన్ని ప్రజా ఉద్యమంగా మార్చిం దనడానికి ఎటువంటి సందేహం లేదు. ఇది ఖచ్చితంగా ఒక నిర్ణయాత్మకమైన మూలమలుపు.

**అనువాదం : కె. ఉషారాణి**

# కాశ్మీర్ విచ్ఛిన్నం : దేశ సమైక్యతకు ప్రమాదం



రచయిత మార్క్సిస్టు మాసపత్రిక బాధ్యులు

**ఎ కోటి రెడ్డి**

దేశంలో ఆర్థికమాంద్యం తీవ్రమౌతున్నది. ప్రభుత్వరంగ సంస్థలు, ప్రభుత్వ, ప్రజల ఆస్తులు, దేశ సంపదను కార్పొరేట్లు, బహుళ జాతి సంస్థలకు కట్టబెట్టటం, మతోన్మాదాన్ని మరింత తీవ్రం చేయటం అనే లక్ష్యాలను సాధించటం కోసం మోడి నాయకత్వంలోని బిజెపి ప్రభుత్వం ప్రయత్నాలను వేగిరం చేసింది. ప్రజలకెదురవుతున్న ఆర్థిక సమస్యల నుండి దృష్టిని మళ్ళించటం కోసం నకిలీ జాతీయవాదాన్నిరెచ్చగొడుతూ, జమ్మూకాశ్మీర్‌లో సంభవిస్తున్న పరిణామాలపై తప్పుడు ప్రచారం చేయటానికి పూనుకున్నది. అందులో భాగంగా చారిత్రకాంశాలను వక్రీకరిస్తూ, జమ్మూకాశ్మీర్ ప్రజల ప్రజాస్వామిక హక్కులను ఏ మాత్రం పరిగణనలోకి తీసుకోకుండా కాశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని కల్పిస్తున్న, స్థానిక ప్రజలకు కొన్ని రక్షణలు కల్పిస్తున్న ఆర్టికల్ 370, 35ఎ లను అత్యంత నిరంకుశంగా రద్దుచేసింది. తన పాలనలో సంభవిస్తున్న దుష్పరిణామాల నుండి ప్రజల దృష్టిని మళ్ళించటానికి మోడి ప్రభుత్వం జమ్మూకాశ్మీర్ సమస్యను ముసుగుగా వినియోగించుకొంటున్నది. దేశ ఆర్థికాభివృద్ధి దిగజారుతున్నదని ప్రభుత్వ సంస్థలు విడుదల చేస్తున్న లెక్కలు స్పష్టం చేస్తున్నాయి. పారిశ్రామికాభివృద్ధి వెనుకపట్టు పట్టింది. నిరుద్యోగం 45 సంవత్సరాల కాలంలోనే అత్యధికంగా నమోదైంది. పారిశ్రామికాభివృద్ధిలో ముఖ్య భాగంగా ఉన్న ఆటోమొబైల్ రంగం 19 సంవత్సరాల కనిష్ఠానికి దిగజారింది. బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న రైతాంగ వ్యతిరేక విధా నాల వలన సగం మందికి పైగా ప్రజానీకానికి ఉపాధి కల్పిస్తున్న వ్యవసాయ రంగం మరింత సంక్షోభంలో కూరుకుపోతున్నది. ప్రభుత్వం చెబుతున్న విధంగా 7 శాతానికి మించి ఆర్థికాభివృద్ధిని సాధించటం సాధ్యం కాదని అంతర్జాతీయ, జాతీయ రేటింగ్ ఏజన్సీలు విశ్లేషిస్తున్నాయి. జిడిపి వృద్ధి అంచనాలను 7 నుండి 6.2 శాతం వరకు తగ్గించాయి. ప్రస్తుతం ఎదురౌతున్న ఆర్థికమాంద్యంతో తగ్గించిన అంచనాల మేరకు జిడిపి వృద్ధిని సాధించటం కూడా సందేహాస్పదంగా ఉన్నది.

ఇటువంటి పరిస్థితుల్లో ఒకవపై దేశ ప్రజల దృష్టిని దేశం ఎదుర్కొంటున్న అసలైన సమస్యల నుండి మళ్లించేందుకూ, ఒకే దేశం,ఒకేచట్టం, ఒకే జెండా అనే తన హిందూత్వ ఎజెండాలో భాగంగా మన రాజ్యాంగంలోని ఫెడరల్ స్వభావాన్ని నాశనం చేసేందుకూ మోడీ ప్రభుత్వం కాశ్మీర్‌ను విభజించి కేంద్రపాలిత ప్రాంతాలుగా మార్చే దుశ్చర్యకు పాల్పడింది. దేశంలో ఇప్పటి వరకు గోరక్షణ, లవ్ జిహాద్ తదితర పేర్లతో చెదురుమదురుగా ముస్లింలపై దాడులు చేసిన సంఘ్ పరివార్ ఇపుడు జమ్మూకాశ్మీర్ సమస్యను ముందుకు తీసుకురావటం ద్వారా ఆ రాష్ట్రంలోని ముస్లింల హక్కులపై సామూహిక దాడిని సాగిస్తూ, దేశవ్యాపితంగా దాడులను మరింత తీవ్రం చేయటానికి పథకాలను రూపొందిస్తున్నది. ఆర్టికల్స్ 370, 35ఎ లను రద్దుచేసే క్రమంలో రాష్ట్రంలోని ప్రజల ప్రజాస్వామిక హక్కులను హరించారు. కాశ్మీర్‌లోయలో కర్ఫ్యూ విధించారు. మొబైల్, టెలిఫోన్, ఇంటర్నెట్ తదితరాలు పనిచేయకుండా నిరోధించారు. అమర్‌నాథ్ యాత్రికులపై ఉగ్రవాదులు దాడిచేయనున్నారని కేంద్ర ప్రభుత్వమే తప్పుడు ప్రచారం ప్రారంభించి, యాత్రికులంతా జమ్మూకాశ్మీర్ వదిలి రావాలని ఒత్తిడి చేసింది. ఆర్టికల్స్ 370, 35ఎలతో జమ్మూకాశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి ఇవ్వటం ద్వారా అప్పటి ప్రభుత్వాలు దేశ ఐక్యతను బలహీనపరిచాయని, వారు చేసిన తప్పిదాన్ని తాము సరిచేస్తున్నామన్న ప్రచారంతో చరిత్రను వక్రీకరించటానికి పూనుకున్నారు.

ఆర్టికల్స్ 370, 35ఎల వలన జమ్మూ కాశ్మీర్‌లో తీవ్రవాదం పెరుగుతున్నదని, అభివృద్ధిలో వెనుకబడిందని మోడి, అమిత్‌షాలు చేస్తున్న ప్రచారం తప్పని జమ్మూకాశ్మీర్‌లోని వాస్తవ పరిస్థితులు నిరూపిస్తున్నాయి. ఆర్టికల్ 370 ఉండటం వలననే దేశంలోని అన్ని రాష్ట్రాల కన్నా ముందుగా జమ్మూకాశ్మీర్‌లో భూసంస్కరణలు అమలు జరిగాయి. భూస్వామ్య విధానం బలహీనపడింది. సాగుదార్ల చేతికి భూములొచ్చాయి. ఫలితంగా ఆర్థిక, సామాజికాభివృద్ధిలో అనేక రాష్ట్రాలకన్నా ముందున్నది. దేశంలో దరిద్రరేఖకు దిగువనున్న వారు_26 శాతం కాగా, జమ్మూకాశ్మీర్‌లో 8.1 శాతం మాత్రమే. దేశ రాజధాని ఢిల్లీని మినహాయిస్తే దరిద్రాన్ని తగ్గించిన రాష్ట్రాలలో జమ్మూకాశ్మీర్ మొదటిస్థానంలో ఉన్నది. ఈ వాస్తవాలతో పాటు వివిధ ప్రభుత్వశాఖలు విడుదల చేస్తున్న నివేదికలలో పేర్కొన్న విషయాలు జమ్మూ కాశ్మీర్‌ను గురించి ప్రభుత్వం చేస్తున్న ప్రచారంలోని డొల్లతనాన్ని వెల్లడిస్తున్నాయి. అభివృద్ధికి ఆదర్శంగా బిజెపి చూపిస్తున్న గుజరాత్ కన్నా జమ్మూకాశ్మీర్ అనేక రంగాలలో ముందున్నది. ఎక్కువ సామాజికాభివృద్ధి సూచీలలో యుపి, బీహార్, రాజస్థాన్ తదితర రాష్ట్రాలు జమ్మూ కాశ్మీర్ కన్నా వెనుకబడివున్నాయి. వాస్తవాలకు మసిపూసి మారేడుకాయ చేయటం ద్వారా ప్రజలను తప్పుదారి పట్టించటానికే బిజెపి ఇటువంటి అబద్ధాలను ప్రచారం చేస్తున్నది.

**ఆర్టికల్ 370 నిర్వీర్యంతోనే తీవ్రవాదం పెరుగుదల**

జమ్మూకాశ్మీర్‌లో తీవ్రవాదం పెరుగుదలకు ఆర్టికల్ 370 కారణం కాదు. దానిని సక్రమంగా అమలు జరపకపోవటంతోనే రాష్ట్రంలో తీవ్రవాదం తలెత్తింది. ఆర్టికల్ 370ని అమలు

జరిపినపుడు తీవ్రవాదం తగ్గింది. గతంలో కాంగ్రెస్, ప్రస్తుత బిజెపి ప్రభుత్వాలు రాష్ట్రంలో ప్రజాస్వామిక హక్కులను హరించటం, నిరంకుశ విధానాలను అమలు చేయటానికి పూనుకోవటం వలన తీవ్రవాదం పెరిగింది. 1974లో ఇందిరాగాంధి, షేక్ అబ్దుల్లాల మధ్య ఒప్పందం కుదిరిన తర్వాత జరిగిన ఎన్నికలలో విజయం సాధించి, షేక్ అబ్దుల్లా అధికారంలోకి వచ్చాడు. షేక్ అబ్దుల్లా మరణానంతరం అతని కుమారుడు ఫరూక్ అబ్దుల్లా ముఖ్యమంత్రి అయ్యాడు. ఆ తర్వాత కాలంలో భారత ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరించటంతో పరిస్థితులు క్రమంగా దిగజారాయి. కాంగ్రెస్ పార్టీ అనైతిక పద్ధతుల్లో ఫరూక్ అబ్దుల్లాను అధికారం నుండి తొలగించి, అతని బావమరిది గులాం మహమ్మద్ షాను ముఖ్యమంత్రిని చేసింది. తరువాత జరిగిన ఎన్నికలలో పెద్ద ఎత్తున రిగ్గింగ్ జరగటంతో ప్రజలలో అసంతృప్తి పెరిగింది. దానితో పాకిస్థాన్ జోక్యం చేసుకోవటానికి అవకాశాలు పెరిగాయి. ఆ విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం అవకాశవాదంతో వ్యవహరించటం జమ్మూకాశ్మీర్‌లో తీవ్రవాద భావాలు పెరగటానికి దోహదం చేసింది.

2014లో కేంద్రంలో మోడి నాయకత్వంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అక్కడి ప్రజలతో నిమిత్తం లేకుండా పూర్తిగా నిరంకుశ విధానాలను అమలుచేయటం ప్రారంభించింది. అసెంబ్లీ ఎన్నికల అనంతరం అవకాశవాదంతో పిడిపితో జట్టుకట్టి, ప్రభుత్వంలో భాగస్వామి అయిన బిజెపి, అనంతరం ఆ ప్రభుత్వాన్ని కూలద్రోసి రాష్ట్రపతి పాలన విధించింది. ఆ తర్వాత ఫిరాయింపులను ప్రోత్సహించటం ద్వారా ఏ మాత్రం ప్రజా బలంలేని సజ్జాద్ లోనెతో కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయటానికి పథకాలు రూపొందించింది. పిడిపి, నేషనల్ కాన్ఫరెన్స్‌లు కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయటానికి సమాలోచనలు జరుపుతున్న క్రమంలో తన పథకాలు పారవని గ్రహించిన బిజెపి అసెంబ్లీని రద్దుచేసింది. గవర్నర్ పాలన పేరుతో కేంద్రం నిరంకుశ విధానాలను అమలు జరపటంతో కాశ్మీర్ ప్రజలలో అసంతృప్తి పెరిగింది. అసంతృప్తి చెంది ఆందోళనలో పాల్గొంటున్న ప్రజలు, జమ్మూకాశ్మీర్‌కు స్వతంత్ర ప్రతిపత్తిని కోరుతున్న వారు, రాష్ట్ర వేర్పాటుకై సాయుధంగా పోరాడుతున్న తీవ్రవాదుల మధ్య ప్రభుత్వం విచక్షణ చూపటం లేదు. సామాన్య ప్రజలపై కూడా పెల్లెట్‌లను ప్రయోగించటంతో అనేక

> **“ 2014 అసెంబ్లీ ఎన్నికల అనంతరం అవకాశవాదంతో పిడిపితో జట్టుకట్టి, ప్రభుత్వంలో భాగస్వామి అయిన బిజెపి, అనంతరం ఆ ప్రభుత్వాన్ని కూలద్రోసి రాష్ట్రపతి పాలన విధించింది. ఆ తర్వాత ఫిరాయింపులను ప్రోత్సహించటం ద్వారా ఏ మాత్రం ప్రజాబలం లేని సజ్జాద్‌లోనెతో కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయటానికి పథకం వేసింది. పిడిపి, నేషనల్ కాన్ఫరెన్స్‌లు కలిసి ప్రభుత్వాన్నిఏర్పాటు చేయటానికి సమాలోచనలుజరుపుతున్నక్రమంలో తనపథకాలు పారవనిగ్రహించినబిజెపి అసెంబ్లీని రద్దుచేసింది. ”**

మంది వికలాంగులయారు. ఈ విధమైన చర్యలతో లోయలో తీవ్రవాదం పెరగటం, వారికి ప్రజల మద్దతు పెరగటం ప్రారంభమైంది. గతంలో బయటి నుండి వచ్చిన తీవ్రవాదులు ప్రధానంగా ఉండేవారు. ఇపుడు లోయలోని యువత తీవ్రవాదం వైపు ఆకర్షితులవుతున్నారు. ఫలితంగా తీవ్రవాద కార్యకలాపాలు పెరుగుతున్నాయి. రాష్ట్రంలో 2014లో 222 తీవ్రవాద సంబంధిత ఘటనలు జరగగా, 2018లో 614కు, రెండున్నర రెట్లకు పైగా పెరిగాయి.

**ఆర్టికల్ 35ఎకు పండిట్ల ఆందోళనే మూలం**

ఆర్టికల్ 35ఎ వలన కాశ్మీర్‌లో ఎవరూ భూములు కొనలేకపోతున్నారని, పెట్టుబడులు కూడా రావటం లేదని, ఇపుడు దానిని రద్దు చేశాం కాబట్టి పెట్టుబడులు ప్రవహించి రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని తప్పుడు ప్రచారం చేస్తున్నారు. జమ్మూకాశ్మీర్‌కు సంబంధించి రాజ్యాంగంలో ఆర్టికల్ 35ఎ చోటు చేసుకోవటానికి అక్కడున్న ముస్లింలు మాత్రమే కాక హిందు పండిట్లు కూడా కారణం. ఆర్టికల్ 35ఎలో ఉన్నవాటిలో ఓటుహక్కు మినహా మిగతావాటిని జమ్మూకాశ్మీర్ రాజు పాలనలో ఉన్నపుడే కాశ్మీరీ పండిట్లు ఆందోళన చేసి సాధించుకున్నారు. "కాశ్మీరీయులకే కాశ్మీర్" అనే నినాదంతో హిందు పండితుల యువసభ, సనాతన ధర్మసభ తదితర సంస్థల నాయకత్వంలో ఆందోళనలు చేశారు. విద్యలో వెనుకబడినందున ప్రత్యేక రాయితీలు కావాలని, ప్రభుత్వోద్యోగాలలోకి స్థానికులను ఎక్కువ మందిని తీసుకోవాలని పండిట్లు ఆందోళనలు చేయటంతో రాజు అంగీకరించి, 1927లో ఆ రాయితీలను కల్పించాడు. ఆ అంశాలనే ఆర్టికల్ 35ఎ రూపంలో 1954లో రాజ్యాంగంలో చేర్చారు. ఈ ఆర్టికల్ ద్వారా స్థిరాస్తులు, ఉద్యోగాలు, స్కాలర్‌షిప్‌లు, ఓటుహక్కు తదితరాలను స్థానికులకే రిజర్వు చేశారు. వీటిని పొందటానికి ఎవరు అర్హులో నిర్ణయించే అధికారాన్ని కాశ్మీర్ అసెంబ్లీకి ఇచ్చారు. వేర్పాటువాదం పెరగటానికి ఇవి దోహదం చేశాయని మోడి, అమిత్‌షాలు ప్రచారం చేస్తున్నారు.

**ఆర్టికల్ 370 రద్దుపై తప్పుడు ప్రచారం**

ఇప్పటి వరకు దేశ రాజ్యాంగం, చట్టాల అమలులో వివక్ష చోటు చేసుకుందని, ఆర్టికల్ 370 రద్దుతో వివక్ష అంతమై దేశమంతటా ఒకేవిధంగా చట్టాలు అమలు జరుగుతాయని కేంద్ర ప్రభుత్వం, సంఘ్ పరివార్ తప్పుడు ప్రచారం చేస్తున్నాయి. వాస్తవం ఏమిటంటే జమ్మూకాశ్మీర్‌కే కాకుండా దేశంలోని అనేక రాష్ట్రాలకు ప్రత్యేకహక్కులు కల్పిస్తున్న ఆర్టికల్స్‌ను రాజ్యాంగంలో పొందుపరిచారు. ఆర్టికల్ 371ఎ నుండి జె వరకు ఉన్న సెక్షన్‌లు ఈశాన్య రాష్ట్రాలు, గోవా, సిక్కిం, ఆంధ్రప్రదేశ్, నిజాం సంస్థానం విచ్ఛిన్నమైన తర్వాత కర్ణాటకలో కలిసిన కన్నడం మాట్లాడే ప్రజలున్న ఆరు జిల్లాలకు ప్రత్యేక హక్కులను కల్పించటం కోసం రాజ్యాంగంలో చేర్చారు. ఆర్టికల్ 370 రద్దు తర్వాత ఈశాన్య ప్రాంత ప్రజలలో ప్రభుత్వం తమ రాష్ట్రాలకు ఇచ్చిన ప్రత్యేక హక్కులను కూడా రద్దు చేస్తుందని ఆందోళన వ్యక్తమైంది. ఆర్టికల్ 371 ఈశాన్య రాష్ట్రాలకు ఇచ్చిన ప్రత్యేకహక్కులు ఆ ప్రాంతంలో నివసిస్తున్న గిరిజన సమూహాల ఆర్థిక హక్కులు, సంస్కృతిని కాపాడటం కోసం ఉద్దేశించినవి. గిరిజన తెగల మధ్య తలెత్తే వివాదాలను సాంప్రదాయ చట్టాల ద్వారా పరిష్కరించుకోవటానికి ఆర్టికల్ 371 ద్వారా అవకాశం కల్పించారు. బయటి నుండి వచ్చిన వారు తమ ప్రాంతంలో భూమికి స్వంతదారులు కావటాన్ని కూడా కొన్ని సాంప్రదాయక చట్టాలు నిషేధించటాన్ని అంగీకరించారు. అధికార వికేంద్రీకరణ ద్వారా ఆ ప్రాంతాలలోని ప్రజలు కొంతమేరకు స్వయం పాలన నిర్వహించుకోవటానికి ఆర్టికల్ 371 అవకాశం కల్పించింది. ఆర్టికల్ 371 ద్వారా ఇచ్చిన హక్కులు ఈశాన్య

> **"వెనుకబడిన ప్రజలు, ప్రాంతాలకు ఇటువంటి ప్రత్యేకహక్కులు ఉన్నాయి కాబట్టే వెనుకబడిన ప్రజలు, ప్రాంతాలు కొంతమేరకు అభివృద్ధి కావటానికి, జాతీయ సమైక్యత బలపడటానికి దోహదం చేసింది. అభివృద్ధి సాధనకు, జాతీయ సమైక్యతను బలపర్చటం కోసం, రాష్ట్రాలకు, రాష్ట్రాలలోని వెనుకబడిన ప్రాంతాలకు రాజ్యాంగం ప్రత్యేక హక్కులు ఇవ్వగా, కాశ్మీర్‌కు ప్రత్యేక హక్కులను ఇచ్చిన ఆర్టికల్, 370 వేర్పాటువాదాన్ని ప్రోత్సహిస్తున్నదని బిజెపి ప్రచారం చేయటం ఎంత హాస్యాస్పదం!"**

ప్రాంతంలోని అన్ని రాష్ట్రాలకు ఒకే విధంగా వర్తించవు. ఉదాహరణకు నాగా ప్రజల మతపరమైన, సామాజిక సంబంధిత అంశాలలో జోక్యం చేసుకొనే విధంగా పార్లమెంటు చట్టాలు చేస్తే, అవి నాగాలాండ్ అసెంబ్లీ ఆమోదిస్తేనే ఆ రాష్ట్రానికి వర్తిస్తాయి. ఆ రాజకీయ స్వాతంత్ర్యాన్ని ఆర్టికల్ 371ఎ నాగా ప్రజలకు ఇచ్చింది. ఆర్టికల్ 370 రద్దు తర్వాత నాగా ప్రజలలో తలెత్తిన అనుమానాలను తొలగిం చటం కోసం ఆర్టికల్ 371ఎ లో నాగాలాండ్‌కు ఇచ్చిన హామీలను కేంద్రం రద్దు చేయదని ఆ రాష్ట్ర గవర్నర్ ప్రకటన చేయాల్సివచ్చింది. ఆర్టికల్ 371సి మణిపూర్‌లో కొండప్రాంత ప్రజలకు కొన్ని హక్కులను ఇచ్చింది. ఆర్టికల్ 371జి మిజోరంకు వర్తిస్తుంది. మిజో ప్రజల మతపరమైన, సామాజిక అంశాలలో జోక్యం చేసుకొనేవైతే పార్లమెంటు చేసిన చట్టాలు మిజోరం అసెంబ్లీ ఆమోదిస్తేనే ఆ రాష్ట్రంలో అమలు జరుగుతాయి. నాగాలాండ్ వలెనే స్థానిక పద్ధతులలోనే వివాదాలను పరిష్కారం చేసుకోవచ్చు. స్థానికేతరులకు భూములను బదిలీ చేయటంపై నిషేధం ఉంది. ఆర్టికల్ 371బి అస్సాంకు, ఆర్టికల్ 371 హెచ్ అరుణాచల్ ప్రదేశ్‌కు వర్తిస్తాయి. ఆర్టికల్ 371డి ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ ప్రాంతాల మధ్య విద్య, ఉద్యోగాలలో సమతుల్యత సాధించటం కోసం ఉద్దేశించినది. ఆర్టికల్ 371ఐ గోవా రాష్ట్ర శాసనసభకు సభ్యుల సంఖ్యను నిర్ణయించటానికి సంబంధించినది.

ఆర్టికల్ 371 ఎఫ్ సిక్కిం రాష్ట్రం దేశంలో విలీనం కాకముందు ఆ రాష్ట్రంలో ఉన్న చట్టాలు, హక్కుల రక్షణకు ఉద్దేశించినది. స్థానికంగా ఉద్యోగాలలో సిక్కిం ప్రజలకు ప్రాధాన్యత ఇవ్వాలని అందులో పేర్కొన్నారు. దీనిని వ్యతిరేకిస్తూ కొందరు సుప్రీంకోర్టుకు వెళ్ళగా వారి వాదనను తిరస్కరించి, స్థానికులకు ప్రాధాన్యత ఇవ్వటాన్ని సుప్రీంకోర్టు సమర్థించింది. రాష్ట్ర శాసనసభకు పోటీ చేయటం కోసం భూటియా, లెప్చా తెగలకు రాజకీయ రిజర్వేషన్లు కల్పించారు. వారిని గిరిజనులుగా పరిగణించటం ద్వారా కాక, రాజకీయ పరమైన ఒప్పందం ద్వారా ఇది జరిగింది. భారతదేశ ప్రజలందరికీ వర్తించే ఆదాయపన్ను చట్టం సిక్కిం ప్రజలకు వర్తించదు. సిక్కిం శాసనసభ పదేపదే విజ్ఞప్తులు చేసిన మీదట వారికి ఆ మినహాయింపును ఇచ్చారు. ఇందుకోసం ఆదాయపన్ను చట్టానికి సవరణలు చేశారు. ఆర్టికల్ 371జె కర్ణాటక రాష్ట్రంలో కలిసిన నిజాం పాలనలోని ఆరు కన్నడ జిల్లాల అభివృద్ధికి ఉద్దేశించినది. కర్ణాటకలోని మిగతా జిల్లాల ప్రజల కన్నా ఈ జిల్లాల ప్రజలు సామాజిక, ఆర్థికాభివృద్ధిలో వెనుకబడ్డారు. మిగతా జిల్లాలలోని ప్రజలతో సమానంగా వారిని అభివృద్ధి చేయటం కోసం ఆ ప్రాంతానికి ప్రత్యేక అభివృద్ధి బోర్డు, నిధుల కేటాయింపు, విద్య, ఉద్యోగాలలో స్థానికులకు రిజర్వేషన్లు కల్పించటం తదితరాలకు సంబంధించినది.

గిరిజనులు మెజారిటీగా ఉన్న ప్రాంతాలలో 1/70 అమలు జరుగుతున్నది. అక్కడ భూములు, ఇళ్ళు తదితర స్థిరాస్తులు గిరిజనేతరులు కొనటానికి వీలులేదు. మనరాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగాలు పొందటానికి జోనల్ విధానం అమలులో ఉంది. దాని ప్రకారం ఏ జోన్‌లోని వారికి ఆ జోన్‌లో ఉద్యోగాలు పొందటంలో ప్రాధాన్యత ఉంటుంది. ప్రజల మధ్య, రాష్ట్రాలు, రాష్ట్రాలలోని ప్రాంతాల మధ్య అనేక వైవిధ్యాలు, అభివృద్ధిలో అసమానతలను గుర్తించిన జాతీయోద్యమ నాయకత్వం ఆయా ప్రాంతాలు, ప్రజలకు ప్రత్యేకహక్కులను ఇస్తూ రాజ్యాంగంలో పొందుపరిచింది. ఈ 70 సంవత్సరాల కాలంలో వాటి అమలు, తద్వారా సమకూరిన ఫలితాలను చూస్తే అటువంటి హక్కులు ఇవ్వటం ఎంత సమంజసమో స్పష్టమౌతున్నది. వెనుకబడిన ప్రజలు, ప్రాంతాలకు ఇటువంటి ప్రత్యేకహక్కులు ఉన్నాయి కాబట్టే వెనుకబడిన ప్రజలు, ప్రాంతాలు కొంతమేరకు అభివృద్ధి కావటానికి, జాతీయ సమైక్యత బలపడటానికి దోహదం చేసింది. అభివృద్ధి సాధనకు, జాతీయ సమైక్యతను బలపర్చటం కోసం, రాష్ట్రాలకు, రాష్ట్రాలలోని వెనుకబడిన ప్రాంతాలకు రాజ్యాంగం ప్రత్యేక హక్కులు ఇవ్వగా, కాశ్మీర్‌కు ప్రత్యేక హక్కులను ఇచ్చిన ఆర్టికల్, 370 వేర్పాటువాదాన్ని ప్రోత్సహిస్తున్నదని బిజెపి ప్రచారం చేయటం ఎంత హాస్యాస్పదం! ఆర్టికల్ 370, 35ఎ రద్దు ద్వారా జాతీయ సమైక్యత బలపడుతుందని ప్రచారం చేయటం ఎంత ప్రమాదకరం!! బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న ఈ వైఖరి జాతీయ సమైక్యతకు తీవ్ర విఘాతం కలిగిస్తుంది.

**వేర్పాటువాద సంస్థల పెరుగుదలకు మార్గం సుగమం**


జమ్మూకాశ్మీర్‌లో ప్రభుత్వం అమలుచేస్తున్న విధానాలు ఆ రాష్ట్రంలోని యువత తీవ్రవాదం వైపు వెళ్ళటానికి దోహదం చేస్తున్నాయి. సరిహద్దు అవతలి నుండి దేశంలోకి ఉగ్రవాదులను పంపుతున్న సంస్థలకు రోజురోజుకీ మద్దతు పెరుగుతున్నది. కాశ్మీర్‌పై కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాన్ని వ్యతిరేకిస్తున్నవారిని లక్ష్యంగా పెట్టుకొని, వారి ఇళ్ళపై దాడులు చేసి, నాయకులను గృహ నిర్బంధం చేసింది. ఆల్‌పార్టీ హురియత్ కాన్ఫరెన్స్ ఛైర్మన్ మీర్వాయిజ్ ఉమర్ ఫరూక్‌ను గృహ నిర్బంధంలో ఉంచారు. కొందరు నాయకుల ఆస్తులను అటాచ్ చేశారు. జెకెఎల్ఎఫ్‌ను నిషేధించారు. ఈ చర్యల వలన ప్రభుత్వ విధానాలతో అసంతృప్తి చెందిన యువతకు వీరు నాయకత్వం వహించలేని స్థితిని కల్పించింది. అందువలన ఇస్లామిక్ ప్రపంచం కోసం జరుగుతున్న పోరాటంలో జమ్మూకాశ్మీర్ భాగమని ప్రచారం చేస్తున్న ఇస్లామిక్ స్టేట్ ఆఫ్ జమ్మూ అండ్ కాశ్మీర్, లష్కర్ ఇ ఇస్లాం, జీనత్ ఉల్ ఇస్లాం లాంటి తీవ్రవాద సంస్థల చేతుల్లోకి నాయకత్వం పోతుంది. అసంతృప్త యువతను అటువంటి సంస్థల చేతుల్లోకి నెట్టటం కాశ్మీర్‌కే కాక దేశానికి కూడా తీవ్ర ప్రమాదంగా పరిణమిస్తుంది. వివిధ వేర్పాటువాద, తీవ్రవాద గ్రూపుల కార్యకలాపాలకు జమ్మూకాశ్మీర్ కేంద్రంగా మారుతుంది. దాని దుష్పరిణామాలు దేశమంతటా విస్తరిస్తాయి. ఇటువంటి దుష్పరిణామాలకు దారితీయనున్న మోడి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను, సంఘ్ పరివార్ చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని ప్రజలలో ఎండగట్టాలి. జమ్మూకాశ్మీర్‌ను, దేశ సమైక్యతను కాపాడుకోవటం కోసం పోరాటం చేయటానికి దేశభక్తులందరూ ముందుకురావాలి. ❋

ఇంటర్వ్యూ

# సంఘ్ పరివార్ దురాగతాలకు తెరపడుతుంది

**(డాక్యుమెంటరీ చిత్ర నిర్మాత ఆనంద్ పట్వర్ధన్‌తో ఫ్రంట్‌లైన్ పక్షపత్రిక విలేకరి జియా ఉస్ సలాం చేసిన ఇంటర్వ్యూను మార్క్సిస్టు పాఠకులకు అందిస్తున్నాం- సంపాదకులు)**

**- ఆనంద్ పట్వర్ధన్**



ఆయన తాను నిర్మించే చిత్రంలో ప్రతి ఫ్రేమ్‌లో వచ్చే పదాలను నిశితంగా గమనిస్తుంటారు. అవి కొంతమందిని నొప్పించినా ఆయన చిత్రాలు అనునిత్యం చర్చనీయాంశాలుగా మారుతుంటాయి. ఆయనే డాక్యుమెంటరీ చిత్ర నిర్మాత ఆనంద్ పట్వర్ధన్.. ప్రస్తుతం ఉవ్వెత్తున ఎగసిపడుతున్న హిందూత్వ అలలకు ఎదురొడ్డి నిలిచే గళాలలో ఆయన కూడా ఒకరు. నరేంద్ర దభోల్కర్, గోవింద్ పన్సారే తదితర హేతువాదుల హత్యలు, మహ్మద్ అక్లక్ వంటి ముస్లింలపై దాడులు, అంతర్లీనంగా కొనసాగుతున్న బ్రాహ్మణీయ అజెండా వంటి అంశాలు ప్రస్తుతం దేశంలో కొనసాగుతున్న మతోన్మాద హింసకు మూల కారణాలు. ఈ అంశాలకు వ్యతిరేకంగా ఆయన తన సహేతుక గళాన్ని విప్పారు. ఇటీవల ఆయన ఫ్రంట్‌లైన్ పక్ష పత్రిక ప్రతినిధి జియా ఉస్ సలాంకు ఇచ్చిన ఇంటర్వ్యూ విశేషాలు .... క్లుప్తంగా...

**-మీ 'రీజన్' వివాదాస్పదంగా మారి కలకలం సృష్టిస్తోంది. కేరళ చిత్రోత్సవంలో ఈ చిత్ర ప్రదర్శనకు న్యాయ జోక్యం కూడా అవసరమైంది. దీనిని మీరెలా విశ్లేషిస్తారు?**

దీనిని చాలా సులభంగా అర్థం చేసుకోవచ్చు. అప్రజాస్వామిక, మెజార్టేరియన్ శక్తులు ప్రస్తుతం కేవలం అధికారంలో వుండటం మాత్రమే కాక అన్ని వ్యవస్థలనూ నియంత్రిస్తున్నాయని చిత్రం చెబుతున్నది. మన వ్యవస్థలో ఎక్కడా తనిఖీలు, సమతుల్యతలు పాటించటం లేదు. దీనికి ముందు అమలులో వున్న కొన్ని నియంత్రణలు సైతం ఇప్పుడు కనుమరుగైపోయాయి.

**-మీ చిత్రం హిందూత్వ ఉగ్రవాదాన్ని నగ్నంగా చూపెడుతోంది. అయితే ప్రధాని నరేంద్రమోడీ, హోం మంత్రి అమిత్ షా హిందూత్వ ఉగ్రవాదం అన్న భావననే వ్యతిరేకిస్తున్నారు. ఈ భావనను ఎదుర్కొనేందుకు వారు ఉగ్రవాద నిందితులనే రంగంలోకి దింపారు. అసలు హిందూత్వ ఉగ్రవాదం మూలం ఏమిటో చెబుతారా?**

ఎదుటి వారు హిందూత్వ ఉగ్రవాదం అన్న మాటలు ఉచ్ఛరించిన వెంటనే దానికి వ్యతిరేకంగా గావుకేకలు వేయటం మోడీ-షా ద్వయం ఎంచుకున్న ఎదురుదాడి విధానం. మనం ఎన్ని ఆధారాలు చూపినప్పటికీ ప్రజలకు పూర్వం నుండి నూరిపోసిన 'హిందూమతం సహనశీలం, అహింసాత్మకం' అన్న సిద్ధాంతమే గుర్తుంటుంది తప్ప మనం చూపుతున్న సమస్య వారి చెవికెక్కటం లేదు. ఇందుకు ప్రధాన కారణం కుల వ్యవస్థ. వేలాది సంవత్సరాలుగా ఆస్తిక (బ్రాహ్మణీయ) హిందూమతం కుల వ్యవస్థను బలహీనులు, స్త్రీవాదులపై హింసాత్మకంగా రుద్దింది. ఈ అణచివేతకు వ్యతిరేకంగా గత కొన్ని శతాబ్దాలుగా బుద్ధుడు, కబీర్, జ్యోతిరావ్ పూలే, బసవణ్ణ, ఇవి రామస్వామి, బిఆర్ అంబేద్కర్, గాంధీ వంటి అనేక మంది సంస్కరణవాదులు, విప్లవ నేతలు గళమెత్తారు. అంతమాత్రాన హిందూ సంస్కృతి సహనశీలమూ, అహింసాత్మకమైనదని చెప్పటానికి వీల్లేదు. మనం గత చరిత్రను ఒక్కసారి పరిశీలిస్తే మానవత్వం పరిమళించిన అనేక సందర్భాలు మనకు కన్పిస్తాయి. ఉదాహరణకు బుద్ధుడి కాలం నాటి రోజుల్లో ఆయన వ్యవహరించిన తీరు, వెలువరించిన బోధనలు అశోకచక్రవర్తిపై తీవ్ర ప్రభావాన్నే చూపాయి. మన చరిత్ర పుస్తకాలలో ఇటువంటి సందర్భాలు కోకొల్లలు. 'రీజన్' చిత్ర నిర్మాణ సమయంలో చారిత్రక విశేషాలను పరిశీలించినపుడు ఇటీవలి కాలంలో జరిగిన మానవ పునరుజ్జీవన ఉద్యమం ఒకటి నా దృష్టికి వచ్చింది. అయితే ఈ ఉద్యమం కేవలం స్వల్పకాలం మాత్రమే కొనసాగి, ప్రస్తుత రాజకీయాలతో అటకెక్కింది. ప్రస్తుతం ఈ ఉద్యమాన్ని దాదాపు అందరూ మర్చిపోయారు. హేతువాది డా.నరేంద్ర దభోల్కర్ హత్యానంతరం జరిగిన స్మారక సమావేశంలో గోవింద్ పన్సారే చేసిన ప్రసంగాన్ని పరిశీలిస్తే మనకు ఈ విషయం అర్థమవుతుంది. మహాత్ముడిని హత్య చేసిన సైద్ధాంతిక వాదులే దభోల్కర్‌ను కూడా హతమార్చారని ఆయన చెప్పారు. ఇందుకు సంబంధించి ఆయన ఒక వాస్తవాన్ని వెలువరించారు. మహాత్మునిపై బ్రాహ్మణీయ వాదులు దాదాపు ఏడు సార్లు హత్యాయత్నం చేశారట. 1934లో పుణే నగరంలో గాంధీ మోటార్‌సైకిల్‌పై వస్తున్నపుడు తొలిసారి ఈ హత్యాప్రయత్నం జరిగిందని ఆయన చెప్పారు. ఈ ప్రయత్నంలో భాగస్వామిగా వున్న నారాయణ్ ఆప్టే తరువాత 1948లో జరిగిన గాంధీ హత్యలో కూడా భాగస్వామిగా వున్నాడు. మరో మాటలో చెప్పాలంటే బ్రాహ్మణీయ వాదులు గాంధీని హతమార్చేందుకు దాదాపు దశాబ్ద కాలం పాటు ప్రయత్నించారు. ఎట్టకేలకు 1948లో నాథూరామ్ గాడ్సే గాంధీని హత్య చేశాడు. దేశ విభజన, పాకిస్తాన్ అవతరణ సమయంలో గాంధీ

ముస్లింలకు అనుకూలంగా వ్యవహరించటమే ఆయన్ను తాను హత్య చేయటానికి కారణమని గాడ్సే స్పష్టం చేశాడు. అయితే పన్సారే చెబుతున్న దాని ప్రకారం 1934 నాటికి దేశ విభజన ప్రస్తావన కానీ, పాకిస్తాన్ ఏర్పాటు విషయం కానీ తెరపైకి వచ్చిన దాఖలాలు లేవు. గాంధీ ముస్లింలను సమర్థించినందుకే ఆయన్ను హత్య చేశారనటం సరైన వాదన కాదు. గాంధీ తన చర్యల ద్వారా తమను ఏకాకులను చేశాడన్న కోపమే వారిని ఈ హత్యకు పురిగొల్పింది. గాంధీ ఆనాడు తనంత తానుగా పారిశుధ్య కార్యక్రమాలను చేపట్టటం ద్వారా పరిశుభ్రత అన్నది కుల వ్యవస్థలో లేదన్న విషయాన్ని ప్రజలకు చాటి చెప్పాడు. 1932 నాటి రౌండ్ టేబుల్ సమావేశంలో నాటి బ్రిటిష్ ప్రభుత్వం అంబేద్కర్ డిమాండ్ చేసిన దళితులకు (ముస్లింల తరహాలోనే) ప్రత్యేక ఎన్నికల విధానాన్ని మంజూరు చేసింది. అయితే ఇది సమాజంలో చీలికలకు దారి తీస్తుందని వాదించిన గాంధీజీ, కుల వివక్షను విడనాడాలని అగ్రవర్ణాలకు నచ్చచెప్పేందుకు కొంత సమయం కావాలని కోరాడు. ఈ ప్రయత్నం కూడా విఫలం కావటంతో ఆయన ఆమరణ నిరశన దీక్షకు కూర్చున్నాడు. గాంధీ ఈ ప్రయత్నం ద్వారా దళితులకు ప్రత్యేక ఎన్నికల విధానం బదులు రిజర్వేషన్లు అమలు చేయాలంటూ అంబేద్కర్‌ను 'బ్లాక్‌మెయిల్' చేసేందుకు ప్రయత్నించాడన్న వార్తలు రావటంతో ఈ ప్రయత్నం కూడా విఫలమైంది.

**–హిందూత్వ ఉద్యమం గత ప్రముఖులను సెలెక్టివ్‌గా తెరపైకి తెస్తోంది. ఉదాహరణకు వారు శివాజీ, విడి సావర్కర్, ఎంఎస్ గోల్వాల్కర్, కెబి హెగ్డేవార్ వంటి ప్రముఖులను ప్రస్తావిస్తారు తప్ప గుప్త వంశపు రాజులు, మహాజనపదుల వంటి వారిని ఊహల్లోకి కూడా రానివ్వటం లేదు. మరోవైపు అక్బర్, టిప్పు సుల్తాన్ వంటి ముస్లిం రాజులకు మతం రంగు పులిమేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ అంశాలను ఏ విధంగా ముడిపెడతారు..?**

రీజన్ చిత్రం చరిత్రలోని భిన్న కోణాలలో ఒక కోణాన్ని మాత్రమే చూపుతుంది. ఇప్పుడు మొగలుల చెర నుండి భారత దేశాన్ని కాపాడిన ఛాంపియన్‌గా శివాజీని కొలుస్తున్నారు. అయితే ఇటు శివాజీ సైన్యంలో ముస్లింలు, అటు మొగలుల సైన్యంలో హిందువులు వున్న విషయాన్ని ప్రస్తావిస్తున్న కామ్రేడ్ గోవింద్ పన్సారే శివాజీ, మొగలుల మధ్య జరిగిన పోరు మతపరమైనది కాదన్న విషయాన్ని స్పష్టం చేస్తున్నారు. అంతేకాదు శివాజీ సైన్యంలో అన్ని కులాల వారూ, రైతులు వున్న విషయాన్ని ఆయన ప్రముఖంగా ప్రస్తావిస్తున్నారు. అయితే హిందూ అగ్రవర్ణాల వైభవాన్ని చాటి చెప్పేందుకు పరివార్‌లు చరిత్రను వక్రీకరిస్తున్నది. మొగల్ చక్రవర్తి అక్బర్, రాణా ప్రతాప్‌ల మధ్య జరిగిన హల్దీఘాటి పోరుకు కూడా వారు కులం రంగు పులుముతున్నారు. అయితే ఆరెస్సెస్ కేవలం ఈ ఒక్క చరిత్రను మాత్రమే తిరగరాయటం లేదు. బ్రిటిష్ పాలనా కాలానికి కూడా వారు తమ సైద్ధాంతికతను అంటగడుతున్నారు. మధ్యయుగాల నాటి భారతంలో ఐరోపా భాషాబోధకులు బ్రాహ్మణీయ సంస్కృత పాఠాలను బోధించిన కాలాన్ని వారు 'స్వర్ణయుగం' అని పిలుస్తున్నారు. భారతీయ సైనికులతో తమసైన్యాన్ని నిర్మించుకోవాలని చూసిన నాటి బ్రిటిష్ పాలకులు నాటి 'ముస్లిం దురాక్రమణ'దారులతో పోరాడిన రాజపుత్ర పాలకుల వంటి 'యుద్ధ జాతుల'వైపు మొగ్గు చూపారు. బ్రిటిష్ పాలకుల తరువాత ఈ చారిత్రక పరిణామాలను సమర్థించే భారాన్ని బాలీవుడ్ తన భుజాలకెత్తుకుంది. సంజయ్ లీలా భన్సాలీ నిర్మించిన పద్మావత్ చిత్రం ఇందుకు తాజా ఉదాహరణగా చెప్పవచ్చు.

**–సంఘ్ పరివార్, బిజెపి చెబుతున్న జాతీయ వాదం బ్రాహ్మణీయ వాదానికి మరోపేరు కాదంటారా? ఇప్పుడు బ్రాహ్మణీయ వాదం అంతా జాతీయ జెండా నీడన చేరిందని, దీనిని బలపర్చే వారు ఇప్పుడు మూగపోయి నిరుద్యోగులుగా మారారని మీరు 'రీజన్'లో చూపారు కదా?**

అవును... ఇప్పుడున్నది పాత రోజుల నాటి పిలకలు, విభూది బట్లు ధరించిన పూజారుల కాలం నాటి బ్రాహ్మణీయం కాదు. ఇది ఆధునిక బ్రాహ్మణీయం... బ్రాహ్మణులు ఇప్పుడు మైనార్టీలను అదిరించి బెదిరించి జాతీయవాదం వైపు మళ్లించే ప్రయత్నం చేస్తున్నారు. ప్రధాన జాతీయవాద ఉద్యమానికి వ్యతిరేకంగా నాటి హిందూత్వ వాద నేతలు బ్రిటిష్ ప్రభుత్వంతో కుమ్మక్కయినట్లు రికార్డులు చెబుతున్నాయి.

**–'రీజన్'లో మీరు దబోల్కర్, పన్సారే వంటి హేతువాదుల గురించి మాట్లాడారు. గణేశుడిది తొలి ప్లాస్టిక్ సర్జరీ అంటూ ప్రధాని స్వయంగా పుక్కిట పురాణాలను ప్రస్తావిస్తున్న సమయంలో సైన్స్, హేతువాదం గురించి మాట్లాడుతూ మీరు చేసింది పెద్ద రిస్కే కదా?**

మన రాజకీయ నేతల నోటి నుండి వెలువడే గుడ్డి నమ్మకాల సమర్థింపు అంతా పూర్తి నాన్సెన్స్... అయితే ఇంతకన్నా పెద్ద నాన్సెన్స్ మనకు టెలివిజన్‌లలోనూ, సోషల్ మీడియాలోనూ కన్పిస్తోంది. కొంతమంది విద్యావంతులైన ఉన్నతస్థాయి అధికారులు, నేతలుకూడా ఈ ఊబిలో కూరుకుపోతుండటం ఆశ్చర్యకరమైన విషయం.

**–మీ చిత్రంలో హేమంత్ కర్కరే అంశం కూడా ప్రస్తావించారు. మీ పరిశోధనలో ఆయన్ను కూడా హత్య చేశారని తేలిందా? ఎందుకంటే ఉగ్రవాద నిందితులైన వారు ఇటీవలి ఎన్నికల్లో బిజెపి టికెట్లపై గెలుపొంది ఆయన మరణంపై ఆమోదయోగ్యం కాని వ్యాఖ్యలు చేస్తుండటంతో ఈ ప్రశ్న అడగాల్సి వస్తోంది.**

2008 నాటి ముంబయి ఉగ్రదాడుల గురించి నేను అనేక పుస్తకాలు పరిశీలించాను. దాడులు జరుగుతున్న సమయంలో వెలువడిన కోర్టు తీర్పులు, రికార్డయిన టీవీ వార్తా కార్యక్రమాలను కూడా పరిశీలించాను. ఈ ఘటనలకు సంబంధించిన వాస్తవాలకు అధికారిక వివరణలలో స్థానం దక్కలేదని నేను ఘంటాపథంగా చెప్పగలను. వాస్తవాలకు మసిపూసి మారేడు కాయ చేశారు. ఈ దాడుల్లో పాకిస్తాన్ ఉగ్రవాద తండాల హస్తం వుందన్న విషయాన్ని ఎవరూ కాదనలేరు. అయితే నాటి దాడులకు బోట్లలోవచ్చిన పాకిస్తానీ ఉగ్రవాదులకు అమెరికా ఇంటెలిజెన్స్ మార్గదర్శనం చేసిందన్న విషయం నా పరిశీలనలో వెల్లడయింది. ఈ కీలక సమాచారాన్ని భారత ఇంటెలిజెన్స్ వ్యవస్థలు


## 'మార్క్సిస్టు' పై మీ అభిప్రాయాలు తెలపండి!

'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రిక పైనా, పత్రికలోని నిర్దిష్ట వ్యాసాలపైనా మీ అభిప్రాయాలనూ, సూచనలనూ ఆహ్వానిస్తున్నాం. ఆయా వ్యాసాలపై మీరు చర్చించాల్సిన అంశాలున్నా, అదనపు సమాచారమున్నా క్లుప్తంగా రాసి పంపండి.

మీ లేఖలు అందాల్సిన చిరునామా!

**ఎడిటర్, మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక), ఎం.బి. విజ్ఞానకేంద్రం,**

**డోర్ నెం. 27-30-3, ఆకులవారి వీధి, గవర్నర్‌పేట,**

**విజయవాడ-520 002**

# పోపూరి రామారావు

(2వ పేజీ తరువాయి)

ఉన్న రైతులు, కూలీలు, కార్మికులకు తలలో నాలుకలా వ్యవహరిస్తూ, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేశారు. గ్రామాల్లో యువజనుల్ని ఆర్గనైజ్ చేయటంలో పోపూరి రామారావుది ప్రత్యేక శైలి. నిరంతరం వారికి దిశానిర్దేశం చేస్తూ చైతన్యపరిచేవాడు. యువకుల సమస్యలపై ఆయన రచించి, రూపొందించిన నాటకం 'ఇదేనా నాదేశం ' ప్రజల మన్ననలు పొందింది.

భూస్వాముల్ని ఎదిరించి చెరువు భూమిని నివాస స్థలాలుగా మార్పు చేయటానికి రామారావు పెద్ద ఎత్తున కృషి చేశాడు. కిలోబియ్యం రెండ్రుపాయలుంటే... కూలి మాత్రం రూ. 1.50లు ఉన్న సమయంలో కూలిని రూ.2లకు పెంచాలని, వ్యవసాయ కార్మికులు జరిపిన సమ్మె పోరాటంలో రైతుల్ని కూలి పెంపుదలకు ఒప్పించిన దిట్ట. దివిసీమ తుఫాను ప్రభావిత ప్రాంతంగా ఈ ప్రాంతాన్ని గుర్తించాలని 10రోజులపాటు కలెక్టరేట్ ఎదుట దీక్షలు చేయించారు. 11వ రోజు కలెక్టరేట్ ముట్టడికి ప్రజలు వస్తున్న వాహనాలను ప్రభుత్వం, పోలీసులు అడ్డగిస్తే నేషనల్ హైవే పైనే ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకూ బైఠాయించారు. వేలాది మంది ప్రజలు పోగైనారు. దీంతో అప్పటి కలెక్టర్ 3 కిలోమీటర్లు నడిచి రైతుల వద్దకు వచ్చి ఈ ప్రాంతాన్ని తుఫాన్ ప్రభావిత ప్రాంతంగా గుర్తిస్తున్నామని హామీ ఇచ్చి రాస్తారోకోను విరమింపచేశారు. సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ద్వారా తుఫాను బాధిత రైతులకు రుణాలు రద్దు చేయటంలో, కొత్త రుణాలు ఇప్పించటంలో కీలక పాత్ర పోషించారు. కాసు వెంగళరెడ్డి ముఠా రాజకీయాలకు నెలవైన యడ్లపాడు గ్రామంలో ఘర్షణలను నివారించి, శాంతిని నెలకొల్పటంలో ముఖ్యభూమిక పోషించాడు. ఫలితంగా తర్వాత జరిగిన సమితి ఎన్నికల్లో గ్రామంలో 2700 ఓట్లు పోలైతే 2500 ఓట్లు రామారావుకు దక్కటం ప్రజల ఆదరణకు నిదర్శనం. సాగర్ జలాలను ఆ ప్రాంతంలో కాలువ చివరి భూములకు రప్పించటంలో కృషి చేశారు. చిలకలూరిపేట, నర్సరావుపేట, సత్తెనపల్లి ప్రాంతాల్లో బెటర్‌మెంట్ ట్యాక్స్ రూ.300 కోట్లు రద్దు చేయించటంలో పుతుంబాక వెంకటపతితో కలిసి ఉద్యమంలో పనిచేశారు. పార్టీలో పార్లమెంటరీ ధోరణలకు వ్యతిరేకంగా నిర్మాణాత్మకమైన పాత్ర పోషించే వారు. ముక్కు సూటిగా మాట్లాడేవారు. అదే సందర్భంగా కార్యకర్తల పట్ల ప్రేమగా వ్యవహరిస్తూ, కార్యకర్తల సమస్యల పరిష్కారానికి ఎంతో సున్నితంగా వ్యవహరించారు. ప్రజా ఉద్యమాల బలోపేతంలో కళారూపాల పాత్ర ఎంత కీలకమని ఆయన గుర్తించాడు. గ్రామంలో గత 18 సంవత్సరాలుగా సుందరయ్య పేరుతో నాటకోత్సవాలు దిగ్విజయంగా నిర్వహించటం ఆయన ప్రోత్సాహమే. యడ్లపాడును కళలకు కేంద్రంగా తీర్చిదిద్దారు. చిలకలూరిపేట డివిజన్ పార్టీ కార్యాలయ పునరుద్ధరణ, యడ్లపాడులో కార్యాలయ నిర్మాణానికి కృషి చేశారు. పాలపర్రు మృత వీరుల సభను, తుమ్మలపాలెంలో మృత వీరుల సభలను ప్రతి ఏటా ఎంతో ఘనంగా నిర్వహించటానికి అన్ని విధాలుగా తోడ్పడ్డారు. పీడిత వర్గాల ప్రజలకూ ఆప్త మిత్రుడిగా ఉన్న రామారావు జీవితం అందరికీ ఆదర్శనీయం.

---

కోస్ట్‌గార్డ్‌కు గానీ, నౌకాదళానికి కానీ తెలియచేయలేదు. అందుకు బదులుగా పాకిస్తానీ ఉగ్రవాదుల దాడిని అడ్డం పెట్టుకుని హిందూత్వ ఉగ్రవాదులు కర్కరేను నిర్మూలించేందుకు సమాంతర దాడిని ప్రారంభించారు. ఆ సమయంలో హిందూత్వ ఉగ్రవాద గూండాల దాడుల గురించిన సమాచారాన్ని వెలుగులోకి తెచ్చేందుకు కర్కరే ప్రయత్నించారు. హిందూత్వ ఉగ్రవాదుల నుండి స్వాధీనం చేసుకున్న లాప్‌టాప్‌లలో కొంతమంది సీనియర్ రాజకీయ నేతలు, సైనికాధికారులు, బిల్డర్లు, వజ్రాల వ్యాపారులు, ఇతర ప్రముఖులు ఉగ్రవాదులతో జరిపిన భేటీలకు సంబంధించిన ఆడియో, వీడియో రికార్డింగ్‌లు వెలుగు చూశాయి. దీనిని కదిపితే ఇదో కందిరీగల తుట్టె అవుతుంది. నాటి ముంబయి దాడులు ఈ లక్ష్యాన్ని సాధించాయి. వారు కేవలం కర్కరేను మాత్రమే హత్య చేయలేదు. హిందూత్వ ఉగ్రవాదం నుండి దేశం దృష్టిని మళ్లించటంలో కూడా విజయం సాధించారు.

**–మీ 'రీజన్'లో గోగూండాయిజంపై కూడా దృష్టి పెట్టారుకదా? గోల్వాల్కర్ ప్రతిపాదించిన బహిష్కరణ వాద అజెండాను ముందుకు తీసుకెళ్లేందుకు గో గూండాయిజం ఒక సాకు కాదు కదా?**

'ఇన్ ది నేమ్ ఆఫ్ కౌ' అన్న చాప్టర్‌లో దాద్రీలో మహమ్మద్ అఖ్లాక్, గుజరాత్‌లోని యునాలో దళిత యువకులపై దాడుల వంటి వాటిని ప్రస్తావించాను. ప్రపంచంలో గొడ్డు మాంసం భారీగా ఎగుమతి చేసే దేశాలలో భారత్ ఒకటి. గొడ్డుమాంసం తినేవారు, పశు చర్మవ్యాపారుల వంటి వారిపై చేసిన దాడులు ముస్లింలు, దళితులపై జరుగుతున్న దాడులకు మరోపేరనని చెప్పక తప్పదు.

**–అధికారంలో ఎవరున్నా సరే... మీ చిత్రాలన్నీ వివాదాలకు కేంద్రాలవుతుంటాయి. ఇందుకు మీకు ప్రేరణనిచ్చేది ఏ అంశం? ముఖ్యంగా దబోల్కర్, పన్సారే, కల్బుర్గి, గౌరీలంకేష్ వంటి సాహసోపేత గళాలను మూగపోయేట్టు చేస్తున్నకాలంలో మనం కొనసాగుతున్నందున ఈ ప్రశ్న సంధిస్తున్నాం.**

నేను గత నాలుగు దశాబ్దాలుగా చిత్రాలను నిర్మిస్తున్నాను. ఇందులో ఎక్కువ కాలం కాంగ్రెస్ పార్టీ అధికారంలో వుంది. కొన్ని సందర్భాలలో ఇతర పార్టీలు కూడా కేంద్రంలో అధికారంలో కొనసాగాయి. నా చిత్రాలను ఎవరూ ఆమోదించలేదు. అన్ని సందర్భాలలోనూ నా చిత్రాలకు సెన్సార్ అనుమతి కోసం, దూరదర్శన్ ప్రసారాల కోసం నేను ఆరు కేసులు హైకోర్టులోనూ, రెండు కేసుల్లో సుప్రీంకోర్టు లోనూ విజయం సాధించాను. దీని ద్వారా భావ ప్రకటనా స్వేచ్ఛకు బిజెపి బద్ధ శత్రువు అన్న విషయాన్ని స్పష్టం చేయదల్చుకున్నాను. వారు ఎప్పుడు అధికారంలోకి వచ్చినా నా పోరు కొంత క్లిష్టతరమయ్యేది. కేరళలో నిర్వహించిన అంతర్జాతీయ డాక్యుమెంటరీ, షార్ట్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ప్రదర్శనకు 'రీజన్' ఎంపికయింది. చివరి నిముషంలో కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని ఈ చిత్ర ప్రదర్శనను ఆపివేసింది. దీనిపై తీవ్రంగా స్పందించిన చిత్రోత్సవ నిర్వాహకులూ, నేనూ కేరళ హైకోర్టును ఆశ్రయించాం. ఎప్పటి మాదిరిగానే ఈ రీజన్ ప్రదర్శనతో శాంతి, భద్రతల సమస్య తలెత్తుతుందని కేంద్రం వాదించింది. అటువంటి సందర్భాలలో ప్రభుత్వ బాధ్యత భద్రత కల్పించటమే తప్ప చిత్ర ప్రదర్శనను నిషేధించటం కాదంటూ కోర్టు తీర్పు వెలువరించింది. అయితే రాష్ట్ర ప్రభుత్వం నాకు అండగా నిలిచినా, కేరళ వంటి అవకాశాలు దురదృష్టవశాత్తు నాకు అందుబాటులోకి రాలేదు. హేతువాదుల హత్యల ప్రస్తావనలో సెన్సార్‌షిప్ నాకు తలనొప్పిగా మారింది. అయితే నేను నిరంతర ఆశావాదిని. దేశంలో ఫాసిజం వేళ్లూనుకుపోతుందని నేను భావించటం లేదు. ఫాసిజానికి తెరపడే రోజు కూడా వస్తుంది. దీనిని సాధ్యమైనంత త్వరగా సాకారం చేయటమే నా కర్తవ్యం. ❋

RNI Reg. No. APTEL/2006/17554 Posted on 05-09-2019 (36 pages) Postal Regd. No D/VJ/172/2018-20

# అణచివేయబడుతున్న ప్రజలకు విప్లవ శక్తులు వర్గ పోరాటాన్ని గురించిన వాస్తవ విషయాలను వివరించాలి.



- అంటోనియో గ్రాంసి

ఫాసిజం ప్రారంభమైన క్రమాన్ని అనుసరించి దాని అభివృద్ధి, అది ఎదుర్కొంటున్న సంక్షోభం తదితరాలను సులభంగా వివరించవచ్చు. మొదటి ప్రపంచ యుద్ధానంతరం ఫాసిజం ప్రారంభమైంది. పెటీబూర్జువా వర్గానికి చెందిన అనుభవజ్ఞుల సంఘాలు దానితో మమేకమయ్యాయి. సోషలిజం పట్ల ఉన్న దృఢమైన వ్యతిరేకత వలన అది బూర్జువా వర్గం, ఉన్నతాధికారుల మద్దతు పొందింది. యుద్ధకాలంలో సోషలిస్టు పార్టీ, జోక్యందారీ సంస్థల మధ్య నెలకొన్న విభేదాలు దానికి వారసత్వంగా వచ్చాయి. పెరుగుతున్న కార్మికసంఘాలను ఎదుర్కోవటానికి వైట్‌గార్డులను ఏర్పాటు చేయటం అవసరమని గ్రామీణ భూస్వాములు భావిస్తున్న తరుణంలో ఇది ఏర్పాటైంది. పెద్ద భూస్వాములు అప్పటికే ఏర్పాటు చేసిన సాయుధ గ్యాంగులు ఫాసిజం పేరును తామూ ఆమోదించాయి. ఆ తర్వాత ఈ గ్యాంగులు వైట్‌గార్డులుగా మార్పుచెందాయి. శ్రామికవర్గ వర్గసంఘాలకు వ్యతిరేకంగా పెట్టుబడిదారీ వ్యవస్థ ప్రయోజనాలను పరిరక్షించే వైట్‌గార్డులుగా ఇవి రూపుదాల్చాయి. తన ప్రారంభ కాలంలోని ఈ లక్షణాల అవశేషాలను ఫాసిజం ఇప్పటికీ కలిగివున్నది. సాయుధంగా ఈ గ్రూపులు చేస్తున్న దాడులు మధ్యతరగతి నుండి పచ్చిన పట్టణ గ్రూపులు, గ్రామీణప్రాంతంలోని పెద్ద, మధ్యతరగతి భూస్వాములు, వారి కౌలురైతులతో కూడిన గ్రూపుల మధ్య వైరుధ్యాలను తాత్కాలికంగా కప్పిపెట్టాయి.

గ్రామీణ ప్రాంతాలలోని ఫాసిస్టు గ్రూపులు పేదరైతులు, వారిసంఘాలకు వ్యతిరేకంగా పోరాటం సాగించాయి. అవి శ్రామికసంఘాలపై తీవ్రమైన వ్యతిరేకతతో అభ్యుదయ నిరోధకమైనవిగా ఉన్నాయి. పార్లమెంటు సమర్ధత, రాజ్యం యొక్క అధికారం కన్నా ముఖాముఖి సాయుధచర్యలపైనే అవి ఎక్కువ విశ్వాసం కలిగివున్నాయి. వ్యవసాయ ప్రాంతాలలో ఈ సంస్థలు ఎక్కువ అభివృద్ధిని సాధించాయి. పెట్టుబడిదారుల ద్రవ్య మద్దతు, పౌర, సైనికాధికారుల రక్షణతో అవి అవధులు లేని అధికారాన్ని సంపాదించాయి. శ్రామికవర్గ సంఘాలపై వీరు చేస్తున్న దాడులు పెట్టుబడిదారీ వర్గానికి సంతోషం కలిగించాయి. సంవత్సరకాలంలో సోషలిస్టు సంఘాల నిర్మాణాన్ని ధ్వంసం చేసి, వాటిని శక్తిహీనంగా మార్చాయి. ఐనప్పటికీ ఈ దాడి మరొక పరిణామానికి దారితీసింది. పెరుగుతున్న హింసాత్మక ఘటనలు మధ్యతరగతి, శ్రామికవర్గంలో ఫాసిజం పట్ల తీవ్ర వ్యతిరేకతను కలిగించాయి. సర్జానా, ట్రెవిసో, విటెర్బో, రోక్కస్ట్రాడాలలో జరిగిన ఘటనలు నగరాల్లో ఉన్న ఫాసిస్టు సంస్థలను కుదిపివేశాయి. ఫాసిజం వ్యతిరేక ఎత్తుగడలతో మాత్రమే పనిచేయటం వలన వ్యవసాయ ప్రాంతాలలో తీవ్రనష్టం సంభవిస్తుందని ముస్సోలిని భయపడ్డాడు. ఐనప్పటికీ పార్లమెంటులోనూ, దేశంలోనూ సోషలిస్టు పార్టీని రాజీ ధోరణిలో వ్యవహరించేలా చేయటంలో ఈ ఎత్తుగడలు ఇప్పటికే అద్భుతమైన ఫలితాలను సాధించాయి. పట్టణప్రాంతంలోని కొలాబరేషనిస్టు( శత్రువుతో రాజీపడే వారు)గ్రూపులు తమ లక్ష్యాన్ని సాధించినట్లు భావించాయి. వర్గదృక్పధంతో స్థిరంగా నిలబడటాన్ని సోషలిస్టు పార్టీ వదులుకున్నది. శాంతి ఒప్పందంతో ఈ విజయాన్ని అధికారికం చేసుకోవాలని ఫాసిస్టు గ్రూపులు తొందరపడుతున్నాయి. సమ్మెలు, కార్మిక సంఘాలతో ఎదురౌతున్న సమస్యల తలనొప్పిని తప్పించి, రైతాంగాన్ని స్వేచ్ఛగా దోపిడీ చేయటానికి అవకాశం కల్పించిన ఎత్తుగడలను వ్యవసాయ పెట్టుబడిదారులు వదులుకోలేదు.

శాంతి ఒప్పందం చేసుకుందామనే వారు, వ్యతిరేకిస్తున్న వారి మధ్య ఒప్పందంపై జరుగుతున్న వివిధ రకాలైన వాదనలు ఈ ప్రధానమైన వైరుధ్యం వద్దకు చేరాయి. ఈ విభేదాల మొలకలు ఫాసిస్టు ఉద్యమంలోనే ఉన్నాయి. ఫాసిజంలో సంక్షోభం కొత్తకాదు. అది ఎల్లప్పుడూ ఉంటుంది. ఐక్యత అవసరం తీరిపోగానే శ్రామికవర్గాన్ని వ్యతిరేకిస్తున్న గ్రూపుల మధ్య ఉన్న అనైక్యత తిరిగి ముందుకొస్తుంది. ఈ సంక్షోభం ఫాసిస్టులలో చీలిక తీసుకువస్తుంది. పేరు మార్చుకుని అయినా ఫాసిజం కొనసాగుతుంది. ప్రస్తుతం ఫాసిస్టు శిబిరంలో ఉన్న విభేదాల వలన శతృత్వాలు మొద్దుబారి ఉన్నాయి. విప్లవకరమైన కార్మికులు, రైతులు తమకు లభించిన ఈ అవకాశాన్ని వినియోగించుకొని, అణచివేయబడుతున్న, రక్షణ లేని ప్రజలకు వర్గ పోరాటాన్ని గురించిన వాస్తవ విషయాలను వివరించాలి. తీవ్రమౌతున్న పెట్టుబడిదారుల ప్రతీఘాతుక దాడులను ఓడించటానికి అవసరమైన సాధనాలను గురించి వారికి వివరించాలి.

**(1921 ఆగస్టు 25న అంటోనియో గ్రాంసీ రాసిన ఫాసిజం రెండు ముఖాలు వ్యాసంనుండి ఈ అంశాలు గ్రహించబడ్డాయి).**

Printed and Published by B.V. Raghavulu on behalf of CPIM AP Committee. Printed and Published at Prajasakti Printers & Publishers private Ltd. D .No 14-12-19, Krishna Nagar, Tadepalli (M) Guntur Dt. 9490098977, 9494101091.
Editor : S. Venkatarao, RNI Reg.No. APTEL/2006/17554. Vol.14, No.4. Published on September 1, 2019